www.velthuru.com
RNI TEL TEL/ 2019 / 78609
రంగారెడ్డి
VELTHURU TELUGU DAILY
# వెలుతురు
తెలుగు దినపత్రిక
గురువారం 22 మే 2025
సంపుటి :06 సంచిక : 351 , పేజీలు : 12 వెల:రూ.5/-




## ప్రభుత్వ పాఠశాలల అభివృద్ధికి, అంగన్వాడీల బలోపేతానికి కృషి చేస్తాం

- ఆదిలాబాద్ ఎంపీ నగేష్, ఎమ్మెల్యే పాయల్ శంకర్


**ఆదిలాబాద్ వెలుతురు మే 21:**
ప్రభుత్వ పాఠశాలల అభివృద్ధికి, అంగన్వాడీల బలోపేతానికి కృషి చేస్తామని ఆదిలాబాద్ ఎంపీ నగేష్, ఎమ్మెల్యే పాయల్ శంకర్ పేర్కొన్నారు, బుధవారం మావల మండలం దుబ్బగూడా లో పాఠశాల, అంగన్వాడి నిర్మాణం

## పాకిస్తాన్‌లోనే పెళ్లి

- దేశ రహస్యాలు పాక్‌కు చేరవేత
- ట్రావెల్ జో పేరుతో పర్యటనలు
- పాక్ హైకమిషన్ కార్యాలయంలో డానిష్‌తో సంబంధాలు
- జ్యోతి మల్హోత్రా విచారణలో విస్తుపోయే నిజలు



**న్యూఢిల్లీ,మే21( వెలుతురు):**
గూఢచర్యం కేసులో అరెస్టయిన హర్యానాకు చెందిన యూట్యూబర్




## జస్టిస్ వర్మపై ఎఫ్ఐఆర్ దాఖలు చేయాలి

- పిటిషన్ తోసిపుచ్చిన సుప్రీం ధర్మాసనం

**న్యూఢిల్లీ,మే21( వెలుతురు):**
అక్రమ నోట్ల కట్టలు వెలుగుచూసిన కేసులో హైకోర్టు జడ్జి యశ్వంత్ వర్మపై

# తుపాకులతో గర్జించిన ఛత్తీస్‌ఘఢ్

- మావోయిస్టులకు భారీ ఎదురుదెబ్బ
- అగ్రనేత,పార్టీ ప్రధాన కార్యదర్శి నంబాల కేశవరావు హతం
- ధృవీకరించిన హోంమంత్రి అమిత్ షా
- వచ్చే మార్చి కల్లా మావోయిస్టుల అంతం చేస్తాం
- గణపతి తరవాత బాధ్యతలో చేపట్టిన నంబాల
- కోటిన్నర రివార్డు ఉన్నట్లు పోలీస్ అధికారుల వెల్లడి



**బీజాపూర్,మే21( వెలుతురు):**
ఛత్తీస్‌గఢ్ మరోసారి తుపాకీ మోతతో దద్దరిల్లింది. మావోయిస్తులకు భారీ దెబ్బ పడింది. ఎన్‌కౌంటర్‌లో అగ్రనేత సహ మొత్తం 27మంది హతమయ్యారు. ఛత్తీస్‌గఢ్‌లోని నారాయణపూర్ జిల్లాలో జరిగిన ఎదురుకాల్పుల్లో మావోయిస్టు అగ్ర నేత నంబాల కేశవరావు (70) అలియాస్ బసవరాజు మృతి చెందారు. ఈ విషయాన్ని కేంద్ర హోం మంత్రి అమిత్‌షా ఎక్స్‌లో వెల్లడించారు. బుధవారం ఉదయం జరిగిన ఎన్‌కౌంటర్‌లో 27 మంది మావోయిస్టులు మృతి చెందారు. వారిలో నంబాల కేశవరావు ఉన్నట్లు పోలీసులు ధ్రువీకరించారు. కేశవరావుపై రూ. 1.5కోట్లు రివార్డు ఉందని తెలిపారు. 'నక్సలిజం నిర్మూలనలో ఇదొక మైలు రాయి విజయం అంటూ అమిత్ షా పేర్కొన్నారు. ఛత్తీస్‌గఢ్‌లోని నారాయణ్‌పూర్‌లో జరిగిన ఆపరేషన్‌లో 27మంది మావోయిస్టులు మృతిచెందారు. వీరిలో మావోయిస్టు పార్టీ ప్రధాన కార్యదర్శి, నక్సల్ ఉద్యమానికి వెన్నెముకగా ఉన్న నంబాల కేశవరావు అలియాస్ బసవరాజు ఉన్నారు. నక్సలిజానికి వ్యతిరేకంగా కొనసాగిస్తున్న మూడు దశాబ్దాల పోరులో ప్రధాన కార్యదర్శి స్థాయి కలిగిన నేత మృతి చెందడం ఇదే



## నేడు కరీంనగర్‌లో హిందూ ఏక్తా యాత్ర



- గత 12 ఏళ్లుగా హనుమంతి జయంతి రోజున ఏక్తా యాత్ర నిర్వహిస్తున్న బండి సంజయ్
- రాజకీయాలకు అతీతంగా హిందువులను సంఘటితం చేయడమే లక్ష్యంగా కొనసాగుతున్న యాత్ర
- పెహల్గాం అనంతరం పరిణామాల నేపథ్యంలో హిందుత్వవాదుల్లో పెరిగిన జోష్...
- ఈసారి కనీవినీ ఎరగని రీతిలో ఏక్తా యాత్రకు 50 వేల మంది వస్తారని అంచనా
- హిందూ సంస్కృతి, సంప్రాదాయాలు ఉట్టిపడేలా... సంఘటిత శక్తిని చాటేలా ఏక్తా యాత్ర
- "హిందూ ఏక్తా యాత్ర"లో పాల్గొననున్న సామాజిక సమరసత కన్వీనర్ అప్పాల ప్రసాద్
- ఇప్పటికే సంఘీభావం ప్రకటించిన వివిధ కుల, వృత్తి, కార్మిక, ధార్మిక సంఘాలు



**కరీంనగర్ వెలుతురు మే 21:**
హిందూ సంఘటిత శక్తిని చాటడమే లక్ష్యంగా కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ నేడు(గురువారం) కరీంనగర్ లో నిర్వహిస్తున్న "హిందూ ఏక్తా యాత్ర"పై సర్వత్రా ఆసక్తి నెలకొంది. ముఖ్యంగా పెహల్గాం ఘటన నేపథ్యంలో దేశ

## కాంగ్రెస్, బిజెపి కుమ్మక్కు రాజకీయాలు

- కెసిఆర్‌కు నోటీసుల వెనక రెండు పార్టీల కుట్ర
- ఎన్ని నోటీసులు ఇచ్చిన ధైర్యంగా ఎదుర్కొంటాం
- కెసిఆర్‌కు నోటీసులపై కెటిఆర్ విమర్శలు

**నల్లగొండ,మే21( వెలుతురు):**
నోటీసులు ఎన్ని ఇచ్చినా ధైర్యంగా ఎదుర్కొంటామని,బిఆర్ఎస్ అధినేత, మాజీ ముఖ్యమంత్రి కెసిఆర్‌కు ఇచ్చిన నోటీసులపై బిఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కెటిఆర్ స్పందించారు. చట్టాలు, న్యాయ వ్యవస్థపై తనకు నమ్మకం ఉందని, కాంగ్రెస్, బిజెపి ఆడుతున్న నాటకంలో



## ట్రంప్ ఒత్తిడికి కేంద్రంలోని మోదీ ప్రభుత్వం తలొగ్గిందని సీఎం రేవంత్ రెడ్డి వ్యాఖ్యలు చేయడం ఆయన అజ్ఞానానికి నిదర్శనం...

- బీజేఎల్పీ నేత ఏలేటి మహేశ్వర్ రెడ్డి

**హైదరాబాద్ వెలుతురు మే 21:**
పాకిస్తాన్ తో పోరులో కేంద్రంలోని మోదీ గారి ప్రభుత్వం అమెరికా అధ్యక్షుడు ట్రంప్ ఒత్తిడికి తలొగ్గిందంటూ సీఎం రేవంత్ రెడ్డి గారు తాజాగా రాజీవ్ గాంధీ వర్థంతి సభలో మాట్లాడడం ఆయన అజ్ఞానానికి నిదర్శనమని బిజెపి శాసనసభా పక్ష నేత ఎలేటి మహేశ్వర్ రెడ్డి ఘాటుగా విమర్శించారు. ఈ మేరకు బుధవారం రోజున ఓ పత్రిక ప్రకటన విడుదల చేశారు. అందులోని అంశాలు ఏంటంటే ...దేశ





(మొదటి పేజీ తరువాయి..)

## ప్రభుత్వ పాఠశాలల అభివృద్ధికి, అంగన్వాడీల బలోపేతానికి కృషి చేస్తాం

కోసం భూమి పూజ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గతంలో అద్దె భవనంలో పాఠశాల, అంగన్వాడి కేంద్రం కొనసాగుతుండదని.. దీంతో విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొనేవారన్నారు. ఎట్టి పరిస్థితులు ఈ సమస్యను పరిష్కరించాలని లక్ష్యంతో భూమి పూజ చేయడం జరిగిందని పేర్కొన్నారు. అభివృద్ధి పనులకు కేంద్ర ప్రభుత్వం నిధులు కేటాయిస్తున్నాదని తెలిపారు.

## జస్టిస్ వర్మపై ఎఫ్ఐఆర్ దాఖలు చేయాలి



ఎఫ్ఐఆర్ నమోదు చేయాలంటూ దాఖలైన పిటిషన్‌ను సుప్రీంకోర్టు బుధవారం తోసిపుచ్చింది. జస్టిస్ వర్మపై ఎఫ్ఐఆర్ దాఖలుకు నిరాకరించింది. జస్టిస్ వర్మ ప్రతిస్పందనతో పాటు మాజీ సిజెఐ రాష్ట్రపతి, ప్రధానులకు రాసిన లేఖలు, అంతర్గత విచారణ కమిటీ నివేదిక, మే 8న సుప్రీంకోర్టు విడుదల చేసిన పత్రికా ప్రకటనను పరిశీలించినట్లు జస్టిస్ అభరు ఎస్.ఓకా, జస్టిస్ ఉజ్వల్ భుయాన్‌లతో కూడిన ధర్మాసనం తెలిపింది. మాండమస్ రిట్ కోరే ముందు, పిటిషనర్ తగిన అధికారుల ముందు ప్రాతినిథ్యం దాఖలు చేయడం ద్వారా తమ ఫిర్యాదును పరిష్కరించుకోవాలని ధర్మాసనం పేర్కొంది. ఈ రిట్ పిటిషన్‌ను స్వీకరించేందుకు తాము నిరాకరిస్తున్నామని, ఈ దశలో ఇతర విజ్ఞప్తులను పరిశీలించాల్సిన అవసరం లేదని ధర్మాసనం తెలిపింది. జస్టిస్ వర్మపై అంతర్గత విచారణ కమిటీ అభియోగం మోపిన తర్వాత మాజీ సిజెఐ జస్టిస్ సంజీవ్ ఖన్నా ఆయనను రాజీనామా చేయాల్సిందిగా ఆదేశించారు. అయితే రాజీనామా చేసేందుకు జస్టిస్ వర్మ నిరాకరించారు. దీంతో జస్టిస్ సంజీవ్ ఖన్నా రాష్ట్రపతి, ప్రధాని మోడీలకు లేఖ రాసిన సంగతి తెలిసిందే. జస్టిస్ వర్మపైప వచ్చిన ఆరోపణలు వాస్తవమని అంతర్గత కమిటీ తేల్చిందని, వెంటనే క్రిమినల్ చర్యలు చేపట్టాలంటూ న్యాయవాది మాథ్యూస్ నెడుంపారా, మరో ముగ్గురు సుప్రీంకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. అంతర్గత విచారణతో న్యాయపరమైన క్రమశిక్షణా చర్యలు తీసుకోవచ్చని, అయితే చట్టాల ప్రకారం.. క్రిమినల్ దర్యాప్తుకు ప్రత్యామ్నాయం కాదని పిటిషన్‌లో వారు లేవనెత్తారు. అంతర్గత విచారణను సవాలు చేస్తూ, అధికారిక పోలీస్ దర్యాప్తు చేయాలని డిమాండ్ చేస్తూ మార్చిలో ఈ పిటిషనర్లే సుప్రీంకోర్టును ఆశ్రయించారు.

## కాంగ్రెస్, బిజెపి కుమ్మక్కు రాజకీయాలు

భాగంగానే నోటీసులు ఇచ్చారని మండిపడ్డారు. ప్రజా సమస్యలు గాలికొదిలి తమకు నోటీసులిస్తున్నారని, దిక్కుతోచని పరిస్థితుల్లోనే కెసిఆర్‌కు నోటీసులు ఇచ్చారని కెటిఆర్ మండిపడ్డారు. ప్రజాపాలన కమిషన్ల పాలనగా మారిందని ధ్వజమెత్తారు. కమిషన్లు తప్ప రేవంత్ ప్రభుత్వానికి పాలన చేతకాదు అని ధ్వజమెత్తారు. ఎమ్మెల్యేలు, మంత్రులే కమిషన్లపై మాట్లాడుతున్నారని, ఎన్ని నోటీసులు ఇచ్చినా దూదిగింజల్లా ఎగిరిపోతాయన్నారు. కాళేశ్వరం దర్యాప్తు కీలక దశకు చేరుకున్న సందర్భంగా మాజీ సిఎం కెసిఆర్, మాజీ మంత్రులు హరీష్‌రావు, ఈటల రాజేందర్‌లు విచారణకు రావాలని జస్టిస్ పిసి ఘోష్ కమిషన్ నోటీసులు జారీచేసింది. ముగ్గురు హాజరయ్యేందుకు 15 రోజులు గడువును కమిషన్ ఇచ్చింది. కమిషన్ ఎదుట హాజరై కమిషన్ అడిగే ప్రశ్నలకు సమాధానాలు చెప్పాలని జస్టిస్ పిసి ఘోష్ ఈ నోటీసుల్లో పేర్కొన్న విషయం తెలిసిందే. ఈ రాష్ట్రంలో కొనసాగుతున్నది ప్రజా పాలన కాదు.. కమిషన్ల పాలన అని కేటీఆర్ కీలక వ్యాఖ్యలు చేశారు. గత 17 నెలలుగా పాలన చేతకాక, కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజల దృష్టిని మళ్లించే నాటకాలు ఆడుతోంది అని ధ్వజమెత్తారు. కమిషన్‌లు తప్ప ప్రభుత్వానికి మరో దారి కనిపించట్లేదు. పాలన కనిపించడం లేదు. డైరెక్ట్‌గా కాంట్రాక్టర్లు సచివాలయంలో ధర్నా చేయడం వాస్తవ పరిస్థితిని స్పష్టం చేస్తోంది. కాంగ్రెస్ ఎమ్మెల్యేలు, మంత్రులే కమిషన్‌లు లేనిదే పనులు జరుగడంలేదు అని స్వయంగా చెబుతున్నారని కేటీఆర్ పేర్కొన్నారు. సీఎం రేవంత్ రెడ్డి ని అడుగుతున్నా.. ఎస్ఎల్‌బిసి టన్నెల్ కూలింది, 8 మంది ప్రాణాలు కోల్పోయారు. అక్కడ సహాయక చర్యలు చేపట్టే తెలివి కూడా లేకపోయింది. మీ కమిషన్‌ల ఆరాటంతో మృతదేహాలను వెలికితీయడానికి సైతం సాహసం చేయలేకపోయారు. అక్కడ ఏం జరిగిందో ఇప్పటికీ చెప్పలేని దద్దమ్మ ప్రభుత్వం ఇది. నల్గొండలో సుంకిశాల ప్రాజెక్ట్ కూలింది, ఇప్పటికీ ప్రభుత్వం స్పందించలేదు అని కేటీఆర్ పేర్కొన్నారు. ప్రజా సమస్యలను గాలికి వదిలేసి.. కాంగ్రెస్, బీజేపీ కలిసి నాటకాలు ఆడుతున్నాయి. కాళేశ్వరం ప్రాజెక్టుపై కుట్రలు చేస్తూ రాష్ట్ర అభివృద్ధిని బలిగొంటున్నారు. ఎప్పటికైనా న్యాయం, ధర్మం గెలుస్తాయి. నిజాయితీ ఎప్పటికీ ఓడిపోదు. మీరు ప్రకటించిన ఆరు గ్యారంటీలను అమలు చేయలేని చేతకాని ప్రభుత్వం ఇది. తులం బంగారం ఏమైంది? 4 వేల రూపాయల పింఛన్లు ఏమయ్యాయి? మీరు ఎన్ని నోటీసులు ఇచ్చినా అవి దూది పింజల్లా ఎగిరిపోతాయి. మీవి అన్ని చిల్లర ప్రయత్నాలు మాత్రమే. ప్రజలు మిమ్మల్ని తిరస్కరించనున్నారు. రేవంత్ రెడ్డికి బుద్ధి చెప్పే రోజులు త్వరలోనే వస్తాయి. ప్రజలు తిరగబడే రోజులు వచ్చాయని కేటీఆర్ పేర్కొన్నారు.

## రెండ్రోజుల పాటు తెలుగు రాష్ట్రాల్లో భారీ వర్షాలు

- **ఈదురు గాలులతో కూడా వానలు పడే ఛాన్స్**
- **అప్రమత్తంగా ఉండాలని హెచ్చరించిన వాతావరణశాఖ**

**విశాఖపట్టణం/హైదరాబాద్,మే21( వెలుతురు):**

తెలుగు రాష్ట్రాల్లో్ పలుచోట్ల భారీ వర్షాలు కురుస్తున్నాయి. రానున్న ఐదు రోజుల పాటు కూడా మోస్తరు నుంచి భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని వాతావరణ శాఖ అధికారులు హెచ్చరిస్తున్నారు. కోస్తా పరిసర ప్రాంతాల్లో కొనసాగుతున్న ద్రోణి మరో 12 గంటల్లో అల్పపీడనంగా మారే అవకాశం ఉందని, 36 గంటల్లో అల్పపీడనం మరింత బలపడి వాయుగుండంగా మారే అవకాశం ఉందని అధికారులు తెలిపారు. దీంతో రాష్ట్రవ్యాప్తంగా విస్తారంగా వర్షాలు కురిసే అవకాశం ఉందని అంటున్నారు. రెండ్రోజులు భారీ వర్షాలు పడే అవకాశం ఉందని, మరో ఐదు రోజుల పాటు కూడా ఈదురుగాలులతో కూడా వర్షాలు పడనున్నాయని అధికారులు తెలిపారు. గంటకు 40 నుంచి 50 కిలో మీటర్ల వేగంతో పలు జిల్లాలో వర్షం పడే అవకాశం ఉందంటున్నారు. పశ్చిమ, తూర్పు జిలాలకు భారీ వర్షాలు పడతాయని తెలిపారు. అటు తెలంగాణలోనూ పలు రాష్ట్రాల్లో్ కుండపోత వర్షాలు పడనున్నాయని వాతావరణ శాఖ తెలిపింది. 15 జిల్లాలకు భారీ వర్ష సూచన ఉందని అధికారులు వెల్లడించారు. హైదరాబాద్, నిజామాబాదు, కామారెడ్డి, మెదక్, సంగారెడ్డి, వికారాబాద్, మహబూబ్‌నగర్, నారాయణపేట, వనపర్తి, జోగులాంబ, గద్వాల్, నగర్ కర్నూల్, నల్గొండ, సూర్యాపేట, మహబూబ్‌బాద్, ఖమ్మం, భద్రాద్రి కొత్తగూడెం జిల్లా భారీ వర్షాలు కురవనున్నాయని, ప్రజలు అప్రమత్తంగా ఉండాలని అధికారులు సూచిస్తున్నారు. ద్రోణి ప్రభావంతో తెలంగాణ రాగల ఐదురోజులు భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని హైదరాబాద్ వాతావరణ కేంద్రం హెచ్చరించింది. ఉత్తర కర్నాటక-గోవా తీరాల వెంబడి తూర్పు మధ్య అరేబియా సముద్రంపైనున్న ఉపరితల ఆవర్తం నుంచి కోస్తాంధ్ర వరకు ద్రోణి సగటు సముద్రమట్టానికి 3.1 కిలోమీటర్ల వరకు విస్తరించి ఉందని.. ఆంధ్రప్రదేశ్ మధ్య ప్రాంతాలు, పరిసరాలను ఆనుకొని ఉన్న దక్షిణ తెలంగాణపై ఉపరితల ఆవర్తనం సగటు సముద్రమట్టానికి 3.1 కిలోమీటర్ల విస్తరించి ఉందని వాతావరణశాఖ పేర్కొంది. ఈ క్రమంలో నిజామాబాద్, కొత్తగూడెం, ఖమ్మం, నల్గొండ, సూర్యాపేట, మహబూబాబాద్, వికారాబాద్, సంగారెడ్డి, మెదక్, కామారెడ్డి, మహబూబ్‌నగర్, నాగర్ కర్నూల్, వనపర్తి, నారాయణపేట, జోగులాంబ గద్వాల జిల్లాల్లో భారీ వర్షాలు కురుస్తాయని హెచ్చరించింది. భూపాలపల్లి, ములుగు, వరంగల్, హన్మకొండ, సిద్దిపేట, యాదాద్రి భువనగిరి, రంగారెడ్డి, హైదరాబాద్, మేడ్చల్ మల్కాజ్‌గిరి జిల్లాల్లో ఉరుములు, మెరుపులు, గంటకు 40-50 కిలోమీటర్ల వేగంతో ఈదురుగాలులు వీస్తాయని చెప్పింది. ఆదిలాబాద్, ఆసిఫాబాద్, మంచిర్యాల, నిర్మల్, జగిత్యాల, రాజన్న సిరిసిల్ల, కరీంనగర్, పెద్దపల్లి జిల్లాల్లో గంటకు 30-40 కిలోమీటర్ల వేగంతో ఈదురుగాలులతో కూడిన వానలు పడే అవకాశాలున్నాయని చెప్పింది.గురువారం కరీంనగర్, పెద్దపల్లి, జయశంకర్, భూపాలపల్లి, ములుగు, మహబూబాబాద్, వరంగల్, హన్మకొండ, జనగాం జిల్లాల్లో అక్కడక్కడ భారీ వానలుపడుతాయని తెలిపింది. కొత్తగూడెం, ఖమ్మం, నల్గొండ, సూర్యాపేట, సిద్దిపేట, యాదాద్రి భువనగిరి, రంగారెడ్డి, హైదరాబాద్, మేడ్చల్ మల్కాజ్‌గిరి, వికారాబాద్, సంగారెడ్డి, మెదక్, కామారెడ్డి, మహబూబ్‌నగర్, నాగర్ కర్నూల్, వనపర్తి, నారాయణపేట, జోగులాంబ గద్వాల జిల్లాల్లో తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు కురుస్తాయని చెప్పింది. అలాగే, శుక్ర, శని, ఆదివారాల్లోనూ హైదరాబాద్ సహా ఉత్తర, దక్షిణ తెలంగాణలోని పలు ప్రాంతాల్లో వానలు పడుతాయని వాతావరణశాఖ వివరించింది. ఈ మేరకు ఆయా జిల్లాలకు ఎల్లో అలెర్ట్‌ని జారీ చేసింది.

# తుపాకులతో గర్జించిన ఛత్తీస్‌ఘఢ్

(మొదటి పేజీ తరువాయి..)

తొలిసారి. ఈ క్రమంలో భద్రతా దళాలకు అభినందనలు తెలిపారు. ఆపరేషన్ బ్లాక్ ఫారెస్టు పూర్తయిన తర్వాత ఛత్తీస్‌గఢ్, తెలంగాణ, మహారాష్ట్రలలో 54మంది నక్సలైట్లు అరెస్టు అయ్యారు. 84మంది లొంగిపోయారు. 2026 మార్చి 31 నాటికి నక్సలిజాన్ని నిర్మూలించేందుకు మోదీ సర్కార్ దృఢ సంకల్పంతో ఉంది‘ అని అమిత్ షా ఎక్స్‌లో పేర్కొన్నారు. ఎన్‌కౌంటర్‌లో మరణించిన నంబాల కేశవరావును బసవరాజు, క్రిష్ణ, వినయ్, గంగన్న, బసవర రాజు, ప్రకాష్, బీఆర్, ఉమేష్, రాజు, విజయ్, కేశవ్, దారపు నరసింహారెడ్డి, నరసింహ అని మారు పేర్లతో కూడా పిలిచేవారు. 2018 నవంబర్‌లో ముప్పాల లక్ష్మణరావు అలియాస్ గణపతి రాజీనామా తర్వాత అతను పార్టీకి సుప్రీం కమాండర్ అయ్యారు. శ్రీకాకుళం జిల్లా కోటబొమ్మాళి మండలం జియ్యన్నపేట గ్రామంలో 1955లో కేశవరావు జన్మించారు. తండ్రి వాసుదేవరావు ఉపాధ్యాయుడు. కేశవరావుకు సోదరుడు, ముగ్గురు అక్కాచెల్లెళ్లు ఉన్నారు.కేశవరావు ప్రాథమిక విద్య స్వగ్రామంలోనే సాగింది. తాతగారి ఊరు అయిన టెక్కలి మండలం తలగాంలో హైస్కూల్ విద్య, టెక్కలి జూనియర్ కళాశాలలో ఇంటర్ చదివిన ఆయన.. డిగ్రీ రెండో సంవత్సరం చదువుతుండగా వరంగల్‌లో బీటెక్ రావడంతో అక్కడికి వెళ్లి జాయిన్ అయ్యారు. వరంగల్‌లోని రీజినల్ ఇంజినీరింగ్ కళాశాల (ఆర్ఈసీ) బీటెక్ చదువుతుండగానే రాడికల్ విద్యార్థి సంఘం వైపు అడుగులు వేశారు. 1984లో ఎంటెక్ చదువుతున్నప్పుడు సీపీఐ(ఎంఎల్) పీపుల్స్‌వార్ గ్రూపు సిద్దాంతాలు, భావజాలం పట్ల ఆకర్షితులయ్యారు. ఎంటెక్ చదువుకు మధ్యలోనే స్వస్తి చెప్పి ఉద్యమంలో చేరారు. అప్పటి నుంచి 43 ఏళ్లుగా అజ్ఞాతంలోనే ఉన్నారు. నక్సల్‌బరి ఉద్యమంలో చేరాక స్వగ్రామానికి ఎప్పుడూ రాలేదని గ్రామస్థులు చెబుతున్నారు. మిలటరీ దాడుల వ్యూహకర్తగా నంబాల కేశవరావుకు పేరుంది. మిలిటరీ ఆపరేషన్లలో సిద్ధహస్తులు. మిలటరీ వ్యూహాల రూపకల్పన, అమలు, ఆయుధాల వ్యాపారులతో సత్సంబంధాలు నెరపడం ఆయన ప్రత్యేకతలు. దశాబ్దకాలం పాటు కేంద్ర మిలటరీ కమిషన్ కార్యదర్శిగా పనిచేశారు. గణపతి తర్వాత పార్టీ కార్యదర్శిగా బాధ్యతలు చేపట్టారు. గణపతితో పోల్చితే పార్టీ సిద్దాంతాల అమల్లో మరింత కఠినంగా వ్యవహరించేవారు. దూకుడు స్వభావం కలిగిన కేశవరావు.. ప్రతిఘటన ద్వారానే లక్ష్యం సిద్ధిస్తుందని బలంగా నమ్మే స్వభావమని ఓ పోలీసు అధికారి తెలిపారు. అలిపిరిలో చంద్రబాబుపై జరిగిన క్లెమోర్ మైన్స్ దాడిలో ప్రధాన సూత్రధారి నంబల కేశవరావు. ముఖ్యంగా 2010 ఏప్రిల్లో ఛత్తీస్‌గఢ్‌లోని చింతల్నార్ ఘటనలో వ్యూహం ఆయనదే. గస్తీకి వెళ్లి తిరిగివస్తున్న సీఆర్పీఎఫ్ జవాన్లు రెండు కొండల మధ్యకు వచ్చాక మావోలు అకస్మాత్తుగా విరుచుకుపడ్డారు. జవాన్లు పారిపోయే అవకాశం కూడా దక్కలేదు. ఈ ఘటనలో 74 మంది జవాన్లు చనిపోయారు. 2013లో సల్వాజుడుం వ్యవస్థాపకుడు మహేంద్రకర్మపై దాడి వ్యూహం కూడా కేశవరావుదే. ఈ ఘటనలో మహేంద్రకర్మతోపాటు మరో 27 మంది మరణించారు.

## నేడు కరీంనగర్‌లో హిందూ ఏక్తా యాత్ర

ప్రజలంతా సంఘటితమై ఉగ్రవాద నిర్మూలనకు ర్యాలీలు, కార్యక్రమాలు నిర్వహిస్తున్న సంగతి తెలిసిందే. ముఖ్యంగా హిందువుల్లో ఐక్యతా భావం నెలకొంది. ఈ నేపథ్యంలో రేపు నిర్వహించే 'హిందూ ఏక్తా యాత్ర'కు వేలాదిగా జనం తరలివచ్చే అవకాశాలు మెండుగా కన్పిస్తున్నాయి. 'హిందూ ఏక్తా యాత్ర' 22న సాయంత్రం 4 గంటలకు వైశ్యాభవన్ నుండి మొదలై రాత్రి పొద్దుపోయేదాకా కరీంనగర్ సిటీలోని ముఖ్య కూడళ్ల మీదుగా సాగుతూ తిరిగి వైశ్యా భవన్ వద్ద ముగియనుంది. సాయంత్రం 5 గంటల నుండి రాత్రి పొద్దుపోయేదాకా ఆయా కూడళ్ల మీదుగా ప్రజలకు అభివాదం చేస్తూ హిందుత్వ వాదుల్లో జోష్ నింపనుంది. వివిధ సాంస్కృతిక, కళారూపాల ప్రదర్శనతోపాటు పెహల్గాం ఘటన నేపథ్యంలో భారత సైన్యం ధైర్య సాహసాలను ప్రదర్శిస్తూ 'ఏక్తా యాత్ర' కొనసాగనుండటం విశేషం.

హిందువులను ఏకం చేసేందుకు ఆనాడు గణేష్ ఉత్సవాలకు శ్రీకారం చుట్టిన బాల గంగాధర తిలక్ స్ఫూర్తితో బండి సంజయ్ కుమార్ కరీంనగర్ వేదికగా గత 15 ఏళ్లుగా ప్రతి ఏటా హనుమాన్ జయంతి నాడు 'హిందూ ఏక్తా యాత్ర' నిర్వహిస్తున్నారు. పార్లమెంట్ ఎన్నికల కోడ్ అమలులో ఉన్న కారణంగా గత ఏడాది హిందూ యాత్ర నిర్వహించలేదు. రెండేళ్ల అనంతరం నిర్వహిస్తున్న ఏక్తా యాత్రకు కరీంనగర్ పార్లమెంట్ నియోజకవర్గం నుండి భారీ ఎత్తున ప్రజలు తరలివచ్చేలా ఏర్పాట్లు చేశారు. కరీంనగర్ పార్లమెంట్ పరిధిలోనే దాదాపు 50 వేల మంది ఈ యాత్రలో పాల్గొంటారని అంచనా వేస్తున్నారు. ఇతర జిల్లాల నుండి సైతం బండి సంజయ్ అభిమానులు, బీజేపీ కార్యకర్తలు, హిందుత్వ వాదులు ఈ యాత్రలో పాల్గొనే అవకాశాలున్నాయి.

రాజకీయాలతో సంబంధం లేకుండా అన్ని పార్టీల్లోని హిందువులను ఏకం చేయడంతోపాటు హిందూ ధర్మ రక్షణ కోసం పాటుపడే వారంతా ఈ యాత్రలో పాల్గొంటున్నారు. ఈసారి ఉమ్మడి కరీంనగర్ లోని వివిధ కుల సంఘాలు, వృత్తి సంఘాలు, కార్మిక, ధార్మిక సంఘాల నాయకులు సైతం ఏక్తా యాత్రలో పాల్గొని సంఘీభావం ప్రకటించేందుకు సిద్ధమయ్యారు. ఇటీవల నిర్వహించిన 'హిందూ ఏక్తా యాత్ర' పోస్టర్ కార్యక్రమంలో ఆయా సంఘాల నాయకులంతా పాల్గొన్న విషయం తెలిసిందే. ఈసారి కేంద్ర మంత్రి బండి సంజయ్ తోపాటు సామాజిక సమరసత వేదిక రాష్ట్ర కన్వీనర్, ప్రముఖ సంఘసేవకులు, వక్త అప్పాల ప్రసాద్ జీ ఏక్తా యాత్రలో పాల్గొని ప్రసంగిస్తారు.

వాస్తవానికి బండి సంజయ్ ఏక్తా యాత్ర ప్రాముఖ్యాన్ని తగ్గించేందుకు అనేక మంది ఏక్తా యాత్రలు నిర్వహించారు. అయితే అంతగా సఫలం కాలేదు. బండి సంజయ్ హిందూ ఏక్తా యాత్ర కు భారీ ఎత్తున ప్రజలు తరలివస్తుండటం, కరీంనగర్ ప్రజలంతా ఈ యాత్రను తిలకించేందుకు ఎదురు చూడటం ఆనవాయితీగా మారింది. ఈ నేపథ్యంలో హిందూ ఏక్తా యాత్ర చాంపియన్ గా బండి సంజయ్ అవతరించారు. ఈసారి కనీవినీ ఎరగని రీతిలో "హిందూ ఏక్తా యాత్ర" ను జయప్రదం చేయాలని బండి సంజయ్ నిర్ణయించారు. హిందూ సంఘటిత శక్తిని చాటేందుకు నిర్వహిస్తున్న హిందూ ఏక్తా యాత్రకు స్వచ్ఛందంగా తరలివచ్చి విజయవంతం చేయాలని కేంద్ర మంత్రి బండి సంజయ్ ఈ సందర్భంగా ప్రజలకు పిలుపునిచ్చారు.

## పాకిస్తాన్‌లోనే పెళ్లి

జ్యోతి మల్హోత్రా కేసు దేశవ్యాప్తంగా సంచలనం రేపుతోంది. ఈ కేసు దర్యాప్తును అధికారులు ముమ్మరం చేశారు. దర్యాప్తులో సంచలన విషయాలు వెలుగులోకి వస్తున్నాయి. తాజాగా ఐఎస్ఐ హ్యాండ్లర్‌తో జ్యోతి చాటింగ్ వివరాలు వెలుగులోకి వచ్చాయి. అందులో తనని పాకిస్థాన్‌లో పెళ్లి చేసుకోవాలంటూ జ్యోతి కోరడం గమనార్హం.ఐఎస్ఐతో సంబంధాలున్న అలీ హసన్ అనే వ్యక్తితో జ్యోతి నిత్యం టచ్‌లో ఉంటున్నట్లు అధికారులు తమ దర్యాప్తులో ఇప్పటికే గుర్తించిన విషయం తెలిసిందే. భారత్‌కు సంబంధించిన రహస్య కార్యకలాపాల గురించి వీరిద్దరూ చర్చించుకున్నట్లు తేల్చారు. వాటిని రహస్యంగా ఉంచేందుకు పలు ఎన్‌క్రిప్ట్ చేసిన ప్లాట్‌ఫారమ్‌లను వినియోగించినట్లు విచారణలో తేలింది. స్నాప్‌చాట్, టెలిగ్రామ్, వాట్సాప్‌లో కోడ్ ల్యాంగ్వేజ్‌లో మాట్లాడుకున్నట్లు దర్యాప్తు అధికారులు గుర్తించారు. భారతదేశ అండర్‌కవర్ ఆపరేషన్లకు సంబంధించి సంకేత భాషలో వారి మధ్య సాగిన సంభాషణలు దర్యాప్తు బృందానికి లభించాయి. చాటింగ్ సందర్భంగా 'నన్ను పాకిస్థాన్‌లో పెళ్లి చేసుకోవాలి' అని జ్యోతి కోరింది. ఇందుకు సంబంధించిన చాటింగ్ వివరాలు తాజాగా బయటకు వచ్చాయి. మరోవైపు పాక్ ఇంటెలిజెన్స్ అధికారులతో తనకు సంబంధాలు ఉన్నట్లు జ్యోతి అంగీకరించినట్లు తెలిసింది. న్యూఢిల్లీలోని పాకిస్థాన్ హైకమిషన్ ఉద్యోగి డానిష్‌తో తాను నిత్యం టచ్‌లో ఉండేదాన్ని ఆమె దర్యాప్తు అధికారుల ముందు ఒప్పుకున్నట్లు సమాచారం. 2023లో వీసా కోసం పాక్ హైకమిషన్‌కు వెళ్లిన సమయంలో డానిష్‌తో తొలిసారి పరిచయం ఏర్పడినట్లు వెల్లడించింది.'అవును.. పాకిస్థాన్ ఏజెంట్లతో నాకు సంబంధాలున్నాయి' అంటూ విచారణలో సంచలన వ్యాఖ్యలు చేసినట్లు తెలుస్తోంది. పాకిస్థాన్ తరపున గూఢచర్యం చేసినట్లు ఆమె అంగీకరించిదని హిసార్ పోలీసు ప్రతినిధి తెలిపారు. ఇటీవల అరెస్ట్ అయిన హర్యానాకు చెందిన జ్యోతి మల్హోత్రా, పాకిస్థాన్ ఇంటెలిజెన్స్ ఏజెంట్లతో సంబంధాలు కలిగి ఉన్నట్లు ఒప్పుకుందని, న్యూఢిల్లీలోని పాకిస్థాన్ హైకమిషన్ మాజీ అధికారి డానిష్‌తో తాను తరచుగా సంప్రదింపులు జరిపిందని ఆమె ఒప్పుకున్నారన్నారు. 'ట్రావెల్ విత్ జో' అనే యూట్యూబ్ ఛానల్ ఉన్న జ్యోతి మల్హోత్రా 2023లో పాకిస్తాన్ వెళ్లడానికి వీసా పొందడానికి ఢిల్లీలోని పాకిస్థాన్ హైకమిషన్‌కు వెళ్లినట్లు తెలిపింది. అక్కడ అహ్సాన్-ఉర్-రహీం అలియాస్ డానిష్‌తో పరిచయం ఏర్పడిందని, తన మొబైల్ నంబర్ తీసుకొని తరచుగా అతనితో మాట్లాడేదానినని, రెండుసార్లు పాకిస్థాన్‌కు కూడా వెళ్లానని తెలిపింది. అక్కడ డానిష్ తనకు ప్రత్యేకంగా ఏర్పాట్లు చేశాడని, అంతేకాకుండా తన ప్రయాణానికి కూడా ఏర్పాట్లు చేశాడని విచారణలో చెప్పింది. డానిష్ ద్వారా పరిచయమైన అలీ హసన్ అనే వ్యక్తి తనకు పాకిస్థాన్ నిఘా అధికారులుగా ఉన్న షకీర్, రాణా షాబాజ్ అనే ఇద్దరు వ్యక్తులను పరిచయం చేశాడని తెలిపింది. షకీర్ మొబైల్ నంబర్‌ను తన మొబైల్‌లో 'జాట్ రాధావన్' అనే పేరుతో సేవ్ చేసుకున్నానని.. అందువల్ల తనను ఎవరూ అనుమానించలేదని తెలిపింది. భారతదేశానికి తిరిగి వచ్చిన తర్వాత తాను వాట్సాప్, స్నాప్‌చాట్, టెలిగ్రామ్ వంటి సోషల్ మీడియా ప్లాట్‌ఫామ్‌ల ద్వారా పాక్ ఏజెంట్లతో టచ్‌లోనే ఉన్నానని.. ఈ క్రమంలోనే దేశానికి సంబంధించిన సమాచారాన్ని వారికి షేర్ చేసేదానినని జ్యోతి మల్హోత్ర ఒప్పుకుంది. ఢిల్లీలోని పాక్ హైకమిషన్‌లో డానిష్‌ను తాను చాలాసార్లు కలిసినట్లు తెలిపింది. త్రివిధ దళాల వివరాలను పాకిస్థాన్ నిఘా సంస్థకు చెందిన కార్యకర్తలతో, ముఖ్యంగా పాకిస్థాన్ ఇంటెలిజెన్స్ ఆపరేటివ్స్‌గా ఉన్న షకీర్, రాణా షాబాజ్ అనే వ్యక్తులతో అత్యంత సున్నితమైన సమాచారాన్ని పంచుకున్నట్లు అధికారుల విచారణలో అంగీకరించింది. ఎవరికి అనుమానం రాకుండా స్నాప్‌చాట్, టెలిగ్రామ్ వంటి ప్లాట్‌ఫామ్‌లలో వేరే ఐడిలను ఇందుకు ఉపయోగించింది. అట్టారి, రాజస్థాన్ సరిహద్దుల్లో దళాల మోహరింపునకు సంబంధించిన రహస్య వివరాలను షకీర్‌తో షేర్ చేసినట్లు విచారణలో తాను చేసిన తప్పులను ఒప్పుకుంది.

## ట్రంప్ ఒత్తిడికి కేంద్రంలోని మోదీ ప్రభుత్వం తలొగ్గిందని సీఎం రేవంత్ రెడ్డి వ్యాఖ్యలు చేయడం ఆయన అజ్ఞానానికి నిదర్శనం...

భద్రత, విదేశాంగ వ్యవహారాలకు సంబంధించిన అంశాల్లో సీఎం రేవంత్ రెడ్డి తన అజ్ఞానంతో అబద్దాలను ప్రచారం చేయడం అత్యంత దుర్మార్గం, ఇది దేశద్రోహ చర్యతో సమానం. పాకిస్తానులోని ఉగ్రవాద శిబిరాలను భారత సైన్యం పలు సార్లు ధ్వంసం చేయడమే పాక్ ప్రేరేపిత టెర్రరిజాన్ని అంతమొందించేందుకు కేంద్రంలోని మోదీ గారి సర్కార్ రాజీలేని పోరాటం చేస్తోందనడానికి నిదర్శనం. పాకిస్తాన్ ప్రేరిపిత ఉగ్రమూకలు 2019లో పుల్వావాలో మన సైనికులను, ఇటీవల పెహల్గాంలో అమాయక టూరిస్టులను హతమార్చిన దురాగతాలకు ప్రతీకారంగా ప్రధాని మోదీ గారి ఆదేశాల మేరకు భారత సైన్యం పాకిస్తానుపై తీవ్ర స్థాయిలో అప్పుడు 2019లోనూ, తాజాగా ఇప్పుడు కూడా దాడులు చేసి ఆ దేశంలోని ఉగ్రవాద శిబిరాలను ధ్వంసం చేసిన ఉదంతాలను సీఎం రేవంత్ రెడ్డి మరచిపోయారేమో. అమెరికా అధ్యక్షుడు ట్రంప్ గారి ఒత్తిళ్లకు తలొగ్గితే పాకిస్తానుపై భారత సైన్యం చేసిన ఆ దాడులు జరిగేవి కావు కదా. మరి మన కనుల ముందే వాస్తవాలు ఇలా ఉంటే సీఎం రేవంత్ రెడ్డి గారు అమెరికా అధ్యక్షుడి ఒత్తిడికి మోదీ గారి ప్రభుత్వం తలొగ్గిందని, పెహల్గాంలో ఉగ్ర దాడులు జరిగినపుడు ప్రధాని మోదీ గారికి బాసట ఉండాల్సిన కేంద్రం మంత్రి కిషన్ రెడ్డి గారు దుప్పటి కప్పుకుని పడుకున్నారని మాట్లడడానికి అసలు కారణం రాహుల్ గాంధీ గారి మెప్పు పొందడం, తద్వారా తన సీఎం పదవిని కాపాడుకోవడమే.

బిజెపి నేతలను విమర్శించే విషయంలో రాహుల్ గాంధీ గారు రాసిచ్చిన స్క్రిప్టునే సీఎం రేవంత్ రెడ్డి గారు చదివారు. పాకిస్తానుపై భారత సైన్యం సాగిస్తున్న ఆపరేషన్ సింధూర్ కు అండగా నిలబడాల్సిన కాంగ్రెస్ అగ్ర నేతలు అదే పనిగా భారత సైన్యాన్ని పలుచన చేసే



వ్యాఖ్యలు మాట్లాడడం వారి దివాళాకోరు రాజకీయాలకు నిదర్శనం. దేశభద్రత, విదేశాంగ వ్యవహారాల్లోనూ కాంగ్రెస్ రాజకీయం చేయడం దురదృష్టకరం. సీఎం రేవంత్ రెడ్డి, ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ, కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే వంటి నేతలు పాకిస్తాన్ అనుకూల ధోరణిలో మాట్లాడుతూ కేంద్రంలోని మోదీ గారి ప్రభుత్వాన్ని విమర్శిస్తున్నారు.

కాంగ్రెస్ ముఖ్య నేతల తీరు చేస్తుంటే వారి పార్టీ పేరును భారత జాతీయ కాంగ్రెస్ (INC) ను కాస్తా పాకిస్తాన్ జాతీయ కాంగ్రెస్ (PNC) గా మార్చుకున్నారా అనే సందేహం భారతీయులకు కలుగుతోంది. ఎందుకంటే హస్తం పార్టీది ఎప్పుడూ పాకిస్తాన్ అనుకూల విధానమే. భారత తొలి ప్రధాని జవహర్ లాల్ నెహ్రూ అవలంభించిన హిందూ వ్యతిరేక, ముస్లిం అనుకూల వైఖరి, అమలు చేసిన కశ్మీరుకు స్వతంత్రప్రతిపత్తి వంటి విధానాల వల్లే అక్కడ పాకిస్తాన్ ప్రేరేపిత టెర్రరిజం వేళ్లూనుకుంది. కశ్మీరులోని కొంత ప్రాంతాన్ని పాకిస్తాను ఆక్రమించుకోవడానికి అప్పటి ప్రధాని నెహ్రూ అసమర్ధ విధానాలే కారణం. పాకిస్తానుతో యుద్ధం చేసిన ఇందిరాగాంధీ గారు కూడా పీఓకేను తిరిగి దక్కించుకోకుండా, ఆర్టికల్ 370 రద్దు చేయకుండా చారిత్రక తప్పిదానికి పాల్పడ్డారు. మన దేశంలో పాకిస్తాన్ ప్రేరేపిత ఉగ్రవాదం వేళ్లూనుకోవడానికి కాంగ్రెసు పాలకుల వైఫల్యమే కారణం. కాంగ్రెస్ చేసిన చారిత్ర తప్పిదాలను ఇపుడు మోదీ గారు ప్రధాని సరిదిద్దుతున్నారు. అందుకు ఆర్టికల్ 370 రద్దు ప్రబల నిదర్శనం. కశ్మీరులో పాకిస్తాన్ ప్రేరేపిత ఉగ్రవాదాన్ని అంతమొందించేందుకు మోదీ గారి సర్కారు చేస్తున్న కృషిని కాంగ్రెస్ నేతలు అభినందించకపోయినా ఫర్వాలేదు. కానీ, పాకిస్తాను అనుకూల ధోరణిలో మాట్లాడడం మాత్రం మన దేశ ప్రయోజనాలకు విఘాతం కలిగించడమే.

కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి గారు పాకిస్తాన్ ప్రేరేపిత టెర్రరిజానికి వ్యతిరేకంగా బిజేవైఎం జాతీయ నేతగా సీమ సురక్షా జాగరణ యాత్ర చేపట్టిన దేశభక్తుడు. World Youth Conference Against Terrorism (WYCAT) నిర్వహించడం ద్వారా ఉగ్రవాద వ్యతిరేక పోరాటంలో తనదైన పాత్ర పోషించిన నేత కిషన్ రెడ్డి గారు. టెర్రరిజాన్ని అంతం చేయాలనే సంకల్పం ఉన్న కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి ఉగ్రదాడుల వేళ ప్రధాని మోదీ గారికి అండగా లేరని సీఎం రేవంత్ రెడ్డి మాట్లాడడం పూర్తిగా రాజకీయ దురుద్దేశ పూరితం, ముఖ్యమంత్రి దివాళాకోరు రాజకీయాలకు నిదర్శనం. తాజాగా హైదరాబాద్, చార్మినార్ ప్రాంతంలోని గుల్జార్ హౌసులో అగ్నిప్రమాదం జరిగి 17 మంది చనిపోతే, వెంటనే సంఘటనా స్థలానికి వెళ్లి పరిస్థితిని సమీక్షించి, బాధితుల కుటుంబాలను ఓదార్చిన నిబద్ధతగల నేత కిషన్ రెడ్డి గారు. ఆ రోజు బాధితులకు అండగా నిలబడి భరోసా ఇవ్వాల్సిన సీఎం రేవంత్ రెడ్డి హైదరాబాదులోనే తన నివాసంలో దుప్పటి కప్పుకుని పడుకోవడం ఆయన బాధ్యాతారాహిత్యానికి నిదర్శనం.

## రాష్ట్ర వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహ గారిని మర్యాద పూర్వకంగా కలిసిన తెలంగాణ ప్రభుత్వ ఫార్మసిస్ట్స్ అసోసియేషన్ ప్రతినిధులు





**హైదరాబాద్ వెలుతురు మే 21:**
రాష్ట్ర వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహ గారిని తెలంగాణ ప్రభుత్వ ఫార్మసిస్ట్స్ అసోసియేషన్ ప్రతినిధులు హైదరాబాదులోని మంత్రి నివాసంలో మర్యాద పూర్వకంగా కలిశారు. రాష్ట్రం లో అన్ని బస్తీ , పల్లె దవాఖాన లలో ఫార్మసిస్ట్స్ లను నియమించాలని విజ్ఞప్తి చేశారు. అన్ని జిల్లాలో DMHO పరిధిలోని ఫార్మసీ స్టోర్స్ , వ్యాక్సిన్ స్టోర్స్ లలో, మలేరియా, లెప్రసీ, టీబీ సెంటర్లలో ఫార్మసిస్టులను నియమించాలని కోరారు, అలాగే , అన్ని PHC లలో ముగ్గురు ఫార్మసి ఆఫీసర్లను నియమించాలని మంత్రి దామోదర్ రాజనర్సింహ గారికి తెలంగాణ ప్రభుత్వ ఫార్మసిస్ట్ అసోసియేషన్ అధ్యక్షులు బత్తిని సుదర్శన్ గౌడ్ ఆధ్వర్యంలో వచ్చిన ప్రతినిధులు వివరించారు. అలాగే, తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా నిర్మిస్తున్న టీచింగ్ ఆసుపత్రులలో క్లినికల్ ఫార్మసీ డిపార్ట్మెంట్లను ఏర్పాటు చేయాలని మంత్రి దామోదర్ రాజనర్సింహ గారికి వినతిపత్రాన్ని సమర్పించారు. రాష్ట్రంలో ఫార్మసీ చట్టాన్ని అమలు చేయాలని కోరారు. తెలంగాణ ప్రభుత్వ ఫార్మసిస్ట్ అసోసియేషన్ ప్రతినిధులు చేసిన విజ్ఞప్తిపై రాష్ట్ర వైద్య, ఆరోగ్యశాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహ సానుకూలంగా స్పందించారు. మంత్రిని కలిసిన వారిలో ఫార్మసిస్ట్ అసోసియేషన్ అధికారుల సంఘం ప్రధాన కార్యదర్శి అశోక్, వర్కింగ్ ప్రెసిడెంట్ శరత్, అహమదుల్లా, కె. లావణ్య , తదితరులు పాల్గొన్నారు.

## లుఫ్తాన్సా విమానానికి తప్పిన ప్రమాదం

**హైదరాబాద్,మే21( వెలుతురు):**
శంషాబాద్ ఎయిర్‌పోర్టులో లుఫ్తాన్సా విమానానికి తృటిలో ప్రమాదం తప్పింది. బుధవారం ఉదయం ఫ్రాంక్‌ఫర్డ్ బయలుదేరిన విమానం రన్ వే మీదకు వెళ్లిన వెంటనే ముందు టైరులో సమస్య ఏర్పడింది. ఈ విషయాన్ని పైలట్ వెంటనే గుర్తించారు. దీంతో ఈ విషయాన్ని ఎయిర్ పోర్ట్ అధికారుల దృష్టికి తీసుకు వెళ్లారు. అనంతరం వారి సూచన మేరకు విమానాన్ని శంషాబాద్ ఎయిర్‌పోర్ట్‌లోకి మళ్లించారు. ఈ సమయంలో విమానంలో 190 మంది ప్రయాణికులు ఉన్నారు. విమానం టైర్‌ను ఎయిర్ పోర్టులోని సాంకేతిక సిబ్బంది పరిశీలిస్తున్నారు. మరోవైపు కొన్ని గంటల ఆలస్యంగా ఈ విమానం బయలుదేరుతోందని ఎయిర్‌పోర్ట్ అధికారులు వెల్లడించారు.

# కావాలనే కాళేశ్వరం విచారణ జాప్యం

- ఇంకెంతకాలం విచారణ చేయిస్తారు
- నోటీసులు అందాక స్పందిస్తా.. వచారణకు హాజరవుతా
- మల్కాజిగిరి ఎంపి ఈటెల రాజేందర్ స్పష్టీకరణ

**హైదరాబాద్,మే21( వెలుతురు):**
కాళేశ్వరం కమిషన్ ఎదుట విచారణను కాలయాపన చేస్తూ..కేసును నీరు గారుస్తున్నారని మల్కాజ్‌గిరి ఎంపీ, బీజేపీ నేత ఈటల రాజేందర్ ఆరోపించారు. ఇంకెంతకాలం విచారిస్తారని అన్నారు. ఇదంతా కావాలనే చేస్తున్నట్లుగా ఉందని అన్నారు. ఇక తనకు నోటీసులపై స్పందిస్తూ విచారణకు వందశాతం హాజరవుతానని రాజేందర్ స్పష్టం చేశారు. అయితే ఇంత వరకు ఎలాంటి నోటీసులు తనకు అందలేదని ఆయన తెలిపారు. అయితే తనకు నోటీసులు పంపిన విషయం మీడియా ద్వారా తెలుసుకున్నానని చెప్పారు. తనకు నోటీసులు అందిన అనంతరం ఈ విషయాన్ని పార్టీలో చర్చించి.. అధిష్టానం నిర్ణయానికి అనుగుణంగా తాను ముందుకు వెళ్తానన్నారు. బుధవారం ఎంపీ ఈటల రాజేందర్ మీడియాతో మాట్లాడుతూ.. ప్రభుత్వం నీది.. నువ్వు ఎలాంటి విచారణ అయినా చేయి అంటూ సీఎం రేవంత్ రెడ్డికి ఆయన సవాల్ విసిరారు. గతంలో దేవరాయాంజాల్ భూముల విషయంలో కేసీఆర్ చేసిన తప్పే.. నేడు నువ్వు చేస్తున్నావంటూ సీఎం రేవంత్ రెడ్డిపై ఈటల రాజేందర్ మండిపడ్డారు. నువ్వు మమల్ని బెదిరిస్తే భయపడమన్నారు. కేంద్రంలో తమ పార్టీనే అధికారంలో ఉందని ఈ సందర్భంగా ఎంపీ ఈటల రాజేందర్ గుర్తు చేశారు. నీ చిట్టా అంతా తమ చేతిలో ఉందన్నారు. నీ దిక్కుమాలిన చిల్లర గాళ్ళతో మాట్లాడిస్తే తాను వెనక్కి పోనంటూ సీఎం రేవంత్ రెడ్డికి ఎంపీ ఈటల ఘాటుగా వార్నింగ్ ఇచ్చారు.కాళేశ్వరం ఎత్తిపోతల పథకంలో భాగంగా మేడిగడ్డ బ్యారేజీని కేసీఆర్ ప్రభుత్వ హయాంలో నిర్మించారు. అయితే ఈ బ్యారేజీలోని పలు పిల్లర్లు 2023లో కుంగాయి. ఈ అంశం



నాటి ప్రతిపక్షం కాంగ్రెస్ పార్టీ తన ప్రచారాస్త్రంగా మలుచుకుంది. 2024లో ఎన్నికల ప్రచారంలో భాగంగా తాము అధికారంలోకి వస్తే.. సుప్రీంకోర్టు రిటైర్డ్ జడ్జితో ఈ బ్యారేజీ నిర్మాణంపై విచారణ జరిపిస్తామని కాంగ్రెస్ పార్టీ హామీ ఇచ్చింది. ఇక ఆ ఎన్నికల్లో తెలంగాణ ఓటరు కాంగ్రెస్ పార్టీకి పట్టం కట్టాడు. దీంతో రేవంత్ రెడ్డి సారథ్యంలో కాంగ్రెస్ ప్రభుత్వం కొలువు తీరింది. నంతరం ఈ అంశంపై సుప్రీంకోర్టు రిటైర్డ్ జడ్జి పీసీ ఘోష్ సారథ్యంలో విచారణ కమిషన్‌ను రేవంత్ రెడ్డి ప్రభుత్వం నియమించింది. ఈ కమిషన్ విచారణలో భాగంగా పలువురు ఉన్నతాధికారులతోపాటు సిబ్బందిని సైతం ప్రశ్నించింది. అలాగే పలువురు స్వచ్ఛందంగా ఈ విచారణకు హాజరై.. పలు విషయాలను జస్టిస్ పీసీ ఘోష్‌కు వివరించారు. ఈ నేపథ్యంలో సీఎం కేసీఆర్‌తోపాటు ఆయన కేబినెట్‌లో మంత్రులుగా వ్యవహరించిన హరీశ్‌రావు, ఈటల రాజేందర్‌లకు కమిషన్ నోటీసులు జారీ చేసింది. జూన్ 5వ తేదీన కేసీఆర్, జూన్ 6వ తేదీన హరీశ్ రావు.. అలాగే జూన్ 9వ తేదీన ఈటల రాజేందర్ కమిషన్ ముందు హాజరు కావాలని ఆ నోటీసుల్లో కమిషన్ స్పష్టం చేసింది. కేసీఆర్ కేబినెట్‌లో భారీ నీటి పారుదల శాఖ మంత్రిగా హరీశ్ రావు, ఆర్థిక శాఖ మంత్రిగా ఈటల రాజేందర్ పని చేసిన సంగతి తెలిసిందే.

# భద్రతా బలగాలను అభినందించిన ప్రధాని

- ఎక్స్ వేదికగా నంబాల హతంపై స్పందన



**న్యూఢిల్లీ,మే21( వెలుతురు):**
ఛత్తీస్‌గఢ్ లోని నారాయణపూర్ జిల్లాలో బుధవారం ఉదయం జరిగిన ఎదురుకాల్పుల్లో 27 మంది మావోయిస్టులు మృతి చెందారు. ఈ ఎన్‌కౌంటర్‌పై ప్రధాని నరేంద్రమోదీ తాజాగా ఎక్స్ వేదికగా స్పందించారు. ఆపరేషన్‌లో పాల్గొన్న భద్రతా బలగాలను ప్రశంసించారు. 'మీ అద్భుత విజయాన్ని చూసి గర్విస్తున్నా. మావోయిజం ముప్పును నిర్మూలించి.. ప్రజలకు శాంతి, పురోగతితో కూడిన జీవితాన్ని అందించేందుకు ప్రభుత్వం కట్టుబడి ఉందని ప్రధాని పేర్కొన్నారు. ఎదురుకాల్పుల్లో మావోయిస్టు అగ్ర నేత నంబాల కేశవరావు (70) అలియాస్ బసవరాజు మృతి చెందినట్లు ఎక్స్ వేదికగా అమిత్ షా వెల్లడించిన సంగతి తెలిసిందే. 'నక్సలిజం నిర్మూలనలో ఇదొక మైలు రాయి విజయం. 2026 మార్చి 31 నాటికి నక్సలిజాన్ని నిర్మూలించేందుకు మోదీ సర్కార్ దృఢ సంకల్పంతో ఉంది' అని రాసుకొచ్చారు. మాఢ్ ప్రాంతంలో పెద్దఎత్తున మావోయిస్టులు ఉన్నట్లు సమాచారం రావడంతో భద్రతా బలగాలు ఆపరేషన్ చేపట్టాయి. ఈ ఆపరేషన్‌లో బీజాపూర్, నారాయణపూర్, దంతెవాడ డీఆర్జీ బలగాలు పాల్గొన్నాయి. ఇటీవల ఛత్తీస్‌గఢ్-తెలంగాణ సరిహద్దుల్లోని కరేగుట్ట పర్వతాల్లో 24 రోజులపాటు జరిగిన ఆపరేషన్‌లో 31 మంది మావోయిస్టులు మరణించిన సంగతి తెలిసిందే. వీరిలో 16 మంది మహిళలు ఉన్నారు.

## రాజీవ్ గాంధీ ఈ దేశానికి 21 వ శతాబ్దాలంలోకి సాంకేతిక విప్లవానికి తీసుకొచ్చారు..

- వారి చొరవతోనే మనం ఈరోజు టెక్నాలజీ వాడుతున్నాం
- మాజీ ప్రధాని రాజీవ్ గాంధీ వర్ధంతి సందర్భంగా చిత్రపటానికి నివాళులు అర్పించిన మంత్రి పొన్నం ప్రభాకర్



**అక్కన్నపేట వెలుతురు మే 21:**
మాజీ ప్రధాని రాజీవ్ గాంధీ గారి వర్ధంతి సందర్భంగా సిద్దిపేట జిల్లా హుస్నాబాద్ నియోజకవర్గం అక్కన్నపేట మండల కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో రాజీవ్ గాంధీ చిత్రపటానికి నివాళులు అర్పించిన రవాణా మరియు బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ మంత్రి పొన్నం ప్రభాకర్ మాట్లాడుతూ మాజీ ప్రధాని రాజీవ్ గాంధీ గారి వర్ధంతి సందర్భంగా వారికి ఘన నివాళులు అర్పిస్తున్నదరాజీవ్ గాంధీ ఈ దేశానికి 21 వ శతాబ్దాలంలోకి సాంకేతిక విప్లవానికి తీసుకొచ్చారు.. వారి చొరవతోనే మనం ఈరోజు టెక్నాలజీ వాడుతున్నాం ఇందిరా గాంధీ గరిభి హటావో , పీవీ నరసింహారావు ఆర్థిక విప్లవం , రాజీవ్ గాంధీ సాంకేతిక విప్లవం, నెహ్రూ గారి పంచవర్ష ప్రణాళికల మననం చేసుకుంటున్నాం వారు తెచ్చిన సాంకేతిక విప్లవం,18 సంవత్సరాలకే ఓటు హక్కు ,పంచాయతీ రాజ్ చట్టం ,ఢిల్లీ నుండి గల్లి దాకా జవహర్ రోజ్‌ఘర్ పథకాన్ని తెచ్చారు బుధవారం రోజున వారి వర్ధంతి సందర్భంగా వారి సేవలు గుర్తు చేసుకుంటూ వారికి ఘన నివాళులు అర్పిస్తున్న

## సూట్‌కేసులో మహిళ మృతదేహం

**బెంగళూరు,మే21( వెలుతురు):**
బెంగళూరు నగర శివార్లలో బుధవారం ఉదయం అత్యంత దారుణ ఘటన వెలుగులోకి వచ్చింది. నగర శివార్లలోని చందాపుర ప్రాంతంలోని రైల్వే ట్రాక్ సమీపంలో ఓ సూట్‌కేస్ అనుమానాస్పదంగా పడి ఉంది. ఆ సూట్‌కేస్‌లో ఓ మహిళ మృతదేహం ఉండడంతో అందరూ నివ్వెరపోయారు. సమాచారం అందుకున్న పోలీసులు వెంటనే కేసు నమోదు చేసుకుని దర్యాప్తు ప్రారంభించారు.బెంగళూరు నగర శివార్లలోని అనేకల్ తాలూకా పరిధిలోని చందాపుర రైల్వే బ్రిడ్జి సమీపంలో బుధవారం ఉదయం ఓ సూట్‌కేసును స్థానికులు గుర్తించారు. రైల్వే ట్రాక్ పక్కన పడి ఉన్న ఆ సూట్‌కేస్ కాస్తా అనుమానాస్పదంగా ఉండడంతో వెంటనే స్థానిక సూర్యానగర్ పోలీసులకు సమాచారం అందించారు. పోలీసులు హుటాహుటిన ఘటనా స్థలానికి చేరుకున్నారు. సూట్‌కేసును తెరిచి చూడగా, అందులో ఓ మహిళ మృతదేహం ఉండటంతో వారు నివ్వెరపోయారు.



వెలుతురు
ఎడిటోరియల్
https://epaper.velthuru.com

# సంపాదకీయం..

## బహిర్గతం చేయరాని విషయాలపై వ్యాఖ్యలా?


దేశ సార్వభౌమాధికార విషయంలో ఏ పార్టీ అయినా ఒక్కటిగా ఉండాల్సిందే. అంతర్జాతీయ విషయాల్లో ఏకముఖంగా సాగాలి. ఇటీవలి పాక్‌తో కాల్పుల ఘటనకు సంబంధించి అందరూ ఒక్కతాటిపైనే ఉన్నట్లు కనిపించినా మెల్లగా స్వరం మారుస్తున్నారు. ముఖ్యంగా కాంగ్రెస్ పార్టీ తీరు అనుమానాస్పదంగా ఉంది. కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే, రాహుల్ గాంధీల వ్యాఖ్యలు రక్షణ దళాల సమర్థతను శంకించేలా ఉన్నాయి. నిజానికి పహల్గామ్ దాడి తరవాత కూడా పిచ్చికూతలు కూసిన వారి వ్యాఖ్యలను పాకిస్థాన్ రికార్డు చేసి, వాటిని ప్రపంచ దేశాల ముందుంచింది. పహల్గామ్ దాడి విషయంలో హిందువువేనా అని నిర్ధారించుకుని కాల్పులు జరిపారు. దీనిపై కొందరు నేతలు అవాకులు చవాకులు పేలారు. అదంతా ఉత్తిదేనని, అలాంటిదేమీ జరగేలదని కొందరు అన్నారు. ఇప్పుడేమో ఖర్గే, అసలది యుద్ధమే కాదు..చిన్న యుద్ధమే అంటూ దీరాలు తీస్తున్నారు. రాహుల్ మాత్రం మనవి ఎన్ని విమానాలు కూలాయని ఆరా తీస్తున్నారు. ఇవన్నీ ప్రభుత్వానికి సంబంధించిన వ్యవహారాలు. అనుమానాలు ఉంటే రక్షణశాఖ అధికారులను కలిసి తెలుసుకోవచ్చు. అలాగే తెలుసుకున్న సమాచారాన్ని గుట్టు చప్పుడు కాకుండా కాపాడుకోవాలి. తాజాగా జరిగిన భారత్-పాకిస్తాన్ ఘర్షణలతో అర్ధాంతరంగా రెండు దేశాలు కాల్పుల విరమణకు ఒప్పుకోవడం వెనక కారణాలు చెప్పాలని కూడా కాంగ్రెస్ డిమాండ్ చేస్తోంది. కాంగ్రెస్ తదితర పార్టీల తీరు కేవలం పాక్‌కు మాత్రమే అనుకులంగా ఉంటుందని అర్థం చేసుకోవాలి. ఇది చిన్నపాటి యుద్ధమేనని, కాల్పులు ఎందుకు ఇరమించారని నిలదీస్తున్నారు. మనవి ఎన్ని విమానాలు కూలాయని రాహుల్ అంటున్నారు. శశిథరూర్‌ను విదేశీశాకు వెళ్లే బృందందలో ఎంపిక చేస్తే తట్టుకోవడం లేదు. గతంలో ఐక్యరాజ్యసమితిలో పనిచేసిన అనుభవం థరూర్‌కు ఉంది. ఇకపోతే అమెరికా తీరు కూడా అనుమానాస్పదంగా ఉంది. పాక్, భారత్ ఘర్షణలతో తమకు సంబంధం లేదని స్పష్టం చేస్తూ వచ్చిన అమెరికా అధ్యక్షుడు ట్రంప్ అకస్మాత్తుగా తామే రెండు దేశాలను ఒప్పించి, కాల్పుల విరమణకు దోహదం చేశామని చెప్పుకోవడం ..తరవాత నా ప్రమేయం లేదనడం వంటివన్నీ చూస్తున్నాం. అయితే ఇందులో అమెరికా ప్రమేయం లేదని భారత్ పదేపదే స్పష్టం చేస్తూ రావడం గమనిస్తే తెరవెనుక చీకటి రహస్యాలు దాగి ఉన్నాయనే అనుమానాలు కలుగుతున్నాయి. ముందురోజు కూడా ఈ ఘర్షణ విషయంలో జోక్యం చేసుకోనని చెబుతూ వచ్చిన అమెరికా అంత అకస్మాత్తుగా ఎందుకు కాల్పుల విరమణ జరపాలని రెండు దేశాలపై ఒత్తిడి తెచ్చిందన్నది కూడా ముఖ్యమే. ఇజ్రాయిల్‌ను, రష్యాను ఇలాంటి సందర్భాల్లో ఒత్తిడి చేయలేక పోయింది. తన మాట వినకపోతే వాణిజ్య సంబంధాలు నిలిపివేస్తామని బెదిరించడంతో రెండు దేశాలు దారికి వచ్చాయని స్వయంగా డొనాల్డ్ ట్రంప్ పేర్కొనడం గమనార్హం. ఇదే సమయంలో పాకిస్తాన్ అణుస్థావరం అని చెబుతున్న కిరానా హిల్స్ వద్ద భారత్ వైమానిక దళం క్షిపణులు ప్రయోగించడంతో అణుధార్మికత లీకేజీ జరగడంతో అమెరికా రంగంలోకి దిగి ఒత్తిడి తెచ్చిందనే ప్రచారం కూడా జరుగుతోంది.అయితే, అక్కడ అణుస్థావరం ఉన్నట్లు తమకు తెలియదని, ఆ ప్రాంతంలో అసలు తాము క్షిపణులనే ప్రయోగించలేదని భారత వైమానిక దళాధికారి స్పష్టం చేశారు. కిరానా హిల్స్ లో ఎలాంటి లీకేజీ జరగలేదని 'ఇంటర్నేషనల్ అటామిక్ ఎనర్జీ ఎమ్జ్గం÷న్సీచెబుతోంది. అసలు కిరానా హిల్స్‌పై వస్తున్న వార్తలపై పాకిస్తాన్ ఎందుకు మౌనం పాటిస్తోంది? దాయాది దేశం కిరానా హిల్స్ విషయంలో ఏమైనా దాచిపెడుతుందా? అనే అనుమానాలు కలుగుతున్నాయి. పాకిస్తాన్ భారత్‌పై అణ్వస్త్రాలు ప్రయోగించ డానికి సిద్ధమవుతుండగా, కట్టడి చేసేందుకు భారత్ క్షిపణి ప్రయోగించిందనే కథనాలు కూడా వెలువడ్డాయి. అణుదాడుల గురించి దాయాది దేశం నుంచి ఎటువంటి సంకేతాలు రాలేదని విదేశాంగ కార్యదర్శి విక్రమ్ మిస్రీ తాజాగా తేల్చి చెప్పారు. బరోవైపు పాక్ అణుదాడి హెచ్చరికలను ప్రధాని మోడీ కూడా కొట్టి పారేశారు. ఇలాంటి హెచ్చరికలతో భారత్‌ను బెదరించలేదరని అన్నారు. కిరానా హిల్స్ ప్రాంతంలో అణ్వస్త్రాల స్థావరం ఉందని, రెండు దేశాల ఘర్షణ ఆ ప్రాంతానికి ఎక్కడ విస్తరిస్తుందో అన్నభయంతోనే కాల్పుల విరమణ జరిగే విధంగా రెండు దేశాలకు అమెరికా నచ్చచెప్పే ప్రయత్నం చేసిందని భావించాల్సి వస్తుంది. ఆ ప్రయత్నం కూడా రష్యా- ఉక్రెయిన్ మధ్య శాంతి చర్చల మాదిరిగా సుదీర్ఘంగా చర్చలతో కాలయాపన చేయకుండా తక్షణమే అమలులోకి వచ్చే విధంగా ప్రయత్నం జరిగిన్నట్లు స్పష్టం అవుతుంది. విదేశీ వ్యవహారాల పార్లమెంటరీ స్థాయి సంఘం సమావేశంలో ఈ ఘర్షణలతో జరిగిన దాడులు, నష్టాల వివరాల గురించి పలువురు ఎంపిలు ప్రశ్నించగా 'జాతీయ భద్రత' దృష్ట్యా అటువంటి వివరాలు వెల్లడించ లేమని విదేశాంగ కార్యదర్శి విక్రమ్ మిస్రీ పేర్కొనడం గమనార్హం. ఏదేమైనా ఇటీవల చోటు చేసుకున్న భారత్ పాకిస్థాన్ ఘర్షణలకు సంబంధించి ప్రభుత్వ వాదనను విశ్వసించాల్సిందే. ఇందులో ఈకలు పీకాల్సిన పనిలేదు. గతంలో ఇందిర చేసిందే యుద్ధం.,.మోడీ యుద్ధం ఏమీ చేయలేదనడం కూడా సరికాదు. కాంగ్రెస్ నేతలు ఆచితూచి మాట్లాడితే మంచిది. దేశం ముందు అంతా సమానమే. మన భద్రత, సార్వభౌమాధికారం కూడా ముఖ్యమే. ఇలాంటి సమయంలో అనవసర వ్యాఖ్యలు చేసి ప్రపంచం ముందు మనలను మనం చులకన చేసుకోరాదు. ఈ విషయంలో ఖర్గే , రాహుల్ తదితరులు సంయమనం పాటించాలి. అతిగా మాట్లాడి పాకిస్థాన్‌కు ఉప్పందించే ప్రయత్నం చేయరాదు.

# కిరానా హిల్స్ అణుస్థావరమా...

- లేక అమెరికా అణ్వాయుధ నిల్వలా
- ప్రపంచవ్యాప్తంగా చెలరేగుతున్న అనుమనాలు

**న్యూఢిల్లీ,మే21( వెలుతురు):**

పాకిస్థాన్ సర్గోదా జిల్లాలోని కిరానా హిల్స్‌లో అణు దాడులకు ఉపయోగించే టాక్టికల్ న్యూక్లియర్ వార్‌హెడ్‌లను ఉంచినట్లు వెలువడిన కథనాల పట్లనే మొత్తం ప్రపంచం నేడు దృష్టి సారిస్తోంది. ఇంతకూ ఇవి పాక్‌కు చెందినవా లేక, అమెరికా ఇక్కడ దాచిందా అన్న ప్రశ్న వస్తోంది. అంతర్జాతీయ సమాజం కూడా దీనిపై అనుమానాలు వ్యక్తం చే÷-తోంది. కిరానాహిల్స్ సమీపంలో అణుస్థావరాలపై భారత్ వైమానిక దాడుల తరవాతనే హఠాత్తుగా పాక్ కాల్పుల విరమణ ప్రతిపాదన తెరపైకి వచ్చింది. ట్రంప్ కూడా దీనిని సమర్థించారు. అందుకే ఇప్పుడు పాక్, అమెరికాల తీరుపై అనుమానాలు వస్తున్నాయి. పాక్‌కు అనుకూలంగా అమెరికా మాట్లాడడం కూడా అనుమానాలు కలిగిస్తున్నాయి. ఎందుకంటే కిరానాహిల్స్‌కు దాదాపు 20 కిలోమీటర్ల దూరంలోనే ముసఫ్ ఎయిర్ బేస్ ఉంది. భారత్ దాడి చేసిన 11 ఎయిర్ బేస్‌లలో ఇది ఒకటి. ఇక్కడి నుంచి కిరానా హిల్స్‌కు కనెక్షన్ ఉందని అంటున్నారు. దీంతో ఇక్కడే వార్‌హెడ్లకు నష్టం జరిగి రేడియో యాక్టివ్ రిలీజ్ అయ్యి ఉండొొచ్చని విశ్లేషణలు వెలువడు తున్నాయి. ఇక్కడే భారీ విధ్వంసం సృష్టించే అణు దాడులు చేసే స్ట్రాటజిక్ న్యూక్లియర్ వార్‌హెడ్లను పాక్ నిల్వచేసిందని అంతర్జాతీయ మీడియా కథనాలు వెలవరించింది. ఈ నేపథ్యంలో ఇక్కడ అణుధార్మికత వెలువడి ఉండవచ్చన్నది ఆ కథనాల సారాంశం. అమెరికాకు చెందిన సిఐఎ మాజీ అధికారి డెరెక్ గ్రాస్మన్ కూడా ఈ వాదనను బలపర్చారు. ఇదే సందర్భంలో పాకిస్తాన్‌లోని ఎయిర్ బేస్‌లపై భారత్ దాడి చేసిన తర్వాత అమెరికా డిపార్ట్‌మెంట్ ఆఫ్ ఎనర్జీకి చెందిన న్యూక్లియర్ ఎమర్జెన్సీ సపోర్ట్ ఎయిర్ క్రాఫ్ట్ బి350 ఎంఎంఎస్ పాక్ గగనతలంలోకి వచ్చినట్లు పలు అంతర్జాతీయ వార్తా సంస్థలు కథనాలు ప్రచురించాయి. ఈ విమానం ద్వారా రేడియోధార్మిక యాక్టివిటీని అంచనా వేస్తారు. అణు కర్మాగార ప్రమాదాల తర్వాత రేడియేషన్ లీక్‌లను పర్యవేక్షించడం, రేడియో లాజికల్ సంఘటనల సమయంలో అత్యవసర సేవలకు ఈ విమానాన్ని మోహరిస్తారు. ఈ పరిణామాలు అన్నింటిని లోతుగా విశ్లేషణ జరిపితే భారత్‌పై అణ్వస్త్రాలను ఉపయోగించే ప్రయత్నం పాకిస్తాన్ చేసిన దాఖలాలు కనిపించకపోయినా కిరానా హిల్స్ ప్రాంతంలో అణ్వాయుధ స్థావరం నెలకొన్నట్లు మాత్రం స్పష్టం అవుతుంది. అయితే, అమెరికా ఆదుర్దాగా ఈ విషయంలో స్పందించడం బట్టి చూస్తుంటే ఈ స్థావరం పాకిస్థాన్‌కు చెందింది కాకపోవచ్చని, అమెరికాకు సంబంధించినది కావచ్చనే అనుమానాలు బలంగా వ్యాపిస్తున్నాయి. కిరానా హిల్స్‌కు సంబంధించిన చిత్రాలను గూగుల్‌లో వెడల్పుగా చేసి చూస్తుంటే అక్కడ భూగర్భంలో భారీ స్థావరాలు ఉన్నట్లు స్పష్టం అవుతుంది. ఒక చిత్రంలో 2019 అక్టోబర్‌లో పాకిస్తాన్‌లోని కిరానా హిల్స్‌లోని అటువంటి అణు బంకర్లలో




ఒకదానిలోకి ఏదో ఒకటి తీసుకువెళుతున్న దృశ్యం కనిపిస్తుంది. సుమారు 150 విశాలమైన బంకర్లు ఉన్నట్లు, ఒకొక్క బంకర్ ద్వారమే 120 మీటర్ల వరకు ఉన్నట్లు చిత్రాలు కనిపిస్తున్నాయి. ఆ బంకర్లు బలమైన లోహాలతో తయారు చేసి ఉండవచ్చని, వాటిని ఇసుకతో కప్పి, చెట్లు వచ్చే విధంగా చేశారని విశ్లేషకులు భావిస్తున్నారు. ప్రపంచంలో బహుశా మరెక్కడా ఇంతటి భారీ బంకర్లు, విశాలమైన ప్రాంగణాలలో సైనికులకు లేకపోవచ్చని కూడా అంచనా వేస్తున్నారు. అంతటి భారీ బంకర్లను నిర్మించే సామర్థ్యం, ఆర్థికంగా వెసులుబాటు పాకిస్తాన్‌కు ఉండే అవకాశం లేదని, అమెరికా స్వయంగా తన సైనిక ప్రయోజనాలకోసం నిర్మించుకొని ఉండవచ్చనే అనుమానాలు కూడా ఈ సందర్భంగా కలుగుతున్నాయి. పైగా, వ్యూహాత్మకంగా కిరానా హిల్స్ భౌగోళిక ప్రాంతం నెలకొన్న ప్రాధాన్యత కూడా ఈ సందర్భంగా పరిగణనలోకి తీసుకోవాల్సి ఉంటుంది. ప్రపంచంలో అమెరికా తర్వాత అతి పెద్ద సైన్యం కలిగిన రష్యా, చైనా దేశాలు ఇక్కడకు సమీపంలో ఉన్నాయి. ఇక్కడి నుండి దక్షిణాసియా, ఆగ్నేయాసియా దేశాలపై క్షిపణులు, అణ్వస్త్రాలను ప్రయోగించేందుకు సౌలభ్యంగా ఉంటుంది. ముఖ్యంగా ప్లూటోనియం డర్టీ బాంబులను ఉపయోగించి మొత్తం భారతదేశపు సామర్థ్యంపై రేడియేషన్ ప్రభావం కలిగించే అవకాశం ఉంటుంది. అంటే సగానికి పైగా ప్రపంచంపై సైనికంగా ఆధిపత్యం వహించేందుకు వ్యూహాత్మకంగా అనుకూలంగా ఉండే ప్రాంతంగా రక్షణ రంగ నిపుణులు భావిస్తున్నారు.మరోవంక, తమ దేశ అణ్వస్త్రాలపై భారత్ దాడి చేసిందని ఒప్పుకుంటే అంతర్జాతీయ వేదికపై తమ పరువు పోతుందన్న ఆలోచనలో దాయాది దేశం ఉన్నట్లు నిపుణులు అంటున్నారు. అంతేకాదు, ఈ అంశంపై దేశ ప్రజలకు కూడా సమాధానం చెప్పాల్సి వస్తుందని పాకిస్తాన్ భయపడి ఉండొొచ్చని విశ్లేషణలు వెలువడుతున్నాయి. ఎందుకంటే, న్యూక్లియర్ వార్‌హెడ్స్ కూడా రక్షించుకోలేనంత శక్తిహీనంగా పాలకులు తయారయ్యారని స్వదేశంలోనే ఇబ్బందికర పరిస్థితి తలెత్తే అవకాశం ఉంది. దానితో కిరానా హిల్స్‌లో వాస్తవ పరిస్థితిని ప్రపంచానికి తెలియకుండా దాచిపెడుతున్నట్లు తెలుస్తోంది. అందుకనే కిరానా హిల్స్‌లో అణ్వస్త్రాలు ఉన్నాయనే కథనాలు అంతర్జాతీయంగా ఆందోళన కలిగిస్తున్నాయి. అయితే, ఈ కథనాలపై పాకిస్తాన్‌తో పాటు అమెరికా, చైనా, రష్యా వంటి దేశాలు సహితం మౌనం వహిస్తూ ఉండటం గమనార్హం. భారత్ కేవలం పాకిస్తాన్ అణ్వస్త్రాలు ప్రయోగించే ప్రయత్నం చేయలేదని మాత్రమే చెప్పింది గాని, అక్కడ అటువంటి ఆయుధాలు లేవని మాత్రం చెప్పడం లేదు. పైగా ఈ పరిణామాలపై రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ ఆందోళన వ్యక్తం చేస్తూ ఆ దేశంలోని అణ్వస్త్రాలను ఐఎఇఎ పర్యవేక్షణ కిందకు తీసుకు రావాలని డిమాండ్ చేశారు. ఉగ్రవాదానికి నిలయంగా ఉన్న దేశంలో అణ్వస్త్రాలు ప్రపంచ శాంతికి ప్రమాదకారి కాగలవని ఆయన హెచ్చరించారు. కానీ, ఆయన వ్యక్తం చేసిన ఆందోళనలపై పాకిస్తాన్ సైతం స్పందించే ప్రయత్నం చేయడం లేదు. ఈ విషయమై ఇప్పటి వరకు తాము అణ్వస్త్రం గల దేశం అంటూ భారత్‌ను బెదిరిస్తూ వస్తున్న పాకిస్తాన్ తాజా ఘటనలతో వాటిని నేలమట్టం చేయగల సామర్థ్యం భారత్‌కు ఉందనే సంకేతం ఇచ్చినట్లయింది. పాకిస్తాన్‌కు అణుదాడి ఆలోచన వచ్చే లోపే ఆ స్థావరాలను నామరూపాల్లేకుండా చేస్తామన్న సంకేతాలను భారత్ ఇచ్చినట్టు కావడంతో భారత్ చేసిన ఈ హెచ్చరికను పాకిస్తాన్ బహిరంగంగా ఒప్పుకోలేక మౌనం పాటిస్తుందా? అనే అనుమానం కూడా కలుగుతోంది.

# దేశంలో మళ్లీ కరోనా బెల్స్

- ముంబైలో అత్యధికంగా పాజిటివ్ కేసులు
- జాగ్రత్తలు తీసుకోవాలని హెచ్చరించిన ప్రభుత్వం

**న్యూఢిల్లీ,మే21( వెలుతురు):**

దక్షిణాసియాలో కొవిడ్-19 మళ్లీ విజృంభిస్తోంది. భారత్‌లోనూ కరోనా వైరస్ కేసుల సంఖ్య క్రమంగా పెరుగుతోంది. ప్రస్తుతం దేశంలో 257 యాక్టివ్ కేసులు నమోదైనట్లు ఆరోగ్య శాఖ అధికారులు వెల్లడించారు. అయితే, మరణాలు కూడా సంభవిస్తుండటం ఆందోళన కలిగిస్తోంది. ఈ ఏడాది జనవరి నుంచి మహారాష్ట్ర లో ఏకంగా వందకుపైగా పాజిటివ్ కేసులు నిర్ధారణ అయినట్లు ఆ రాష్ట్ర ఆరోగ్యశాఖ అధికారులు తెలిపారు. మొత్తం 6,066 స్వాబ్ టెస్ట్‌లు చేయగా 106 కేసులు పాజిటివ్‌గా తేలినట్లు చెప్పారు. అందులో కేవలం 101 మంది ముంబైకి చెందిన వారే ఉండటం గమనార్హం. మిగిలిన వారు థానే, పూణె, కొల్హాపూర్‌కు చెందిన వారుగా పేర్కొన్నారు. ప్రస్తుతం రాష్ట్రంలో 52 పాజిటివ్ కేసులు ఉన్నట్లు వెల్లడించారు. వీరిలో 16 మంది ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నట్లు చెప్పారు. జనవరి నుంచి రెండు కొవిడ్ సంబంధిత మరణాలు కూడా నమోదైనట్లు రాష్ట్ర ఆరోగ్య శాఖ మంగళవారం తెలిపింది. మరణించిన వారిలో ఒకరు క్యాన్సర్ రోగి అని పేర్కొంది. దేశంలో కొవిడ్ పరిస్థితి నియంత్రణలో ఉందని, ఆందోళన అవసరం లేదని కేంద్ర ప్రభుత్వం ప్రకటించిన విషయం తెలిసిందే. మరోవైపు పరిస్థితిని జాగ్రత్తగా పర్యవేక్షిస్తున్నామని తెలిపింది. జలుబు, దగ్గుతో బాధపడుతున్న రోగులతోపాటు ఊపిరితిత్తుల



వ్యాధులకు సంబంధించిన రోగుల విషయంలో ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని దవాఖానలను ఆదేశించింది. సింగపూర్, చైనా, థాయ్‌లాండ్‌లో కొవిడ్ పెరుగుదల తీవ్రంగా ఉంది. ఏప్రిల్ చివరి వారంలో 11వేల కేసులు సింగపూర్‌లో నమోదుకాగా, మే మొదటి వారానికి ఆ సంఖ్య 14,000 దాటింది. హాంకాంగ్‌లో మే మొదటివారంలో 1000కిపైగా కొత్త కేసులు నమోదుకాగా, 33 మంది ప్రాణాలు కోల్పోయారు. చైనాలోనూ కొవిడ్ కేసులు క్రమంగా పెరుగుతున్నాయని, ఫ్లూ లక్షణాలతో దవాఖానల్లో చేరే వారి సంఖ్య సాధారణం కంటే రెట్టింపు ఉన్నట్టు అధికారులు తెలిపారు. ఆసియా దేశాల్లో ప్రస్తుతం వైరస్ వ్యాప్తికి జేఎన్.1, దాని సబ్‌వేరియంట్‌లే కారణమని అధికారులు చెబుతున్నారు. జేఎన్.1 ఉపరకాలైన ఎల్ఎఫ్.7, ఎన్‌బీ.1.8 వేరియంట్‌ల వ్యాప్తి ఎక్కువగా ఉన్నదని సింగపూర్ తెలిపింది.

# నాలుగైదు రోజుల్లో కేరళను తాకనున్న నైరుతి

- కేరళలోకి ప్రవేశించేలా అనుకూల వాతావరణం



**న్యూఢిల్లీ,మే21( వెలుతురు):**

మరో నాలుగైదు రోజుల్లో నైరుతి రుతుపవనాలు కేరళను తాకనున్నాయి. సాధారణంగా రుతు పవనాలు వచ్చే జూన్ 1వ తేదీ కన్నా చాలా ముందుగానే కేరళను చేరుకునే అవకాశం ఉందని భారత వాతావరణ శాఖ (ఐఎండి) పేర్కొంది. మరో నాలుగైదు రోజుల్లో రుతుపవనాలు కేరళలోకి ప్రవేశించేందుకు వాతావరణ పరిస్థితులు అనుకూలంగా ఉన్నాయని తెలిపింది. ఈ నెల 22 నాటికి కర్ణాటక తీరంలో అల్పపీడనం అభివృద్ధి చెందే అవకాశం ఉన్నందున కేరళ, కర్ణాటక, మహారాష్ట్ర ప్రాంతాలు రెడ్ అలర్ట్‌లో ఉన్నాయి. ఈ నెల 22 నాటికి అల్పపీడనంగా మారుతుందని, ఆ తరువాత మరింత తీవ్రమవుతుందని ఐఎండి పేర్కొంది. ఈ నెల 24 వరకూ ఆంధ్రప్రదేశ్, కేరళ, తెలంగాణ, తమిళనాడు, పుదుచ్చేరి, కారైకల్, కొంకణ్, గోవా, మధ్య మహారాష్ట్ర, బీహార్, జార్ఖండ్, మణిపూర్, మిజోరం, త్రిపురలలో భారీ వర్షాలు కురుస్తాయని తెలిపింది. సాధారణంగా జూన్ 1 నాటికి రుతుపవనాలు కేరళలో ప్రవేశిస్తే? దేశమంతటా వర్షాలు ప్రారంభవుతాయి. జులై 8 నాటికి దేశమంతా విస్తరిస్తాయి. మళ్లీ వాయువ్య భారతదేశం నుంచి సెప్టెంబర్ 17తో రుతు పనవనాల ఉపసంహరణ మొదలై అక్టోబర్ 15 నాటికి ముగుస్తుంది. రుతుపవనాలు ఈ నెల 27నాటికి కేరళను తాకే అవకాశం ఉందని గతంలో ఐఎండి అంచనా వేసిన సంగతి తెలిసిందే. ఊహించిన విధంగా రుతుపవనాలు కేరళలోకి ప్రవేశిస్తే.. 2009 మే 23 తర్వాత, రుతుపవనాలు భారత్‌లోకి అతిత్వరగా ప్రవేశం చిన సంవత్సరంగా ఈ ఏడాది నిలుస్తుందని ఐఎండి పేర్కొంది. గతేడాది మే 30న, 2023లో జూన్ 8న, 2022లో మే 29న, 2021లో జూన్ 3న, 2020లో జూన్ 1న, 2019లో జూన్ 8న, 2018లో మే 29న రుతుపవనాలు కేరళలో ప్రవేశించాయి. ఈ ఏడాది సాధారణం కంటే అధిక వర్షపాతం ఉంటుందని ఏప్రిల్‌లో ఐఎండి అంచనా వేసింది. ఎల్‌నినో పరిస్థితులు ఉండవని స్పష్టం చేసింది. ఎల్‌నినోతో భారత్‌లో సాధారణం కంటే తక్కువ వర్షపాతం నమోదవుతుంది.

# రాష్ట్రంలో అరాచక పాలన జరుగుతోంది

- రేషన్ డోర్ డెలిరీ ఆపేయడమేమిటి
- ఎంపి మిథున్ రెడ్డి ఆగ్రహం

**అనంతపురం,మే21( వెలుతురు):**

రాష్ట్రంలో అరాచక పాలన జరుగుతోందని,. భయపెట్టి పాలన చేయాలనుకోవడం మూర్ఖత్వం అని వైకాపా సీనియర్ నేత, ఎంపీ పెద్దిరెడ్డి మిథున్‌రె అన్నారు.. ఇంటింటికీ రేషన్ సరఫరా వాహనాలు రద్దు చేయడం సరికాదని హితవుచెప్పారు.. ఉమ్మడి అనంతపురం జిల్లా వైఎస్‌ఆర్ కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇంఛార్జ్‌ల సమావేశంలో పాల్గొన్న మిథున్‌రెడ్డి.. ప్రభుత్వంపై సంచలన వ్యాఖ్యలు చేశారు.. అసలు వైఎస్ జగన్మోహన్‌రెడ్డి పాలనలో మద్యం కుంభకోణం జరగలేదని స్పష్టం చేశారు.. కట్టుకథలతో మద్యం కుంభకోణం జరిగిందని టీడీపీ ప్రభుత్వం తప్పుడు ప్రచారం చేస్తోందంటూ మండిపడ్డారు.. ఇక, వైఎస్ జగన్ ఇచ్చిన సంక్షేమ పథకాలు ఆపడం దారుణమైన విషయం అన్నారు.. ఇచ్చిన హామీలు అమలు చేయకుండా.. జగన్ ప్రభుత్వ సంక్షేమ పథకాలను అమలు చేయకుండా.. ప్రజల దృష్టిని మరల్చడానికి ముఖ్యమంత్రి చంద్రబాబు డైవర్షన్ పాలిటిక్స్ చేస్తున్నారని మండిపడ్డారు.. అనంతపురం జిల్లాలో రూరల్ డెవలప్మెంట్ ట్రస్ట్ (ఆర్డీటీ)కి విదేశీ నిధులు ఆపడం దుర్మార్గం అని ్గ÷ర్ అయ్యారు.. హంద్రీనీవా లైనింగ్ పనులపై ప్రభుత్వం పునరాలోచన చేయాలని సూచించారు ఎంపీ పెద్దిరెడ్డి మిథున్‌రెడ్డి.. ఏపీ ప్రభుత్వంపై వైసీపీ అధినేత వైఎస్ జగన్మోహన్ రెడ్డి.. మంగళవారం రోజు సంచలన వ్యాఖ్యలుచేసిన విషయం విదితమే.. ప్రభుత్వంపై నిప్పులు చెరుగుతూనే అధికారులకు హెచ్చరికలు జారీ చేశారు.. ఇప్పుడు ఉన్న అధికారులు అన్యాయమైన పనులు చేస్తే.. రేపు మళ్లీ మన రోజు వస్తుంది.. ఇప్పుడు పేర్లు రాసిపెట్టుకొంది.. రిటైర్డ్ అయినా.. విదేశాలకు పారిపోయినా.. తీసుకొచ్చిన సినిమా చూపిస్తామంటూ సీరియస్ వార్నింగ్ ఇచ్చిన విషయం తెలిసిందే..

# సరికొత్త చరిత్రను దేశం లిఖించేలా అడుగులు వేసిన రాజీవ్ గాంధీ ఎప్పటికీ చిరస్మరణీయుడే

- టీపీసీసీ అధికార ప్రతినిధి డా. సత్యం శ్రీరంగం...

**కూకట్ పల్లి మే 21 వెలుతురు:**

దేశంలో సాంకేతిక విప్లవానికి పునాదులు వేసి.. ఆధునిక భారత్ కు బాటలు వేసిన దార్శనికులు మాజీ ప్రధాని, భారత రత్న రాజీవ్ గాంధీ అని టిపిసిసి అధికార ప్రతినిధి డాక్టర్ సత్యం శ్రీరంగం కొనియాడారు. బుధవారం రాజీవ్ గాంధీ వర్ధంతి సందర్భంగా కెపిహెచ్ బి కాలనీ లోని రాజీవ్ సర్కిల్ వద్ద డివిజన్ అధ్యక్షులు తమ్మినేని ప్రవీణ్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కార్యక్రమానికి మాజీ కేంద్ర మంత్రి సర్వే సత్యనారాయణ, మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా కాంగ్రెస్ పార్టీ సింగిరెడ్డి హరివర్ధన్ రెడ్డి, టీపీసీసీ అధికార ప్రతినిధి డా. సత్యం శ్రీరంగం ముఖ్య అతిధులుగా హాజరై రాజీవ్ గాంధీ విగ్రహానికి పూల మాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా సత్యం శ్రీరంగం మాట్లాడుతూ దేశ సేవకు జీవితాన్ని ధారపోసి.. భరతమాత ఒడిలో తుదిశ్వాస వదిలిన రాజీవ్ గాంధీ ప్రపంచంలోనే అతి పిన్న వయస్కుడిగా ప్రధానమంత్రిగా బాధ్యతలు చేపట్టి సమర్ధవంతంగా సుస్థిరపాలన అందించిన రాజకీయ నాయకుడిగా రాజీవ్ గాంధీ చరిత్రలో నిలిచారని అన్నారు. రాజకీయాలంటే ఇష్టం లేకపోయినా ప్రధానమంత్రిగా చరిత్రలో నిలిచిపోయే విధంగా శాస్త్ర సాంకేతిక రంగం వృద్ధికి




ఊతమిచ్చారని అన్నారు. భారతదేశానికి నూతన దిశను చూపిన మహానాయకుడు అని, 21వ శతాబ్దం భారతానికి తగిన సాంకేతికత, ఐటీ విప్లవం, యువతలో నూతన ఆశలు నూరిపోసిన వ్యక్తి రాజీవ్ గాంధీ అని పేర్కొన్నారు. గ్రామీణ అభివృద్ధి, విద్య, ఆరోగ్యం రంగాల్లో ఆయన దూరదృష్టితో అమలు చేసిన పథకాలు నేడు దేశానికి మార్గదర్శకంగా నిలుస్తున్నాయి అన్నారు. భారత్ లో సాంకేతిక విప్లవానికి ఆరాద్యుడైన రాజీవ్ గురించి ఎంత చెప్పిన తక్కువే, ఇప్పుడు మనం ఆర్టిఫీషియల్ ఇంటలిజెన్స్ ను అనుసరిస్తున్నామంటే అందుకు నాడు సాంకేతిక రంగానికి రాజీవ్ గాంధీ వేసిన బీజాలే కారణం అన్నారు. ప్రజాస్వామ్యాన్ని గౌరవించిన రాజీవ్ గాంధీ, గ్రామ పంచాయతీ వ్యవస్థను బలపరిచారని ఆయన చూపిన మార్గాన్ని అనుసరిస్తూ, సీఎం రేవంత్ రెడ్డి ఆయన ఆశయాలను కొనసాగిస్తున్నారు అని, కాంగ్రెస్ పార్టీ ఆయన కలలను సాకారం చేయడంలో ముందుండి నడుస్తోంది అన్నారు. ఈ కార్యక్రమంలో టీపీసీసీ మాజీ కార్యదర్శి గాలి బాలాజీ, ఏ బ్లాక్ అధ్యక్షులు పి. నాగిరెడ్డి, బి బ్లాక్ అధ్యక్షులు తూము వేణు, ఏఎంసి చైర్మన్ పుష్పా రెడ్డి, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు శేరి సతీష్ రెడ్డి, సాధు ప్రతాప్ రెడ్డి, కాంటెస్టెడ్ కార్పొరేటర్ గోపిశెట్టి రాఘవేందర్, సంజీవ్ రావు, మేకల మైకేల్, కొండల్ రెడ్డి, తూము సంతోష్, అరవింద్ రెడ్డి, ఏఎంసి వైస్ చైర్మన్ ప్రకాష్ ముదిరాజ్, డైరెక్టర్లు ఫణీంద్ర, సుధాకర్ రెడ్డి, మూసాపేట్ డివిజన్ అధ్యక్షులు సత్యనారాయణ గౌడ్, గంధం ఏసు రాజు, సప్పిడి భాస్కర్, నర్సింహా యాదవ్, బి బ్లాక్ మహిళా అధ్యక్షురాలు సంధ్య, మహిళా అధ్యక్షురాళ్లు పొన్నం రజిత, మారుతీ, భారతమ్మ, జోజమ్మ, కాంగ్రెస్ పార్టీ సీనియర్ మహిళా నాయకురాళ్లు జ్యోతి, బండి సుధా, మధు మోహన్, అనిల్ యాదవ్, పొడుగు అప్పారావు, కాంగ్రెస్ కార్యకర్తలు, నాయకులు, మహిళలు, యువత పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## డిజిపి చేతుల మీదుగా ప్రశంసా పత్రం అందుకుంటున్న బాలానగర్ సీఐ నర్సింహ రాజు



**కూకట్ పల్లి మే 21 (వెలుతురు):**

బాలానగర్ సీఐ నర్సింహా రాజు ఉత్తమ ఎస్ హెచ్ ఓ గా ఎంపికైన సందర్భంగా బుధవారం తెలంగాణ రాష్ట్ర డిజిపి జితేందర్ చేతుల మీదగా ప్రశంసా పత్రంతో పాటు నగదు బహుమతిని అందుకున్నారు. ఈ సందర్భంగా బాలనగర్ ఎస్ హెచ్ ఓ నరసింహారాజు మాట్లాడుతూ తాను పోలీసు ఉద్యోగంలో చేరిన రోజు కంటే ఉత్తమ పోలీస్ అధికారిగా ఎంపికైనందుకు ఆనందంగా ఉందన్నారు. పోలీసు ఉద్యోగంలో చేరినప్పటి నుండి ప్రజల దైనందిన జీవితాల్లో వెలుగు చూడాలన్న ఉద్దేశంతో పోలీసు ఉన్నతాధికారుల ఆలోచనలు, సలహాలు తీసుకుంటూ క్రమశిక్షణతో విధులు నిర్వర్తించడం మూలంగానే తనకు ఈ అవార్డు లభించిందన్నారు. తనకు సలహాలు ఇచ్చి ముందు నడిపించిన ఉన్నతాధికారులకు ప్రత్యేకించి ప్రజలకు ఈ అవార్డును అంకితం చేస్తున్నట్లు ప్రకటించారు. ఈ అవార్డుతో తనకు మరింత బాధ్యత పెంచిందని భవిష్యత్తులో సమాజా ఆభివృద్ధికి నా వంతు బాధ్యతగా పనిచేస్తానని స్పష్టం చేశారు. ఉత్తమ ఎస్ హెచ్ ఓ లో తొమ్మిదవ స్థానం లభించడం గర్వంగా ఉందన్నారు.

## ప్రజలకు ఇబ్బంది లేకుండా చెరువు అభివృద్ధి పనులు చేపట్టాలి..

- ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు..



**కూకట్ పల్లి మే 21 వెలుతురు:**

ప్రజలకు ఎలాంటి ఇబ్బంది లేకుండా చెరువు అభివృద్ధి పనులు చేయాలని కూకట్ పల్లి ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు అధికారులకు సూచించారు. బుధవారం కూకట్ పల్లి ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు హైడ్రాధికారులు, వాటర్ వర్క్స్, జిహెచ్ఎంసి అధికారులతో నల్లచెరువును పరిశీలించారు.. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వర్షాకాలంను దృష్టిలో పెట్టుకుని చెరువు అభివృద్ధి కొరకు ఇప్పటికే నిధులు మంజూరైన కారణంగా త్వరితగతిన అభివృద్ధి పనులు పూర్తి చేయాలని అన్నారు. అలాగే వర్షాలు పడినప్పుడు డ్రైనేజ్ వ్యవస్థ అస్తవ్యస్తం కాకుండా పైప్లైన్ నిర్మాణం, (రిటర్నింగ్ వాల్స్) చేపట్టి దిగువకు నీరు వెళ్లే విధముగా చూడాలని అన్నారు. అదేవిధంగా జిహెచ్ఎంసి, వాటర్ వర్క్స్ అధికారులతో సమన్వయం చేసుకుని ఎక్కడ ఎలాంటి ఇబ్బంది లేకుండా సత్వరమే పనులు పూర్తయ్యేలా చర్యలు తీసుకోవాలని అధికారులకు తెలిపారు. ఈ కార్యక్రమంలో హైడ్రా అధికారులు డి.ఈ నాగరాజు, జిహెచ్ఎంసి అధికారులు సి.సి చిన్న రెడ్డి, నిఖిల్ రెడ్డి , నాగ ప్రియా, ప్రసన్న తదితరులు పాల్గొన్నారు.

## దేశాభివృద్ధి కోసం రాజీవ్ గాంధీ కృషి...

- కార్పొరేటర్ దొడ్ల వెంకటేష్ గౌడ్...



**కూకట్ పల్లి మే 21 వెలుతురు:**

దేశాభివృద్ధి కోసం మాజీ ప్రధాని రాజీవ్ గాంధీ ఎనలేని కృషి చేశారని కార్పొరేటర్ దొడ్ల వెంకటేష్ గౌడ్ అన్నారు. బుధవారం రాజీవ్ గాంధీ వర్ధంతి సందర్భంగా ఆల్విన్ కాలనీ డివిజన్ పరిధిలోని తన కార్యాలయంలో రాజీవ్ గాంధీ చిత్రపటానికి కార్పొరేటర్ పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ దేశంలో సాంకేతిక విప్లవానికి నాంది పలికింది రాజీవ్ గాంధీ నే అన్నారు. అభివృద్ధి చెందుతున్న దేశాల సరసన భారత దేశాన్ని నిలిపిన ఘనత ఆయనదేనని గుర్తుచేశారు. దేశంలో బీదరికాన్ని పారద్రోలి సమసమాజ స్థాపనకు ఆయన చేసిన కృషి ఎప్పటికి మరవలేమని కొనియాడారు. ఈ కార్యక్రమంలో యువనేత దొడ్ల రామకృష్ణ గౌడ్, శివరాజ్ గౌడ్, షౌకత్ అలీ మున్నా, సయ్యద్, పోశెట్టిగౌడ్, బాలస్వామి, ఖలీమ్, రాజ్యలక్ష్మి, రమాదేవి, సౌందర్య, అరుణ, అన్నపూర్ణ, తదితరులు పాల్గొన్నారు.

## పెరుమాండ్ల ఆంజనేయస్వామి దేవస్థానంలో ప్రత్యేక పూజలు

**వెలుతురు న్యూస్, చౌటుప్పల్ మే 21 :**



పట్టణ పరిధిలో హనుమాన్ జయంతోత్సవాలను పురస్కరించుకొని బుధవారం రోజున శ్రీ పెరుమాండ్ల ఆంజనేయస్వామి దేవస్థానంలో ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహించడమైనది. గణపతి పూజ స్వస్తి వాచనం నవగ్రహ మంటపారాధన, ధ్వజారోహణ కార్యక్రమం దేవస్థాన కమిటీ అధ్యక్షులు శ్రీ ఉప్పు ఆంజనేయులు, ప్రధాన కార్యదర్శి పోలోజు శ్రీనివాస్ చారి, గౌరవ అధ్యక్షులు గోశిక బిక్షపతి కోశాధికారి పోలోజు సూర్య శ్రీనివాస్ చారి దేవస్థాన ప్రహరీ నిర్మాణ దాతలు మూల సుధీర్, డాక్టర్ శ్వేతా ప్రియాంక పూజా కార్యక్రమాలలో పాల్గొన్నారు, అనంతరం ధ్వజారోహణ, యజ్ఞ కార్యక్రమం నిర్వహించారు ఈ కార్యక్రమంలో కొలను రామదాసు, దోర్నాల పద్మ, ఋషి ఎం ఎం బాలరాజు, రుద్ర యాదగిరి, మేండే మల్లేష్, కర్నాటి జనార్ధన్, గుర్రం బాలరాజు, దేవి, శివకుమార్, సుంకి రవి, లావణ్య , సూర భూమేష్, ముత్యాల భూపాల్ రెడ్డి, ముత్యాల లక్ష్మారెడ్డి, ముత్యాల మోహన్ రెడ్డి, బోడిగే బాలకృష్ణ దండా అరుణ్ కుమార్, పోలోజు శ్రీధర్ బాబు, దేప రాజు, రుద్ర యాదగిరి, భోగ వెంకటేశం, కవిత, వనం పాండు, గజ్జల లక్ష్మణ్ గౌడ్ పాల్గొన్నారు.

## శాస్త్రవేత్తగా ఎంపికైన డాక్టర్ శ్రీలేఖను సన్మానించిన రాచాల

**మహబూబ్ నగర్ వెలుతురు మే 21:**

భారతీయ వ్యవసాయ పరిశోధన సంస్థ (ICAR) శాస్త్రవేత్తగా ఎంపికైన డాక్టర్ కలాల్ శ్రీలేఖను బీసీ పొలిటికల్ జెఎసి స్టేట్ చైర్మన్ రాచాల యుగంధర్ గౌడ్ ఘనంగా సన్మానించారు. బుదవారం మహబూబ్ నగర్ పట్టణంలోని ఆమె నివాసానికి వెళ్ళి శాలువాతో సన్మానించి, పూలబొకే అందించి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా రాచాల మాట్లాడుతూ శ్రీలేఖ చిన్నతనంలోనే తండ్రిని కోల్పోయిందని, కుటుంబ ఆర్థిక పరిస్థితులు అంతంత మాత్రంగా ఉన్నా పట్టుదలతో చదివి నేడు శాస్త్రవేత్తగా ఎంపిక కావడం ఉమ్మడి పాలమూరు జిల్లాకే గర్వకారణమని అన్నారు. ప్రొఫెసర్ జయశంకర్ యూనివర్సిటీలో డిగ్రీ పూర్తి చేసుకుని, అదే యూనివర్సిటీలో పీజీలో గోల్డ్ మెడల్ సాధించిందని, ధార్వాడ్ యూనివర్సిటీలో ఫుడ్ సైన్స్ న్యూట్రీషియన్లో పి హెచ్ డి పూర్తిచేసి గోల్డ్ మెడల్ సాధించి చదువుపై ఉన్న



మక్కువను చాటిందన్నారు. శ్రీలేఖ ఎంతో మంది యువతకు స్ఫూర్తిగా నిలిచిందన్నారు. భవిష్యత్తులో ఆమె మరింత ఉన్నత శిఖరాలకు చేరుకుని జిల్లాతో పాటు రాష్ట్రానికి పేరు ప్రతిష్టలు తేవాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో బీసీ పొలిటికల్ జెఎసి నాయకులు దేవర శివ, భరత్, నాగరాజు, విష్ణు గౌడ్, నరేందర్ సాగర్ తదితరులు పాల్గొన్నారు.

## చెంచు గిరిజనుల అభివృద్ధిని పట్టించుకోని గత బిఆర్ఎస్ ప్రభుత్వం

- కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు మాజీ ఎంపీటీసీ దాసరి శ్రీనివాసులు

**వెలుతురు న్యూస్, అమ్రాబాద్:**



నల్లమల చెంచు గిరిజనుల అభివృద్ధికై రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ప్రారంభించిన ఇందిరా సౌర గిరి జల వికాసం పథకం గిరిజనులకు వరం లాంటిదని మాజీ ఎంపిటిసి దాసరి శ్రీనివాసులు అన్నారు. ఈ సందర్భంగా ఆయన అమ్రాబాద్ మండలం మన్ననూరు గ్రామంలో విలేకరుల సమావేశం నిర్వహించి మాట్లాడారు. కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వం ద్వారా తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి గిరిజనుల అభివృద్ధి కోసం ఇందిరా సౌర గిరిజల వికాస పథకం లాంటి సంక్షేమ పథకాన్ని తీసుకొచ్చి గిరిజనుల అభివృదే దేంగా పని చేస్తుంటే ఇటువంటి అభివృద్ధిని చూసి ఓర్వలేక అనవసర ఆరోపణలు చేస్తున్న బి ఆర్ఎస్ నేతలు హరీష్ రావు , మాజీ ఎమ్మెల్యే గువ్వల బాలరాజ్ ఖబర్దార్ గత మీ ప్రభుత్వం పాలన నిర్లక్ష్యం వలన నల్లమల చెంచు గిరిజనులు అభివృద్ధికి నోచుకోలేదు. చెంచు గిరిజనులు ఏజెన్సీ ప్రాంతంలో ఎలా జీవిస్తున్నారని వారి ప్రాంతాలను సందర్శించి చూసి పోయారే తప్ప చేసింది ఏమీ లేదని ఎద్దేవా చేశారు. గౌరవ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి స్థానిక ఎమ్మెల్యే డాక్టర్ చిక్కుడు వంశీకృష్ణ చేస్తున్న కృషి చెంచు గిరిజనులపై ఉన్న ప్రేమ అభిమానంతో ఈ యొక్క పథకాన్ని నల్లమలలో ప్రారంభించడం గిరిజనుల పై వారికి ఉన్నటువంటి నిబద్ధత వారు మా బాధలను గాధలను చూశారు ప్రాంతాలను తిరిగారు పనులు చేసి చూపిస్తున్నారు. మీరు కాంగ్రెస్ ప్రజా పాలన చూసి నేర్చుకోవాలని సూచించారు. ఈరోజు నల్లమలలో గిరిజనులకు జరుగుతున్నటువంటి అభివృద్ధిని చూసి ఓర్వలేక బి ఆర్ఎస్ నాయకులు చెంచు గిరిజనుల అభివృద్ధిని అడ్డుకోవడం సిగ్గుచేటు గత ప్రభుత్వ హయాంలో చేయలేనటువంటి అభివృద్ధి సంక్షేమ కార్యక్రమాలను కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడిన పదిహేను నెలలోనే గౌరవ రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి , స్థానిక ఎమ్మెల్యే డాక్టర్ చిక్కుడు వంశీకృష్ణ కృషి సహకారం నల్లమల్ల చెంచులపై ఉన్నటువంటి అభిమానం వారి నిబద్ధతకు నిదర్శనం. చెంచుల యొక్క ఆర్థిక అభివృద్ధికి పాటుపడుతున్న ఇందిరాసౌర గిరిజలవికాస పథకం అచ్చంపేట నియోజకవర్గంలో పైలెట్ ప్రాజెక్టుగా ఎన్నుకోవడం ఈ యొక్క నల్లమల్ల గిరిజనులకు ఒక వరం లాంటిదని ఆయన అన్నారు. కాంగ్రెస్ పార్టీ ప్రజా ప్రభుత్వం పై అనవసరమైన ఆరోపణలు చేస్తే చూస్తూ ఊరుకోం. నల్లమల్ల చెంచులను పట్టించుకోని గత బి ఆర్ఎస్ ప్రభుత్వ పాలకులు చరిత్రహీనులుగా మిగిలిపోతారే తప్ప మీ వల్ల ఒరిగిందేమీ లేదని దుయ్యబట్టారు. ఈ కార్యక్రమం లో స్థానిక కాంగ్రెస్ పార్టీ నాయకులు డాక్టర్ సురేష్ , రమణ గౌడ్ కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు

## చండూరు మున్సిపాలిటీలో ఘనంగా మాజీ ప్రధాని స్వర్గీయ రాజీవ్ గాంధీ వర్ధంతి

**చండూరు వెలుతురు మే 21:**

బుధవారం రోజున చండూరు మున్సిపాలిటీలో మండల పార్టీ అధ్యక్షుడు కొరిమి ఓంకారం పట్టణ అధ్యక్షులు అనంత చంద్రశేఖర్ గౌడ్ ఆధ్వర్యంలో భారత మాజీ ప్రధానమంత్రి స్వర్గీయ శ్రీ రాజీవ్ గాంధీ గారి 34వ వర్ధంతి కార్యక్రమం ఘనంగా నిర్వహించారు ఈ సందర్భంగా ఆయన యొక్క సేవలను కొనియాడుతూ భారతదేశ కోసం తన ప్రాణాలనే త్యాగం చేశాడని గుర్తు చేశారు వారిని స్ఫూర్తిగా తీసుకొని ప్రతి ఒక్కరు నిబద్ధతో పని చేయాలని తెలియజేశారు తస్మా జిల్లా అధ్యక్షుడు కోడు శ్రీనివాసులు, మాజీ సర్పంచులు కోడిగిరి బాబు, కావలి ఆంజనేయులు, నల్లగంటి మల్లేశం, బొమ్మరగోని సైదులు,మేకల వెంకట్,RTI కన్వీనర్ మందడి శకర్ రెడ్డి,డైరెక్టర్లు భూతరాజు



ఆంజనేయులు, నర్సింహ మాజీ కౌన్సిలర్ మంచుకొండ సంజయ్ సంకోజు బ్రహ్మం కల్లెట్ల మారయ్య భూతరాజు వేణు బూతురాజు దశరథ బెల్లంకొండ శేకర్ గండూరి జనార్ధన్, బీనపల్లి శేఖర్, పున్నా ధర్మేంద్ర,పన్నాల లింగయ్య,గజ్జల కృష్ణారెడ్డి, ఇరిగి శంకర్,ఇరిగి వెంకటేశం,నల్లక్ కృష్ణయ్య,మహిళా అధ్యక్షురాలు పల్లవి, జంగయ్య ,జావేద్ తదితరులు పాల్గొన్నారు

## మాజీ ప్రధాని భరత రత్న రాజీవ్ గాంధీ 34 వర్ధంతి వేడుకలు



**రామన్నపేట వెలుతురు న్యూస్ మే 21**



మండల కేంద్రంలో మాజీ ప్రధాని భారతరత్న రాజీవ్ గాంధీ 34 వర్ధంతి సందర్భంగా రామన్నపేట పట్టణ కాంగ్రెస్ ఆధ్వర్యంలో ఆయన విగ్రహానికి పూలమాలేసి నివాళు లర్పించినారు. రామన్నపేట ఏరియా హాస్పిటల్ లో రోగులకు పండ్ల పంపిణీ చేసినారు. కార్యక్రమంలో పట్టణ కాంగ్రెస్ అధ్యక్షుడు మొహమ్మద్ జమీరుద్దీన్, కాంగ్రెస్ నాయకులు జింకల ప్రభాకర్, మొహమ్మద్ నాసర్, మాజీ ఎంపిటిసి వనం హర్షిని, చంద్రశేఖర్, మహమ్మద్ రేహాన్, కొత్తపల్లి అబ్రహం, కుమార్ మేడి, శంకరయ్య, బొడ్డు సాలయ్య, మొహమ్మద్ అకరం, కేశవ్, దాస్, వెంకటేశం, వనం నరసింహ, కోట సుధాకర్, పున్న అమరేందర్, గురుకు శివ, బొడ్డు శంకరయ్య, గొలుసుల ప్రసాద్, లెక్కల ప్రవీణ్, అనంత కుమార్, కేశవ, దాసు, ఉదయ్, గోవర్ధన్, లింగస్వామి, నజీర్, మల్లేష్ తదితరులు పాల్గొన్నారు.

## నూతన వధూవరులను ఆశీర్వదించిన మాజీ ఎమ్మెల్యే చిరుమర్తి లింగయ్య



**రామన్నపేట వెలుతురు న్యూస్ మే 21**

మండల టిఆర్ఎస్ పార్టీ సోషల్ మీడియా మండల అధ్యక్షుడు ఆవుల శ్రీధర్ సోదరి వివాహము అమ్మనబోలు గ్రామం సమ్మక్క, సారక్క ఫంక్షన్ హాల్ లో జరగగా అట్టి వివాహమునకు మాజీ ఎమ్మెల్యే చిరుమర్తి లింగయ్య హాజరై నూతన దంపతులను ఆశీర్వదించి శుభాకాంక్షలు తెలియజేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో టిఆర్ఎస్ మండల అధ్యక్షుడు పోషబోయిన మల్లేశం, మాజీ మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ కంభంపాటి శ్రీనివాస్, మాజీ రైతు సమన్వయ సమితి మండల అధ్యక్షుడు బొక్క మాధవరెడ్డి, జిల్లా నాయకులు కన్నెబోయిన బలరాం, నాయకులు ఆవుల నరేందర్, బొల్లం సతీష్, జెట్టి శివప్రసాద్, చిన్నపాక రమేష్, వల్లమళ్ల సూర్యప్రకాష్, నల్ల సైదులు, మేడి రాజు, నోముల తరుణ్, కొండగడప చింటూ, సింగన పోయిన దశరథ, కర్రె శీను, రాంబాబు తదితరులు పాల్గొనడం జరిగింది.

## ఏ ఒక్క ఉద్యోగిని తొలగించం: డోలా హామీ

**అమరావతి,మే21( వెలుతురు):**

గ్రామ, వార్డు సచివాలయాల నుంచి ఏ ఒక్క ఉద్యోగినీ తొలగించబోమని మంత్రి డోలా బాలవీరాంజనేయస్వామి స్పష్టం చేశారు. ఉద్యోగుల సీనియారిటీతో పదోన్నతులకు ఓ ప్రత్యేక ఛానల్, గ్రామ, వార్డు సచివాలయాల కోసం జిల్లాల్లో మూడంచెల వ్యవస్థ ఏర్పాటు చేస్తామని మంత్రి బాలవీరాంజనేయస్వామి తెలిపారు.రేషనలైజేషన్‌పై గ్రామ, వార్డు సచివాలయ ఉద్యోగులకు ఆందోళన అవసరం లేదన్నారు. పని విభజనను శాస్త్రీయంగా చేయాలన్నదే ప్రభుత్వ ఉద్దేశమని పేర్కొన్నారు. 'కేటగిరి 'ఏ'లో పంచాయితీ కార్యదర్శి, డిజిటల్ అసిస్టెంట్ ఉంటారు. మహిళా పోలీసులను మరో కేటగిరీలో చేర్చాలని నిర్ణయించాం. ఒక్కో సచివాలయానికి 7 నుంచి 8 పోస్టులు ఉండేలా రేషనలైజేషన్ చేస్తాం. గ్రామ, వార్డు సచివాలయాల్లో ప్రస్తుతం ఎలాంటి బదిలీలు ఉండవు. జిల్లా, మండల స్థాయిలో అధికారి సచివాలయాలపై పర్యవేక్షణ చేస్తారు. పనిభారం తగ్గించే విధంగా రేషనలైజేషన్ ఉంటుంది.

# ఉగ్రవాద నిర్మూలనే మోదీ సర్కార్ లక్ష్యం

- ఉగ్రవాదం ఏ రూపంలో ఉన్నా అంతమొందించాల్సిందే
- పెహల్గాం ఘటన తరువాత దేశ ప్రజల్లో చాలా మార్పు వచ్చింది
- ఉగ్రవాద నిర్మూలనకు యుద్ధంలో పాల్గొనేందుకు ప్రజలు సిద్ధమయ్యారు
- ఉగ్రవాద శిబిరాల ధ్వంసంతో దేశ సైనిక సత్తా ప్రపంచానికి తెలిసింది
- కేంద్ర హెూంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ వ్యాఖ్యలు
- యాంటీ టెర్రరిజం డే ర్యాలీని ప్రారంభించిన కేంద్ర మంత్రి












**కరీంనగర్ వెలుతురు మే 21:**
ఉగ్రవాదాన్ని సమూలంగా నిర్మూలించడమే నరేంద్రమోదీ నాయకత్వంలోని కేంద్ర ప్రభుత్వం లక్ష్యంగా పనిచేస్తోందని కేంద్ర హెూంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ తెలిపారు. పెహల్గాం ఘటన తరువాత దేశ ప్రజల్లో చాలా మార్పు వచ్చిందన్నారు. ఉగ్రవాద నిర్మూలన కోసం జరిగే యుద్ధంలో అవసరమైతే సామాన్య ప్రజలు కూడా పాల్గొనేందుకు సిద్ధమయ్యారన్నారు. పాకిస్తాన్ భూభాగంలోకి వెళ్లి అక్కడి ప్రజల ప్రాణాలకు ఇబ్బంది లేకుండా ఉగ్రవాద శిబిరాలను ద్వంసం చేయడంతోపాటు ఉగ్రవాదులను మట్టుబెట్టిన ఘనత భారత సైన్యాని దేనన్నారు. 'ఉగ్రవాద వ్యతిరేక దినం' సందర్భంగా కరీంనగర్ జిల్లా క్రికెట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో కరీంనగర్ ర్యాలీ నిర్వహించారు. కేంద్ర మంత్రి బండి సంజయ్ ఈ సందర్భంగా జెండా ఊపి ర్యాలీని ప్రారంభించి మాట్లాడారు. ఈ సందర్భంగా కేంద్ర మంత్రి ఏమన్నారంటే..... ప్రపంచంలో టెర్రరిజాన్ని అణిచివేసే శక్తి సామర్థ్యాలు భారత్ కు ఉన్నాయనే విషయాన్ని ప్రపంచమంతా గుర్తించింది. పెహల్గాం ఘటన అనంతరం భారత సైన్యం టెర్రరిస్టుల స్థావరాలను గుర్తించి ధ్వంసం చేయడంతోపాటు ఉగ్రవాదులను మట్టుబెట్టిన మన సైన్యం ధైర్య సాహసాలను చూశాం. పాకిస్తాన్ టెర్రరిస్టులకు అడ్డాగా మారింది. టెర్రరిస్టులను ప్రోత్సహిస్తూ ఆ దేశం ఆర్థిక సాయం చేస్తోంది. నరేంద్రమోదీ ప్రభుత్వం ఈ విషయాన్ని గుర్తించి ఆ దేశంలోని ఉగ్రవాద శిబిరాలను ధ్వంసం చేయడం జరిగింది. ముంబయి పేలుళ్లు, లుంబినీ పార్క్, గోకుల్ ఛాట్ పేలుళ్లు, మక్కా మసీదు పేలుళ్ల తరువాత దేశ ప్రజల్లో మార్పులు వచ్చాయి. అవసరమైతే దేశం పక్షాన టెర్రరిజంపై యుద్ధం చేసేందుకు సిద్ధంగా ఉండటం సంతోషకరం. పాకిస్తాన్ భారత సరిహద్దు ప్రాంతాల్లో సామాన్య ప్రజలను, వారి ఆవాసాలను టార్గెట్ చేసి ధ్వంసం చేయాలనుకుంది. టెక్నాలజీని ఉపయోగించుకుని వాటిని తిప్పికొట్టిన ఘనత మన సైన్యానిదే. మోదీ నాయకత్వంలో అమిత్ షా సారధ్యంలో టెర్రరిజం ఏ రూపంలో అంతం చేసేందుకు చర్యలు తీసుకుంటోంది. సామాన్య ప్రజలు, స్వచ్ఛంద సంస్థలు, రాష్ట్ర ప్రభుత్వాలు దేశ సైన్యానికి మద్దతుగా నిలవడం దేశ భక్తికి నిదర్శనం. చిన్నా పెద్దా ముసలి ముతక తేడా లేకుండా టెర్రరిజం అంతం కోసం ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలి. ఉగ్రవాదం ఏ రూపంలో ఉన్నా మట్టుపెట్టాల్సిందే. ఇందులో మరో ఆలోచనే లేదు. యాంటీ టెర్రరిజం డే సందర్భంగా జిల్లా క్రికెట్ సంఘం వాళ్లు ముందుకొచ్చి ర్యాలీ నిర్వహించడం సంతోషంగా ఉంది.

# హిందువుగా పుట్టిన ప్రతి ఒక్కరు హిందూ ఏక్తా యాత్రలో పాల్గొనాలి

- **ఈ యాత్ర పహల్గాం మృతులకు అంకితం కాబోతుంది.**
- **వేలాదిగా కాకుండా హిందూ ఐక్యతను చాటేందుకు లక్షలాదిగా తరలిరావాలి.**
- **ఈ యాత్ర విజయవంతంతో అర్బన్ నక్సల్స్ కు గుణపాఠం చెప్పాలి.**



**కరీంనగర్ వెలుతురు మే 21:**
ప్రతి గడప గడప నుండి యాత్రకు హిందువులు తరలివచ్చి సైనికులకు సంఘీభావం తెలపాలి. బీజేపీ సీనియర్ నాయకులు, న్యాయవాది బేతి మహేందర్ రెడ్డి పిలుపు. ప్రతి ఏడాది కరినగర్ నడిబొడ్డున నిర్వహిస్తున్న హిందూ ఏక్తా యాత్ర ఈసారి మరో శకానికి నాంది పలికేలా ఉండాలంటే హిందువుగా పుట్టిన ప్రతి ఒక్కరు గడప గడప నుండి లక్షలాదిగా తరలివచ్చి ఈ హిందూ ఏక్తా యాత్రను విజయవంతం చేసి "పహల్గాం మృతులకు అంకితం" చేసే విధంగా ఉండాలంటే ప్రతి హిందువు స్వచ్ఛందంగా ఈ హిందూ ఏక్తా యాత్రకు తరలిరావాలని న్యాయవాది, బీజేపీ సీనియర్ నాయకులు బేతి మహేందర్ రెడ్డి ఒక ప్రకటనలో పిలుపునిచ్చారు. కేంద్ర హెూంశాఖ సహాయమంత్రివర్యులు బండి సంజయ్ కుమార్ నేతృత్వంలో నిర్వహించే ఈ హిందూ ఏక్తా యాత్ర తేదీ 22 మే 2025 గురువారం రోజున సాయంత్రం 4:00 గంటలకు కరినగర్ లోని వైశ్యభవన్ నుండి ప్రారంభమవుతుందని, ఈ యాత్రకు ముఖ్య అతిథిగా సామాజిక సమరసత వేదిక తెలంగాణ ప్రాంత సంఘటన మంత్రి, అఖిల భారత సాంస్కృతిక కళా ప్రముఖ్ శ్రీ అప్పాల ప్రసాద్ జీ పాల్గొంటున్నారని, ఈ యాత్ర వైశ్యభవన్ నుండి ప్రారంభమై రాజీవ్ చౌక్, టవర్ సర్కిల్, గంజ్, కమాన్, వన్ టౌన్ పోలీస్ స్టేషన్, బస్టాండ్, సిపి ఆఫీస్, కలెక్టర్ క్యాంపు ఆఫీస్, మదీన కాంప్లెక్స్ నుండి తిరిగి మళ్లీ వైశ్యభవన్ కు చేరుకుంటుందని బేతి మహేందర్ రెడ్డి తెలిపారు. ఈ హిందూ ఏక్తా యాత్రకు వేలాదిగా కాకుండా లక్షలాదిగా హిందూ బంధువులు తరలిరావాలని, ఈ యాత్ర విజయవంతంతో దేశంలో ఉంటూ, దేశానికి వ్యతిరేకంగా, హైందవ ధర్మానికి వ్యతిరేకంగా, హిందువులకు వ్యతిరేకంగా మాట్లాడుతూ పాకిస్తాన్ లాంటి ఉగ్రవాద దేశాలకు వంతపాడుతున్న అర్బన్ నక్సల్స్ అనే దేశద్రోహులకు గుణపాఠం చెప్పే విధంగా ఈ యాత్ర కొనసాగాలంటే ప్రతి హిందువు ప్రతి గడప గడప నుండి తరలిరావాలని బేతి మహేందర్ రెడ్డి కోరారు. ముఖ్యంగా ఈ యాత్ర పహల్గాం మృతులకు అంకితం చేసేలా, భారత త్రివిధ దళాలకు సంఘీభావం తెలిపేలా ఉండబోతోందని, వారిని స్ఫూర్తిగా తీసుకొని హిందువుగా పుట్టిన ప్రతి ఒక్కరు పార్టీలకు అతీతంగా ఈ యాత్రలో తప్పకుండా పాల్గొని యాత్రను విజయవంతం చేసే విధంగా పెద్ద ఎత్తున తరలిరావాలని బీజేపీ సీనియర్ నాయకులు, న్యాయవాది బేతి మహేందర్ రెడ్డి కోరుతూ పిలుపునిచ్చారు.

# సమాజంలో ఉన్న పేదలను ఉన్నత స్థాయికి తీసుకువచ్చేందుకు కుల సంఘాలు చేస్తున్న కృషి అభినందనీయం










**ఆదిలాబాద్ వెలుతురు మే 21:**
సమాజంలో ఉన్న పేదలను ఉన్నత స్థాయికి తీసుకువచ్చేందుకు కుల సంఘాలు చేస్తున్న కృషి అభినందనీయమని ఎంపీ గోడం నగేష్ అన్నారు. బుధవారం న్యూ హౌజింగ్ బోర్డుదకాలనీలో రెడ్డి సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో నిర్మించిన రెడ్డి వసతి గృహ సముదాయాన్ని ఎమ్మెల్యే పాయల్ శంకర్ గారి తో కలిసి పూజలు చేసి ప్రారంభించారు. ముందుగా రాజ బహదూర్ వెంకట్రాంరెడ్డి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. తమ సమాజంలోని పేదలను ఆదుకునేల కుల సంఘాలు చేపట్టే కార్యక్రమాలు ఇతర సంఘాలకు ఆదర్శంగా ఉంటాయన్నారు. రెడ్డి సంఘంలోని పేద విద్యార్థుల కోసం వసతి గృహం ఏర్పాటు చేయడం మంచి పరిణమమని అన్నారు. ఐక్యంగా ఉంటు సంఘంతో పాటు సమాజంలోని సభ్యుల అభివృద్ధికి పాటుపడాలన్నారు. వీరితోపాటు నాయకులు రత్నాకర్ రెడ్డి అశోక్ రెడ్డి కరుణాకర్ రెడ్డి. రాకేష్ రెడ్డి తదితరులు ఉన్నారు

## తెలంగాణ రాష్ట్ర ఎస్సీ కమిషన్ సభ్యులు జిల్లా శంకర్

- **సుచరిత వివాహంలో పాల్గొన్న బీసీ నేత జాజుల లింగం గౌడ్**



**నల్లగొండ వెలుతురు మే 21:**
నల్గొండ జిల్లా మర్రిగూడ బైపాస్ రోడ్డు లోని ఎమ్మెన్నార్ కన్వెన్షన్ లో జరిగిన తెలంగాణ ఎస్సీ కమిషన్ సభ్యులు జిల్లా శంకర్ సుచరిత దంపతుల వివాహానికి హాజరై నూతన దంపతులను ఆశీర్వదించి నట్లు బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర కార్యదర్శి జాజుల లింగం గౌడ్ తెలిపారు టిఆర్ఎస్వి రాష్ట్ర నాయకులు రవికిరణ్ హంస అధ్యక్షుడు నామ సైదులు ఉన్నారు.

## రిసెప్షన్ వెడుకలో పలువురు సమాజీక నాయకులు,రాజకీయ,మరియు,డాక్టర్ లకు ఆహ్వానం





**జహీరాబాద్ వెలుతురు మే 21:**
జహీరాబాద్ పట్టణంలో తెలంగాణ రాష్ట్ర ఇంన్చర్జ్ జనం రిపోర్టర్ మహమ్మద్ ఇమ్రాన్ సోదరుని వివహ వేడుకలు భాగంగ జహీరాబాద్ పార్లమెంట్ మెంబర్ సురేష్ శేట్కర్,సిద్దిపేట్ శాసనసభ్యులు మరియు మాజీ మంత్రివర్యులు హరిష్ రావు,మరియు శాసనసభ్యులు మాణిక్ రావు,జహీరాబాద్ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జి అగ్గం చంద్రశేఖర్,తెలంగాణ రాష్ట్ర సెట్విన్ చైర్మెన్ గిరిధర్ రెడ్డి,బిజెపి నాయకులు గోల్ల బస్కర్,మాజీ ఎ.సి కార్పొరేట్ చైర్మెన్ వై.నరోతం,ఉజ్వల్ రెడ్డి,తట్టు నారాయణ, నామరవికిరణ్,హూగెల్లి రాములు,పెద్దగోల్ల నారయణ,బేడబుడగజంగం యువ నాయకులు మాదినం శివప్రసాద్, మారుతీరావు,అల్లం ట్రేడరస్ మహమ్మద్ మకదుమ్,ఇమ్రాన్ సజ్జపూర్,మహ్మద్ ఫాయిమ్, తదితరులకు ఈ నెల బుదవారం 28/05/2025 నాడు సాయంత్రం 7:00గం లకు కోహిర్ భారత్ ఫంక్షన్లలో రిసెప్షన్ లో పాల్గోని వదువు-వర్యులని ఆశీర్వదించాలని కోరుకుంటున్నాము..

## సీఎం సహాయ నిధి చెక్కుల పంపిణీ



**చండూరు వెలుతురు మే 21:**
బుధవారం రోజున గౌరవ శాసనసభ్యులు మునుగోడు ఎమ్మెల్యే శ్రీ కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి గారి సహకారంతో మున్సిపాలిటీ అధ్యక్షులు అనంత చంద్ర శేఖర్ గౌడ్ ఆధ్వర్యంలో ముఖ్యమంత్రి సహాయనిధి నుండి 5 మంది లబ్దిదారులకు 89,000 వచ్చిన చెక్కులను బుధవారం రోజున లబ్దిరులకు గెస్ట్ హౌస్ దగ్గర అందించడం జరిగింది.

లబ్దిదారుల వివరాలు
01. ధనలక్ష్మి చండూరు 31,000
02. చిలుకూరు శ్రీనివాసులు 58,000

చెక్కుల పంపిణీ కార్యక్రమంలో ట్రస్మ అధ్యక్షులు కోడి శ్రీనివాసులు ,మాజీ సర్పంచ్లు కోడి గిరిబాబు, నల్లగంటి మల్లేష్, కాంగ్రెస్ పార్టీ నాయకులు మంచుకొండ సంజయ్ , సంకోజు బ్రాహ్మం,భూతరాజు వేణు, గండూరి జనార్ధన్, బీనపల్లీ శేఖర్,పున్న దర్మేందర్ , కల్లెట్ల మారయ్య,గజ్జెల కృష్ణారెడ్డి , గుంటి శ్రీను, జనార్ధన్,జూలూరు వెంకటేశం,తదితరులు పాల్గొన్నారు.

## నూతన వధూవరులను ఆశీర్వదించిన కేజీ కేఎస్ రాష్ట్ర అధ్యక్షులు ఎంవీ రమణ, గోపా డివిజన్ అధ్యక్షులు సమ్మిగౌడ్ చిలువేరు





**మానుకోట జిల్లా వెలుతురు మే 21:**
సిపిఎం పార్టీ మానుకోట జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు కందునూరి శ్రీనివాస్-సుజాత గౌడ్ ల కుమార్తె అనుజ్ఞ వివాహం పెళ్లి కుమారుడు ప్రతీష్ కుమార్ తో బుధవారం గార్ల లోని కృష్ణ తార ఫంక్షన్ హాల్ లో జరగగా ఈ వివాహ మహెూత్సవ వేడుకకు కేజీ కేఎస్ రాష్ట్ర అధ్యక్షులు ఎం వి. రమణ,గోపా డివిజన్ అధ్యక్షులు చిలువేరు సమ్మయ్య గౌడ్ లు హాజరై నూతన వధూవరులను వారి దాంపత్య జీవితం నిండు నూరేళ్లు చల్లగా ఉండాలని ఆ దేవుడి ఆశీస్సులు వారిపై మెండుగా ఉండాలని వధూవరులతోపాటు వారి కుటుంబ సభ్యులందరికీ పట్టు వస్త్రాలు బహుకరించి అక్షంతలు వేసి ఆశీర్వదించారు. ఈ కార్యక్రమంలో వీరితోపాటు కల్లుగీత కార్మిక సంఘం మహబూబాబాద్ జిల్లా అధ్యక్ష కార్యదర్శులు యమగాని వెంకన్న,గౌని వెంకన్న,సిపిఎం జిల్లా నాయకులు ఆకుల రాజు,సమ్మెట రాజమౌళి,కుంట ఉపేందర్,దుద్దెల రామ్మూర్తి,ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షులు గంధసిరి జ్యోతి బాసు కొండేటి కళాధర్ తదితరులు పాల్గొన్నారు..

https://epaper.velthuru.com

హైదరాబాద్ వెలుతురు

# తెలంగాణ సర్పంచుల ఆవేదన, ప్రజాస్వామ్య మూలాలపై గొడ్డలి పెట్టు...

## తెలంగాణ సర్పంచ్ల సంఘం జాయింట్ యాక్షన్ కమిటీ రాష్ట్ర అధ్యక్షుడు సుర్వి యాదయ్య గౌడ్

**హైదరాబాద్ వెలుతురు మే 21:**

తెలంగాణలో గ్రామ సర్పంచులు ఎదుర్కొంటున్న సంక్షోభం కేవలం ఆర్థికపరమైన సమస్య కాదు,అది ప్రజాస్వామ్య వికేంద్రీకరణ, స్థానిక స్వయం పాలన అనే భావనలకు తగిలిన తీవ్రమైన దెబ్బ. గ్రామాల్లో అభివృద్ధి పనులు చేసినందుకు వారికి చెల్లించాల్సిన పెండింగ్ బిల్లులు విడుదల చేయకపోవడం,స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహించకపోవడం వంటి ప్రభుత్వ నిర్లక్ష్యం,వారిని అప్పుల ఊబిలోకి నెట్టడమే కాకుండా, కొందరి ప్రాణాలను బలిగొంటోంది.తెలంగాణ సర్పంచుల సంఘం జాయింట్ కమిటీ రాష్ట్ర అధ్యక్షుడు సుర్వి యాదయ్య గౌడ్ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కి చేసిన విజ్ఞప్తి ఈ వ్యవస్థాగత వైఫల్యాన్ని ఎత్తిచూపుతోంది.




### అప్పుల కుంపటిలో సర్పంచులు: ప్రభుత్వ నిర్లక్ష్యం, ప్రజాస్వామ్య విఘాతం

గ్రామ పంచాయతీల అభివృద్ధి కోసం సర్పంచులు అహర్నిశలు కృషి చేశారు. స్వచ్ఛ భారత్ మిషన్, హరితహారం,పల్లె ప్రగతి వంటి పథకాల అమలులో వారు కీలక పాత్ర పోషించారు. మరుగుదొడ్ల నిర్మాణం నుండి పల్లె ప్రకృతి వనాల ఏర్పాటు వరకు, స్మశాన వాటికల నుండి డంపింగ్ యార్డుల వరకు, వీధి దీపాల నుండి ట్రాక్టర్ల కొనుగోలు వరకు... ప్రతి పనిలోనూ సర్పంచుల భాగస్వామ్యం ఉంది. అయితే, ఈ పనులకు సంబంధించిన బిల్లులు ప్రభుత్వం నుండి సకాలంలో విడుదల కాకపోవడంతో, సర్పంచులు తమ సొంత డబ్బులు వెచ్చించడమే కాకుండా, అధిక వడ్డీలకు అప్పులు చేసి పనులు పూర్తి చేశారు. ఇది ఏ మాత్రం ఆమోదయోగ్యం కాని పరిస్థితి. అభివృద్ధి పనులకు నిధులు కేటాయించడం ప్రభుత్వ బాధ్యత. ఆ బాధ్యతను విస్మరించి, స్థానిక ప్రజాప్రతినిధులను అప్పుల పాలు చేయడం ఏ రకంగా చూసినా ప్రజా వ్యతిరేక చర్యే.
ఇది కేవలం ఆర్థిక సమస్య కాదు, ఒక వ్యవస్థాగత లోపం. రాష్ట్ర ప్రభుత్వం స్థానిక సంస్థలను, వాటి ప్రజాప్రతినిధులను గౌరవించకపోవడానికి ఇది ప్రబల నిదర్శనం. కేంద్రం నుండి వచ్చే నిధులను కూడా సకాలంలో విడుదల చేయకపోవడం, రాష్ట్ర వాటాను ఇవ్వకపోవడం వంటి ఆరోపణలు ఉన్నాయి. ఇది ప్రజాస్వామ్య వికేంద్రీకరణ స్ఫూర్తికి విరుద్ధం. గ్రామాలను బలోపేతం చేయాలి అని నినాదాలు ఇస్తూనే, గ్రామ స్థాయిలో అభివృద్ధి పనులు చేసిన వారికి డబ్బులు చెల్లించకపోవడం ద్వారా, సర్పంచులపై అనవసరమైన భారాన్ని మోపడం, వారిని అప్పుల ఊబిలోకి నెట్టడం విమర్శనీయం.

### ఆత్మహత్యలు, కుటుంబాల విచ్ఛిన్న,అమానవీయ పోకడలు

చెల్లించని బిల్లుల కారణంగా వడ్డీల భారం, అప్పుల వారి వేధింపులు తట్టుకోలేక అనేకమంది సర్పంచులు ఆత్మహత్యలకు పాల్పడ్డారని, మరికొందరు మరణించారని సర్పంచుల సంఘం చెబుతోంది. ఇది కేవలం గణాంకాలు కాదు, విచ్ఛిన్నమైన కుటుంబాలు, పగిలిన కలలు, తీర్చలేని కన్నీళ్లు. ఒక ప్రజాప్రతినిధి, తన గ్రామాభివృద్ధి కోసం కష్టపడి, చివరకు అప్పుల పాలై ప్రాణాలు తీసుకోవాల్సిన దుస్థితి ఏ ప్రభుత్వానికి అయినా సిగ్గుచేటు. ఇది ప్రభుత్వ అమానవీయ పోకడలకు పరాకాష్ట. సర్పంచులు తీసుకున్న నిర్ణయాలకు, వారు పడ్డ కష్టానికి ప్రభుత్వం బాధ్యత వహించాలి. వారి కుటుంబాలకు జరిగిన అన్యాయానికి సమాధానం చెప్పాలి. ఈ మరణాలకు కారణమైన వారిపై తగిన చర్యలు తీసుకోవాలి.
కొంతమంది సర్పంచులు స్వార్థ ప్రయోజనాల కోసం అప్పులు చేశారని కొందరు వాదించవచ్చు. కానీ, ఒక వ్యవస్థాగత లోపం లేకపోతే, ఇంతమంది సర్పంచులు సామూహికంగా అప్పుల పాలై ఆత్మహత్యలకు పాల్పడే పరిస్థితి రాదు. ఇది వ్యక్తిగత సమస్య కాదు, ప్రభుత్వ నిర్లక్ష్యం వల్ల ఏర్పడిన సామూహిక విపత్తు.

### స్థానిక సంస్థల ఎన్నికల వాయిదా - ప్రజాస్వామ్యానికి మరణశయ్య

పెండింగ్ బిల్లుల చెల్లింపుతో పాటు, స్థానిక సంస్థల ఎన్నికలను వెంటనే నిర్వహించాలని సర్పంచులు ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తున్నారు. ఎన్నికలు జరగకపోవడం వలన పంచాయతీల పరిపాలనలో స్తబ్దత ఏర్పడిందని, అభివృద్ధి పనులు కుంటుపడుతున్నాయని వారు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఎన్నికలు నిర్వహించకపోవడం ప్రజాస్వామ్యానికి తూట్లు పొడవడమే. ప్రజాస్వామ్య వ్యవస్థలో, స్థానిక సంస్థలు ప్రజలకు అత్యంత దగ్గరగా ఉంటాయి. వాటిని సకాలంలో పునరుద్ధరించకపోవడం ద్వారా, ప్రజల భాగస్వామ్యాన్ని నిరాకరించడం, వారి సమస్యలకు పరిష్కారం చూపకపోవడం జరుగుతుంది.
ప్రభుత్వం ప్రజాస్వామ్యబద్ధంగా ఎన్నికైన ప్రజాప్రతినిధుల పట్ల ఈ నిర్లక్ష్య వైఖరిని ప్రదర్శించడం, భవిష్యత్తులో స్థానిక రాజకీయాలపై తీవ్ర ప్రతికూల ప్రభావాన్ని చూపుతుంది. సర్పంచుల సమస్యలను పరిష్కరించకుండా, ఎన్నికలను వాయిదా వేయడం ద్వారా, ప్రభుత్వం తన చేతులకు రక్తాన్ని అంటించుకుంటుందని చెప్పక తప్పదు.



### ప్రభుత్వంపై నైతిక బాధ్యత

తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలోని ప్రభుత్వం సర్పంచుల సమస్యలను తక్షణమే పరిష్కరించాలి. ఇది కేవలం ఆర్థిక సాయం అందించడం కాదు, వ్యవస్థాగత సంస్కరణలు చేపట్టడం ద్వారా భవిష్యత్తులో ఇటువంటి పరిస్థితి పునరావృతం కాకుండా చూడాలి. పెండింగ్ బిల్లులను వెంటనే చెల్లించడం, స్థానిక సంస్థల ఎన్నికలను సకాలంలో నిర్వహించడం, సర్పంచుల కుటుంబాలకు తగిన సహాయాన్ని అందించడం ప్రభుత్వ నైతిక బాధ్యత. గ్రామ స్వరాజ్యం, ప్రజాస్వామ్య వికేంద్రీకరణ అనే ఆశయాలు కేవలం ఎన్నికల నినాదాలుగానే మిగిలిపోకూడదు. వాటిని ఆచరణలో చూపాలి. సర్పంచుల ఆవేదనను ఆలకించి, వారికి న్యాయం చేయకపోతే, తెలంగాణలో గ్రామ స్థాయి ప్రజాస్వామ్యానికి పునాదులు బలహీనపడతాయి. ఇది కేవలం సర్పంచుల సమస్య కాదు, ప్రజాస్వామ్య తెలంగాణ భవిష్యత్తుకు సంబంధించిన అత్యంత కీలకమైన అంశం. ఈ సంక్షోభంపై ప్రభుత్వం ఎలా స్పందిస్తుంది అనేది దాని నిజమైన ప్రజాస్వామ్య నిబద్ధతను తెలియజేస్తుంది.

## ఓ ప్రభుత్వమా మాపై కక్ష సాధింపు చర్య మానేయండి, బిల్లులు చెల్లించండి

*తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి గారికి తెలంగాణ సర్పంచ్ ల సంఘం జాయింట్ కమిటీ రాష్ట్ర అధ్యక్షుడు సుర్వి యాదయ్య గౌడ్ విజ్ఞప్తి*



**హైదరాబాద్ వెలుతురు మే 21:**

గ్రామాలలో అభివృద్ధి పనులు చేసిన సర్పంచ్ లు పెండింగ్ బిల్లులు చెల్లించి స్థానిక సంస్థ ఎన్నికలు నిర్వహించాలని ప్రభుత్వాన్ని కోరుతున్నాం ఇప్పటికే అనేకమంది సర్పంచులు అప్పులు చేసి వడ్డీలకు డబ్బులు ఇచ్చిన డబ్బులు చెల్లించినందుకు వారితో వేధింపులు భరించలేక అనేకమంది సర్పంచులు సూసైడ్ చేసుకున్నారు కొంతమంది సర్పంచులు మరణించడం జరిగింది ఇంకా సర్పంచుల కుటుంబాలు అప్పుల బాధతో చిన్న బిన్నమవుతున్నవి కావున సర్పంచుల పెండింగ్ బిల్లులు చెల్లించి స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహించాలని ప్రభుత్వాన్ని గౌరవ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి గారిని కోరుచున్నాను ఈ కార్యక్రమంలో ఉపాధ్యక్షులు గుంటి మధుసూదన్ రెడ్డి ప్రధాన కార్యదర్శి రాంపాక నాగయ్య కార్యదర్శి కేశ బోయిన మల్లయ్య మెడబోయిన గణేష్ పద్మా రెడ్డి బీరప్ప రవి పాల్గొన్నారు.



నిమ్మల నాగార్జున లావణ్య గారు 15వ వసంతంలోకి అడుగుపెడుతున్న దంపతులకు చిరు సన్మానం చేసిన మాదగోని నరేందర్ గౌడ్. పందుల రాజేష్. మునుగాల శ్రీనివాస్ చారి

**మునుగోడు వెలుతురు మే 21:**

## సామాజిక న్యాయం చేస్తామని మాట ఇచ్చి బీసీలను మోసం చేస్తున్న ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి

- బీసీలను మోసం చేస్తే కాంగ్రెస్ పార్టీకి పుట్ట గతులుండవు
- జాజుల లింగంగౌడ్



**హైదరాబాద్ వెలుతురు మే 21:**

కాంగ్రెస్ ప్రభుత్వం కులగణన చేసి ఎవరి వాటా వారికి ఇస్తామని ఒకవైపు హామీలు గుప్పిస్తూ.. ఇంకొక వైపు వాటిని అమలు చేయకుండా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి బీసీలను మోసం చేస్తునారని బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర కార్యదర్శి జాజుల లింగంగౌడ్ అన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర సమాచార కమిషనర్ పదవుల భర్తీలో బీసీలను పక్కకు పెట్టడం ఇది రెండు కోట్ల మంది బీసీలను అవమానించడమే అవుతుందని ఆయన అన్నారు సమాచార కమిషనర్ లు కావలసిన అన్ని అర్హతలు బీసీలకు ఉన్నప్పటికీ నియమకాల్లో మాత్రం బీసీ కులమే అనర్హతగా మారింది అంటూ ఆయన ఆవేదన వ్యక్తం చేశారు.తక్షణమే రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి జోక్యం చేసుకొని జరిగిన అన్యాయాన్ని సరిదిద్దుకుని బీసీలకు ఖాళీగా ఉన్న మిగతా మూడు సమాచార కమిషనర్ పదవులను బీసీలకు ఇవ్వాలని ఆయన డిమాండ్ చేశారు.ఈ కార్యక్రమంలో తెలంగాణ విద్యార్థి యువజన పరిషత్ రాష్ట్ర అధ్యక్షులు బూర శ్రీనివాస్ గౌడ్ బీసీ విద్యార్థి సంఘం నాయకులు గోదా రవీందర్ పాల్గొన్నారు.

## రైతు సోదరులు పంట పెట్టుబడి పొందే పథకాలను సద్వినియోగం చేసుకోండి

- మహేష్ రెడ్డి మండల వ్యవసాయ అధికారి

**వెలుతురు న్యూస్, అమ్రాబాద్ :**

అమ్రాబాద్ మండలంలోని గ్రామాల రైతులు తమ భూమి కి పట్టా కలిగిన రైతులు పీఎం కిసాన్ పంటకు పెట్టుబడి సహాయం పొ%శీ%దే డబ్బులు, రైతు భరోసా లాంటి ప్రభుత్వ పథకాలను ఎలాంటి ఇబ్బంది లేకుండా ఇప్పుడు అమ్రాబాద్ రైతువేదిక లో అవగాహన కార్యక్రమం ఏర్పాటు చేయడం జరుగుతుందని అమ్రాబాద్ మండల వ్యవసాయ అధికారి ఒక ప్రకటనలో తెలిపారు.అంతే కాకుండా ఈ ఖరీఫ్ సీజన్ లో వ్యవసాయ శాఖ సహాయ సహకారాల గురించి మండల వ్యవసాయ అధికారి మహేష్ రెడ్డి వివరిస్తారు. సిబంది కూడా అందుబాటులో ఉంటారు. వ్యవసాయ భూమి గుర్తింపు సంఖ్య కోసం తప్పనిసరిగా రైతు సోదరులు ఆధార్ కార్డు వెంట తీసుకొని వచ్చి తమ వ్యవసాయ భూమి గుర్తింపు సంఖ్య పొందగలరని ఆయన అన్నారు.

## డివిజన్ లోని పలు ప్రాంతాల్లో దోమల నివారణ కోసం ఫాగింగ్ ని ఏర్పాటు చేసిన కార్పొరేటర్ మహాలక్ష్మి రామన్ గౌడ్

**హైదరాబాద్ వెలుతురు మే 21:**

బుధవారం రోజున హిమాయత్ నగర్ డివిజన్లోని పలు ప్రాంతాల్లో దోమల నివారణ కోసం ఫాగింగ్ ని చేపట్టడం జరిగింది. ఈ కార్యక్రమంలో హిమాయత్ నగర్ డివిజన్ కార్పొరేటర్ మహాలక్ష్మి రామన్ గౌడ్, శానిటేషన్ ఎస్ సి దుర్గ ప్రసాద్ ఏఈ అంబికా సూపర్ వైజర్ అజయ్ బిండియా జైస్వాల్ సుజాత పూర్ణిమ సందీప్ హితేష్ మన్సూర్ కొండహా షనవాజ్ అనూష పాల్గొన్నారు.



## 77 ఏళ్లుగా వెలుబడుతున్న ఏకైక జాతీయ వాద పత్రిక...

# గర్వించదగిన తెలుగు వార పత్రిక "జాగృతి"

- ఒక పత్రిక 10 వేల సైన్యంతో సమానం...
- వాదాల పేరుతో వాస్తవాలు మరుగున పడుతున్నాయి..
- ఆర్ఎస్ఎస్ ప్రాంత కార్యవాహ కాచం రమేష్ జి...

**కరీంనగర్ వెలుతురు మే 21:**



1948 లో ప్రారంభమై 77 ఏళ్ళుగా వెలుబడుతున్న ఏకైక జాతీయవాద పత్రిక, గర్వించదగిన తెలుగు వార పత్రిక జాగృతి అని ఆర్ఎస్ఎస్ తెలంగాణ ప్రాంత కార్యవాహ కాచం రమేష్ జితెలిపారు.రాష్ట్రీయ స్వయంసేవక్ సంఘ్ (ఆర్ఎస్ఎస్ ) శతాబ్ది ఉత్సవాల సందర్భంగా వార పత్రిక జాగృతి పాఠకుల ఆత్మీయ సమ్మేళనము బుధవారం రోజున సాయంత్రం కరీంనగర్ పట్టణంలోని కలెక్టరేట్ ఎదురుగా గల రెవెన్యూ గార్డెన్స్ లో జరిగింది. ఇట్టి ప్రోగ్రాం కు ముఖ్య వక్తగా హాజరైన ఆయన మాట్లాడుతూ తెలుగు పత్రికల చరిత్ర నిస్సందేహంగా ఘనమైందన్నారు. ముఖ్యంగా స్వాతంత్ర ఉద్యమంలో పత్రికలు ప్రముఖపాత్రను పోషించాయన్నారు. ఆ రోజుల్లో ఆంధ్ర పత్రిక, కృష్ణ పత్రిక, ఇండియన్ ఎక్స్ ప్రెస్ , ఆంధ్రప్రభ లాంటి ఎన్నో పత్రికలు ఉండేవని , ఆ తర్వాత ఈనాడు , ఆంధ్రజ్యోతి లాంటి పత్రికలు వచ్చాయన్నారు. నేడు మీడియా రంగం ఎంతో విస్తరించిందన్నారు. డిజిటల్ , సోషల్ మీడియా తో వేగంగా సమాచార వ్యాప్తి జరిగే పరిస్థితులు వచ్చాయన్నారు. ఒక పత్రికపదివేలసైన్యంతోసమానమన్నారు. కానీ నేడు వాదాల పేరుతో వాస్తవాలు మరుగున పడిపోతున్నాయన్నారు. భారతీయత మీద వక్ర భాష్యాల విషపుజల్లులుకురుస్తున్నాయన్నారు. ఏ పత్రిక అయినా సదాశయంతోనే ప్రారంభమవుతుందని, అర్థవంతమైన పేరు , ఆదర్శనీయమైన ప్రయాణం రెండు కన్నులుగా సాగిన పత్రికల జాడ చరిత్ర లో ఒకింత తక్కువేనన్నారు. జాతీయ భావజాలం తో, ధర్మం, రక్షణ కోసం ఈ మట్టి పరిమళంతో వేలుబడుతు , ఎన్నో అటు పోట్లను ఎదుర్కొని 77 ఏళ్లుగా నిలబడిన ఏకైక వార పత్రిక జాగృతి యే నన్నారు. ప్రధానంగా జాతీయతకు సుదూరంగా ఉండే ప్రభుత్వాల ఏలు బడిలో కత్తి సాము చేసిన ఘనత జాగృతి దే న్నారు. జాగృతి ముఖ్యంగా జాతీయ భావాజాలను వ్యాప్తం చేసిందని, ప్రజల అవసరాలను గుర్తించి, ఎన్నో రచనలు చేసి సమాజాన్ని జాగృతం చేసే ప్రయత్నాలు చేసిందన్నారు. గడిచిన ఏడున్నర దశాబ్దాలుగా జాగృతి స్వరాజ్య సమరయోధుల పోరాట ఆశయాన్ని ఆవిష్కరించడానీకే శ్రమిస్తుందన్నారు. ఇలాంటి పత్రికను మరింత ప్రజల్లోకి తీసుకు వెళ్లాల్సిన అవసరం ప్రతి ఒక్కరిపై ఉందన్నారు. రాష్ట్రీయ స్వయంసేవక్ సంఘ్ ప్రజలతో మమేకమవుతూ సమాజం కోసం పలువిధాలపాటుపడుతుందన్నారు.. నేడు దేశంలోని సామాజిక రంగాల్లో ప్రవేశించి, ఒక జాతీయ శక్తిగా సంఘం ఎదిగిందన్నారు. ఇట్టి కార్యక్రమంలో ఆర్ఎస్ఎస్ బాధ్యులు కట్ట రాజగోపాల్, డాక్టర్ చక్రవర్తుల రమణాచారి. దురిశెట్టి నిరంజన చారి , పాక సత్యనారాయణ, ఎలగందుల సత్యనారాయణ, కిషన్ జి, బాలరాజు , తడగోప్పు ల శంకరయ్య, గీకూరి శ్రీనివాస్ , మహేశ్వర్ , పుల్లూరి రామారావు , మురళీజీ , పరుశరాం జి తదితరులు పాల్గొన్నారు.



## హైదరాబాద్‌లో పలు చోట్ల భారీ వర్షం

- ఉరుములు,మెరుపులతో దంచికొట్టిన వాన
- లోతట్టు ప్రాంతాలు జలమయం..ట్రాఫిక్‌కు అంతరాయం
- తెలంగాణ జిల్లాల్లోనూ పలుచోట్ల భారీ వర్షం

**హైదరాబాద్,మే21( వెలుతురు):**

హైదరాబాద్‌లోని పలుచోట్ల వర్షం భారీ వర్షం కురిసింది. మలక్‌పేట, దిల్‌సుఖ్‌నగర్, సరూర్‌నగర్, కొత్తపేట, సికింద్రాబాద్, బోయిన్‌పల్లి, మారేడుపల్లి, తిరుమలగిరి, బేగంపేట, అల్వాల్, సైదాబాద్, సంతోష్‌నగర్, చాదర్‌ఘాట్, జూబ్లీహిల్స్, బంజారాహిల్స్, యూసఫ్‌గూడా, అమీర్‌పేట్, ఎస్సార్‌నగర్, ఎర్రగడ్డలో వర్షం పడుతోంది. దీంతో పలుచోట్ల రహదారులపై నీరు నిలిచింది. వాహనదారులు రాకపోకలకు ఇబ్బందులు పడ్డారు. పలు ప్రాంతాల్లో వర్షం దంచికొట్టింది. చాలాచోట్ల ఉరుములు, మెరుపులతో కూడిన భారీ వర్షం కురుస్తోంది. ఉదయం నుంచి తీవ్రమైన ఎండ ఉండగా వాతావరణం ఒక్కసారిగా మారి భారీ వర్షం పడింది. వర్షం ధాటికి లోతట్టు ప్రాంతాలతో పాటు రహదారులు జలమయమవడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. పాతబస్తీతో పాటు శివారు ప్రాంతాల్లో భారీ వర్షం కురియడంతో పలు ప్రాంతాల్లో ట్రాఫిక్ స్తంభించింది. హైదరాబాద్‌తో పాటు తెలంగాణలోని పలు జిల్లాల్లో కూడా వర్షం పడింది. వర్షం ధాటికి కరెంట్ సరఫరా నిలిచిపోయింది. మ్యాన్‌హోళ్లు పొంగిపోర్లుతుండటంతో జీహెచ్‌ఎంసీ అధికారులు సహాయక చర్యలు చేపట్టారు. తెలంగాణలోని పలు జిల్లాల్లో వర్షం దంచికొట్టింది. ఉమ్మడి వరంగల్, నల్గొండ, కరీంనగర్, ఖమ్మం జిల్లాల్లో భారీ వర్షం పడుతోంది. ఉమ్మడి వరంగల్ జిల్లాలోని మహబూబాబాద్, నెల్లికుదురు, ఇనుగుర్తి, బయ్యారం, డోర్నకల్, మరిపెడ, నర్సంపేట, నర్సింహులపేటలో భారీ వర్షం కురుస్తోంది. తెలంగాణ వ్యాప్తంగా వాతావరణం మేఘావృతమైంది. భారీ వర్షం కురుస్తోండటంతో ఎండల నుంచి ప్రజలు ఉపశమనం పొందుతున్నారు. ఉమ్మడి నల్గొండ జిల్లాలోని నాగార్జునసాగర్, కోదాడ, నల్లబండగూడెం, హుజూర్‌నగర్, చింతలపాలెం, మేళ్లచెరువు మండలాల్లో ఉరుములు, మెరుపులతో కూడిన వర్షం పడుతోంది. సూర్యాపేట జిల్లాలోని నల్లబండగూడెం సమీపంలో ఓ చెట్టు కింద మేకల మందపై పిడుగు పడటంతో 39 మేకలు మృతిచెందాయి.



అయితే మరో ఐదు రోజులు భారీ వర్షసూచన ఉందని హైదరాబాద్ వాతావరణశాఖ అధికారులు తెలిపారు. గురువారం కూడా భారీ వర్షాలు పడే అవకాశం ఉందని వాతావరణశాఖ అధికారులు పేర్కొన్నారు. ప్రజలు జాగ్రత్తగా ఉండాలని అధికారులు సూచించారు. మరోవైపు వరంగల్, సూర్యాపేట జిల్లాల్లో వర్షం కురుస్తోంది. నర్సంపేట, ఖానాపురం మండలాల్లోని కొనుగోలు కేంద్రాల్లో ధాన్యం తడవడంతో రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ద్రోణి, ఉపరితల ఆవర్తనం ప్రభావంతో తెలంగాణలో రానున్న మూడు రోజుల పాటు వర్షాలు కురవనున్నాయి. బుధవారం తూర్పు, దక్షిణ తెలంగాణ జిల్లాల్లో భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని వాతావరణ శాఖ తెలిపింది. ఉమ్మడి ఖమ్మం, నల్గొండ, మహబూబ్‌నగర్‌తో పాటు సంగారెడ్డి, వికారాబాద్ జిల్లాల్లో ఉరుములు, మెరుపులు, ఈదురు గాలులతో కూడిన వడగండ్ల వర్షం కురిసే అవకాశం ఉంది. పలుచోట్లు పిడుగులు పడే అవకాశం ఉంది. హైదరాబాద్, రంగారెడ్డి జిల్లాల్లో తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు పడే అవకాశం ఉంది.

## ప్రచారం కోసం ఇంతగా దిగజారాలా

- అశోక వర్సిటీ ప్రొఫెసర్ అలీఖాన్‌కు చివాట్లు
- బెయిల్ మంజూరు చేసిన సుప్రీం కోర్టు



**న్యూఢిల్లీ,మే21( వెలుతురు):**
హరియాణాలోని అశోక యూనివర్సిటీ ప్రొఫెసర్ అలీఖాన్ మహ్మూదాబాద్‌కు సుప్రీంకోర్టు బెయిల్ మంజూరు చేసింది. ఈసందర్భంగా ఆపరేషన్ సిందూర్‌కు వ్యతిరేకంగా సామాజిక మాధ్యమాల్లో ఆయన పెట్టిన పోస్టును ఉద్దేశిస్తూ న్యాయస్థానం మందలించింది. పబ్లిసిటీ పొందేందుకు ఇలాంటి చర్యలు ఎందుకంటూ ప్రశ్నించింది. తనకు బెయిల్ మంజూరుచేసి విచారణ నిలిపివేయాలని ఇటీవల అలీఖాన్ సుప్రీంకోర్టును ఆశ్రయించారు. దీనిపై తాజాగా జస్టిస్ సూర్యకాంత్, జస్టిస్ ఎన్.కోటేశ్వర్‌సింగ్‌లతో కూడిన ధర్మాసనం విచారణ జరిపింది. ఈసందర్భంగా అలీఖాన్ తరఫున సీనియర్ న్యాయవాది కపిల్ సిబల్ వాదనలు వినిపించారు. తన క్లయింట్ ఆ పోస్టులో నేరపూరిత ఉద్దేశంతో చేసిన వ్యాఖ్యలు ఏమున్నాయ్ అని వాదించారు. ఆయన వాదనపై స్పందిస్తూ జస్టిస్ కాంత్ మాట్లాడారు. ‘అసలు ఏం జరుగుతోందో మీరు తెలుసుకోండి. భావ వ్యక్తీకరణ చేసే హక్కు ఉంటుంది. కానీ, ఆ విషయం గురించి మాట్లాడే సమయంలో బాధ్యతాయుతంగా వ్యవహరించాలి. భారత్‌కు స్వాతంత్ర్యం వచ్చిన నాటినుంచి అందరూ హక్కుల గురించి మాట్లాడుతున్నారు. కానీ, బాధ్యతల గురించి ప్రస్తావించడం లేదు. భావ వ్యక్తీకరణ చేసే హక్కు కచ్చితంగా ఉంటుంది. కానీ, వీటన్నింటి గురించి మాట్లాడే సమయం ఇదేనా..? కొందరు రాక్షసులు వచ్చి భారత్‌పై దాడి చేశారు. ఇప్పుడు మనమంతా ఐక్యంగా ఉండాలి. ఇలాంటి సమయంలో పబ్లిసిటీ పొందేందుకు ప్రయత్నాలు ఎందుకని మందలించారు. కాగా.. ఆపరేషన్ సిందూర్‌కు వ్యతిరేకంగా సామాజిక మాధ్యమాల్లో పోస్టులు పెట్టారన్న కారణంతో హరియాణాలోని అశోక యూనివర్సిటీ ప్రొఫెసర్ అలీఖాన్ మహ్మూదాబాద్‌ను ఇటీవల పోలీసులు అరెస్టు చేసిన సంగతి తెలిసిందే. రాజనీతి శాస్త్ర విభాగంలో అలీఖాన్ అసోసియేట్ ప్రొఫెసర్‌గా పని చేస్తున్నారు. ఆపరేషన్ సిందూర్ గురించి మీడియా సమావేశాల్లో వివరించిన కర్నల్ సోఫియా ఖురేషీ, వింగ్ కమాండర్ వ్యోమికా సింగ్‌లను ఆయన తప్పు పట్టారు. ‘ప్రభుత్వం తరఫున మాట్లాడుతున్న వారు క్షేత్రస్థాయిలో జరిగిన వాస్తవాలను మాత్రమే వివరించాలి. లేకపోతే అది వంచనే అవుతుంది‘ అని పోస్టు పెట్టారు.

## రాజీవ్‌గాంధీకి కాంగ్రెస్ నేతల నివాళి

- ఎన్నో సంస్కరణలు ప్రవేశ పెట్టారన్న ఖర్గే
- తండ్రితో జ్ఞాపకాలను నెమరు వేసుకున్న రాహుల్



**న్యూఢిల్లీ,మే21( వెలుతురు):**
భారత మాజీ ప్రధాని రాజీవ్‌గాంధీ నేడు 34వ వర్ధంతి సందర్భంగా ఆయనకు ఘనంగా నివాళి అర్పించారు. రాజీవ్ తనయుడు, లోక్‌సభ ప్రతిపక్షనేత రాహుల్‌గాంధీతోపాటు, కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు మల్లికార్జునఖర్గేలు ఢిల్లీలోని వీర్ భూమి రాజీవ్ స్మారక స్తూపం వద్ద నివాళులర్పించారు. వీరితోపాటు కాంగ్రెస్ నేత సచిన్ పైలట్, ఇతర కాంగ్రెస్ నేతలు కూడా స్మారక ప్రదేశంలో రాజీవ్‌కి ఘనంగా నివాళులర్పించారు. రాజీవ్ గాంధీ వర్ధంతి సందర్భంగా కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే ఆయనను భారతదేశ ముద్దుబిడ్డ అని అభివర్ణించారు. ఈ సందర్భంగా రాజీవ్‌గాంధీ ప్రధానిగా ఉన్న సమయంలో తీసుకున్న పలు కీలక నిర్ణయాలని ప్రస్తావిస్తూ ఖర్గే ఎక్స్ పోస్టు చేశారు. రాజీవ్‌గాంధీ నేతృత్వంలోనే 18 ఏళ్లకే ఓటు హక్కు కల్పించడం, పంచాయతీరాజ్‌ను బలోపేతం చేయడం వంటి కీలక నిర్ణయాలు తీసుకున్నారు. అలాగే టెలికాం, ఐటి విప్లవానికి నాయకత్వం వహించారు. కంప్యూటరీకరణను అమలు చేశారు. సమ్మిళిత అభ్యాసంపై దృష్టి సారించిన కొత్త విద్యావిధానాన్ని ప్రవేశపెట్టిన ఘనత ఆయనదే. రాజీవ్‌గాంధీ లక్షలాది మంది భారతీయులలో ఆశను ప్రేరేపించారు. 21వ శతాబ్దపు సవాళ్లు, అవకాశాలకు భారతదేశాన్ని సిద్ధం చేయడంలో ఆయన దార్శనికత, సాహసోపేతమైన నిర్ణయాలు కీలకపాత్ర పోషించాయి అని ఖర్గే ఎక్స్ పోస్టులో పేర్కొన్నారు. ఈరాజీవ్ గాంధీ వర్ధంతి సందర్భంగా రాహుల్ తన తండ్రి రాజీవ్‌తో కలిసి దిగిన ఫొటోను సోషల్ మీడియాలో పోస్టు చేశారు. ఈ ఫొటోకు జతగా ’నాన్న మీ జ్ఞాపకాలు నన్ను ప్రతి అడుగులోనూ నడిపిస్తాయి. మీ నెరవేరని కలలను నిజం చేయడమే నా సంకల్పం. నేను వాటిని ఖచ్చితంగా నెరవేరుస్తాను’ అని రాహుల్ ఎక్స్ పోస్టులో పేర్కొన్నారు. ఈరాజీవ్‌గాంధీ 40 ఏళ్ల వయసులోనే ప్రధానమంత్రిగా బాధ్యతలు చేపట్టారు. అక్టోబర్ 1984 నుంచి 1989 డిసెంబర్ 2 వరకు ఆయన ప్రధానిగా ఉన్నారు. తమిళ ఈలం ఆత్మాహుతి దాడిలో ఆయన దుర్మరణం చెందారు.

## తెలంగాణలో ప్రభుత్వాన్ని కూల్చే కుట్ర

- బిజెపి, బిఆర్ఎస్, టిడిపి ఏకమయ్యాయి
- ఎంపి మల్లు రవి సంచలన ఆరోపణలు

**హైదరాబాద్,మే21( వెలుతురు):**
తెలంగాణలో ప్రజా ప్రభుత్వాన్ని కూల్చే కుట్రలు చేస్తున్నారని ఎంపీ మల్లు రవి సంచలన వ్యాఖ్యలు చేశారు. కొందరు పనిగట్టుకుని ఇదే పనిలో ఉన్నారని మండిపడ్డారు. బీజేపీతో కలిసి బీఆర్ఎస్ ప్రజా ప్రభుత్వాన్ని ఇబ్బంది పెట్టే ప్రయత్నం చేస్తోందన్నారు. వచ్చే ఎన్నికల్లో బీజేపీ, బీఆర్ఎస్, టీడీపీ కలిసి తెలంగాణలో పోటీ చేయబోతున్నాయని బాంబు పేల్చారు. ముగ్గురు కలిసి ఎన్ని కుట్రలు చేసినా ప్రజా ప్రభుత్వం మళ్ళీ అధికారంలోకి వస్తుందన్నారు. కెసిఆర్ కు కాళేశ్వరం కమిషన్ ఇచ్చిన నోటీసులకు కాంగ్రెస్ ప్రభుత్వానికి సంబంధం లేదని చెప్పారు. మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ చట్టానికి అతీతులా? ఎంతో మంది మాజీ ముఖ్యమంత్రులు జైలుకి వెళ్ళారు అని అన్నారు. బిహార్ లో లాలు ప్రసాద్ యాదవ్ జైలుకు వెళ్లలేదా? కేసీఆర్, హరీష్, ఈటెల కమిషన్ ముందు హాజరు కావాలన్నారు. నోటీసులు అందకపోవడం మనం ఏమైనా అమెరికాలో ఉన్నామా? విద్యుత్ కమిషన్ విషయంలో కెసిఆర్ తప్పు చేశారు. ఇప్పుడైనా కాళేశ్వరం కమిషన్ కు సహకరించాలని మల్లు రవి సూచించారు.

# మీ అందరి ఆశీర్వాదంతో మంత్రి అయిన అనేక కార్యక్రమాలు చేస్తున్న

**ప్రభుత్వం అధికారంలో ఉన్న ప్రభుత్వం కార్యక్రమాలు కాంగ్రెస్ పార్టీ నేతల ద్వారా ప్రజలకు చేరాలి..**




**హుస్నాబాద్ వెలుతురు మే 21:**
హుస్నాబాద్ పట్టణ కాంగ్రెస్ పార్టీ సంస్థాగత నిర్మాణ సన్నాహక సమావేశంలో పాల్గొన్న మంత్రి పొన్నం ప్రభాకర్ బ్లాక్, వార్డు అధ్యక్షుల దరఖాస్తులు స్వీకరించిన పీసీసీ పరిశీలకులు పవన్ మల్లాది
సమావేశంలో పాల్గొన్న పీసీసీ పరిశీలకులు పవన్ మల్లాది , సిద్దిపేట గ్రంథాలయ సంస్థ చైర్మన్ లింగమూర్తి, ఇతర ముఖ్య నేతలు
మంత్రి పొన్నం ప్రభాకర్ మాట్లాడుతూ పీసీసీ ఆదేశాల మేరకు రాష్ట్ర వ్యాప్తంగా అన్ని జిల్లాలకు పీసీసీ పరిశీలకులు వచ్చారు
బుధవారం రోజున అక్కన్న పేట,కోహెడ, హుస్నాబాద్ మండలాల సన్నాహక సమావేశాలు జరిగాయి
హుస్నాబాద్ పట్టణంలో సంస్థాగత పార్టీ పునఃవ్యవస్థిరణ





చేసుకున్నాం
ప్రభుత్వం అధికారంలో ఉన్న ప్రభుత్వం కార్యక్రమాలు కాంగ్రెస్ పార్టీ నేతల ద్వారా ప్రజలకు చేరాలి..
పట్టణంలో ఆరుగురు పార్టీ కౌన్సిలర్లు ఉండేది..
స్థానిక సంస్థలు మనం గెలవాలి
20 వార్డులకు 20 మంది అధ్యక్షులు ,ఉపాధ్యక్షులు , ప్రధాన కార్యదర్శులు,కార్యవర్గ సభ్యులతో ప్రతివార్డుకు యువజన కాంగ్రెస్,nsui, మహిళా కాంగ్రెస్,ఎస్సీ సెల్, బీసీ సెల్,ఎస్టీ సెల్ అన్ని రకాల అనుబంధ సంఘాల కమిటీ వేసుకొని ముందుకు పోతున్నాం
సన్న బియ్యం,ఇందిరమ్మ ఇళ్లు కొత్త రేషన్ కార్డులు,మహిళలకు ఆర్టిసి బస్సు ప్రయాణం,సన్న వడ్లకు బోనస్,ఇలా ప్రభుత్వ కార్యక్రమాలు ప్రజల్లోకి తీసుకోవాలి
వార్డుల్లో పని చేస్తామనుకునే నాయకులు పవన్ మల్లాది కి అప్లికేషన్ లు ఇవ్వండి
20 డివిజన్ లలో మీరే కూర్చుని ఎవరు అధ్యక్షుడు,ఉపాధ్యక్షుడు అని మీరే ఎక్రగివంగా ఎంపిక చేసుకొని పేర్లు ఇవ్వండి. మీ అందరి ఆశీర్వాదంతో మంత్రి అయిన అనేక కార్యక్రమాలు చేస్తున్న.
మనం చేస్తున్న పనులు ఎమ్మెల్యేగా చేస్తున్న అభివృద్ధి ప్రభుత్వ కార్యక్రమాలు ప్రజల్లోకి తీసుకెళ్లాలి
వచ్చే మున్సిపల్ ఎన్నికల్లో 20 వార్డులకు 20 గెలవాలి
శాసనసభ ఎన్నికల్లో కష్టపడ్డాం గెలిచాం. పార్లమెంట్ ఎన్నికల్లో, ఎమ్మెల్సీ ఎన్నికల్లో మెజారిటీ వచ్చింది
ఆ ఎన్నికల్లో ఎలా కష్టపడ్డారో స్థానిక సంస్థల ఎన్నికల్లో కష్టపడాలి
నేను కూడా నా ఎన్నిక కన్నా ఎక్కువ కష్టపడత
వార్డుల వారిగా ఇందిరమ్మ ఇళ్లు ఇస్తున్నాం మైనార్టీ లకు కుట్టు మిషన్ లు ఇస్తున్నాం
హుస్నాబాద్ ఎల్లమ్మ చెరువు అభివృద్ధి, ఉమ్మాపూర్ వద్ద ఇంజనీరింగ్ కాలేజి ఏర్పాటు చేస్తున్నాం
పట్టణ అభివృద్ధి చేస్తున్నాం వ్యాపారస్తుల సహకారంతో పెండింగ్ లో ఉన్న రోడ్డు పూర్తి చేస్తున్నాం
ప్రతి వార్డుల్లో పార్టీ కార్యక్రమం జరగాలి. కష్టపడ్డ వారే నాయకులుగా మారుతారు..
రాబోయే ఎన్నికల్లో హుస్నాబాద్ లో జరిగే ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ విజయం సాధించాలి.
పట్టణంలో జంక్షన్ ల సుందరీకరణ చేశాం
2 కోట్లతో బస్ స్టేషన్ అభివృద్ధి చేశాం..
మహాసముద్రం గండి టూరిజం ప్రాజెక్ట్ అభివృద్ధి చేస్తున్నాం
హుస్నాబాద్ నుండి రామవరం కు డబుల్ రోడ్డు వస్తుంది
హుస్నాబాద్ టౌన్ నుండి రాజీవ్ రహదారి కి ఫోర్ లైన్ రోడ్డు అవుతుంది
హుస్నాబాద్ లో 150 పడకల ఆసుపత్రికి స్థలం చూసాం
ఈ ప్రాంత రైతాంగానికి గౌరవెల్లి కాలువల తవ్వడానికి భూసేకరణ వేగవంతంగా జరుగుతుంది
హుస్నాబాద్ పక్కన చౌటపల్లి లో పారిశ్రామిక కారిడార్ తీసుకొస్తున్నాం
డిగ్రీ ,ఇంటర్మీడియర్, హైస్కూల్ లలో కంప్యూటర్ ల్యాబ్ ఏర్పాటు చేశాం..
సీఎంఆర్ఎఫ్ , కళ్యాణ లక్ష్మి చెక్కులు మీరే పంచుతున్నారు
ప్రజలు కాంగ్రెస్ కి ఓటు వేయాలని చెప్పాలి
10 ఏళ్లలో బిఆర్ఎస్ పార్టీ పట్టణంలో కేవలం 120 ఇల్లు కట్టింది.. నియోజకవర్గంలో 3500 ఇల్లు సంవత్సరానికి ఇస్తే వాళ్ళు 10 ఏళ్లలో 443 ఇచ్చారు
మనం చేస్తున్న ప్రతి కార్యక్రమం చెప్పాలి..

## నేషనల్ హెరాల్డ్ కేసులో విచారణ

- సోనియా, రాహుల్ 142 కోట్లు లబ్ది పొందారు
- ప్రత్యేక కోర్టులో ఇడి సంచలన ఆరోపణలు




**న్యూఢిల్లీ,మే21( వెలుతురు):**
నేషనల్ హెరాల్డ్‌కు సంబంధించిన మనీలాండరింగ్ కేసులో కాంగ్రెస్ అగ్రనాయకులు సోనియా గాంధీ, రాహుల్ గాంధీలు లబ్ది పొందారని పై ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ సంచలన ఆరోపణలు చేసింది. ఈ నేరంలో వారు రూ.142 కోట్లు లబ్ది పొందారని ఆరోపించింది. నేరపూరిత ఆర్జనతో మనీలాండరింగ్‌కు పాల్పడ్డారని, తర్వాత కూడా వారు అదే పంథాను కొనసాగించారని పేర్కొంది. బుధవారం దిల్లీ ప్రత్యేక కోర్టులో జరిగిన విచారణలో భాగంగా ఈడీ ఈ వాదనను వినిపించింది. ఈ కేసులో ఇప్పటికే ఛార్జిషీట్ దాఖలు చేసిన ఈడీ అందులో కాంగ్రెస్ అగ్రనేతలు సోనియా గాంధీ, రాహుల్ గాంధీ సహా పలువురి పేర్లను పేర్కొంది. దిల్లీ రౌస్ అవెన్యూ కోర్టులో ప్రాసిక్యూషన్ కంప్లయింట్ దాఖలు చేశారు. దీనిపై తాజాగా విచారణ జరిగింది. నేషనల్ హెరాల్డ్ పత్రికకు సంబంధించి మనీ లాండరింగ్ ఆరోపణలతో కాంగ్రెస్ అగ్రనేతలు సోనియా గాంధీ, రాహుల్ గాంధీని ఈడీ అధికారులు గతంలో పలుమార్లు విచారించిన విషయం తెలిసిందే. విదేశీ నిధులతో నేషనల్ హెరాల్డ్ పత్రికను పెంచి పోషించారన్న ఫిర్యాదుల మేరకు ఈడీ, సీబీఐ దర్యాప్తు చేశాయి. సీబీఐ విచారణ మధ్యలోనే నిలిచినప్పటికీ.. ఈడీ దర్యాప్తు మాత్రం కొనసాగుతోంది. ఈ కేసులో 2023, నవంబరులో జప్తు చేసిన అసోసియేటెడ్ జర్నల్స్ లిమిటెడ్ (ఏజేఎల్)కు చెందిన రూ.661 కోట్ల విలువైన ఆస్తుల స్వాధీనానికి చర్యలు ప్రారంభించింది. ఇందులోభాగంగా నోటీసులు జారీ చేసింది. ఆయా ఆస్తుల్లో ఉన్నవారు ఖాళీ చేయాలని పేర్కొంది. అద్దెకు ఉంటున్నవారు ఇకపై తమకే ఆ మొత్తాన్ని చెల్లించాలని తెలిపింది. అక్రమ చెలామణి నిరోధక చట్టంలోని సెక్షన్ (8) నిబంధన 5(1) ప్రకారం జప్తు చేసిన ఆస్తులను స్వాధీనం చేసుకొనే పక్రియ చేస్తున్నామని తెలిపింది. ఆస్తులు ఉన్న ప్రాంతాల్లో (దిల్లీ, ముంబయి, లఖ్‌నవూ) భవనాలకు నోటీసులు అంటించినట్లు వెల్లడించిన సంగతి తెలిసిందే.

**వేసవి సెలవులు కాదు..పిక్షిక పనిదినాలు**

## వేసవి సెలవులపై సుప్రీం చీఫ్ జస్టిస్ గవాయ్ వెల్లడి

**న్యూఢిల్లీ,మే21( వెలుతురు):**
సుప్రీంకోర్టు వేసవి సెలవులను ’పాక్షిక పనిదినాలుగా భారత ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ బి.ఆర్.గవారు బుధవారం నామకరణం చేశారు. మే 23 నుండి జులై వరకు వేసవి సెలవుల కారణంగా సుప్రీంకోర్టు మూసివేయబడుతుంది. అయితే ఈ సెలవులను పాక్షిక పనిదినాలుగా నామకరణం చేస్తున్నట్లు సిజెఐ ప్రకటించారు. కోర్టు సెలవుల మొదటి వారంలో మొదటి ఐదుగురు సీనియర్ జడ్జీలు విచారణ చేపడతారని అన్నారు. సెలవు నెలల్లో మొత్తం 21 బెంచ్‌లు విచారణ చేపడతాయని న్యాయవాదులకు తెలిపారు. అన్నారు. పర్యావరణ సంబంధిత అంశాలపై తన ధర్మాసనం దృష్టి సారిస్తుందని సిజెఐ పేర్కొన్నారు. పెండింగ్ కేసులను తగ్గించేందుకు జడ్జీలు సిద్ధంగా ఉండాలని, సెలవు దినాల్లో అనవసర వాయిదాలు వేయవద్దని, ధర్మాసనానికి సహకరించాలని న్యాయవాదులను ఆయన కోరారు. 2024, ఆగస్ట్ నాటి సమాచారం ప్రకారం.. సుప్రీంకోర్టులో రికార్డు స్థాయిలో 82,887 కేసులు పెండింగ్‌లో ఉన్నాయి. వెకేషన్ బెంచ్‌లంటే వేసవి, శీతాకాలపు సెలవుల్లో సిజెఐ నియమించే ప్రత్యేక బెంచ్‌లు. ఈ బెంచ్‌లు ’అత్యవసర అంశాలను’ విచారించడానికి ముఖ్యంగా సెలవు దినాల్లో బెయిల్, హెబియస్ కార్పస్ మరియు ఇతర ప్రాథమిక హక్కుల సమస్యలకు సంబంధించిన పిటిషన్‌లను విచారించేందుకు ఏర్పాటు చేస్తారు. 2022లో, అప్పటి భారత ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ డి.వై. చంద్రచూడ్ శీతాకాల సెలవుల సమయంలో సుప్రీంకోర్టు సెలవుల బెంచ్‌లు అందుబాటులో ఉండవని అన్నారు. దీంతో కోర్టులను సెలవుల సమయంలో మూసివేయాలా వద్దా అనే చర్చ ప్రారంభమైంది.

## నోరు అదుపులో పెట్టుకుని మాట్లాడు

- సిఎం రేవంత్ పై అనుచిత వ్యాఖ్యలు సహించం
- కెటిఆర్‌ను హెచ్చరించిన విప్ బీర్ల ఐలయ్య



**హైదరాబాద్,మే21( వెలుతురు):**
కేటీఆర్ అధికారం కోల్పోయిన తర్వాత పిచ్చెక్కినట్లుగా ప్రవర్తిస్తున్నాడని ప్రభుత్వ విప్ బీర్ల ఐలయ్య సంచలన వ్యాఖ్యలు చేశారు. ఈ మేరకు కెటిఆర్ జాగ్రత్తగా మాట్లాడాలని ఆయన ధ్వజమెత్తారు. నల్గొండ జిల్లాలో సీఎం రేవంత్ రెడ్డి గురించి అనవసరంగా మాట్లాడటం తగదన్నారు. అంతే కాకుండా కేటీఆర్ తన నోరును అదుపులో పెట్టుకోవాలని ఘాటు వ్యాఖ్యలు చేసారు. సీఎం రేవంత్ రెడ్డి నాయకత్వంలో నల్గొండ ఉమ్మడి జిల్లా మంత్రులు అహర్నిశలు కష్టపడుతూ అభివృద్ధి పనులను కొనసాగిస్తున్నారు. రాష్ట్ర వ్యాప్తంగా తాగు, సాగు నీటి ప్రాజెక్టుల పరంగా ఉత్తమ్ కుమార్ రెడ్డి ముందుండి వాటిని నడిపిస్తున్నారు. మరోవైపు కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి ఢిల్లీ నుంచి నిధులు తీసుకొచ్చి జిల్లాలో రోడ్లు నిర్మిస్తున్నారని తెలిపారు. ఇక కేసీఆర్ నిర్మించిన కాళేశ్వరం ప్రాజెక్ట్ కూలి కులేశ్వరంగా మారిందని ఎద్దేవా చేసారు. ఈసారి కాళేశ్వరం లేకపోయినా రికార్డు స్థాయిలో పంట పండింది. ఇది మీ కళ్ళకి కనిపించడం లేదా? నల్గొండ జిల్లా మా హయాంలో అన్నం పెట్టే జిల్లాగా మారింది. కేసీఆర్ చేసిన అప్పులు, తప్పులను సీఎం రేవంత్ రెడ్డి సరిదిద్దుతున్నారని అన్నారు. స్కాంల చరిత్ర ఆ పార్టీదే అని బీఆర్ఎస్ పార్టీపై తీవ్ర విమర్శలు చేసారు. ఇక వేయి ఎలుకలు తినిన పిల్లి తీర్థయాత్రలకు వెళ్లినట్టుగా కేసీఆర్ ప్రవర్తిస్తున్నాడని.. కేటీఆర్ మా సీఎంపై నోరు జారితే, నోటిని యాసిడ్‌తో కడుగుతాం.. జాగ్రత్తగా ఉండాలని బీర్ల ఐలయ్య హెచ్చరించారు. అభివృద్ధిని, సంక్షేమాన్ని చూసి ఓర్వలేక చిల్లర విమర్శలు చేస్తున్నారని ఆయన వ్యాఖ్యానించారు.

# పెంచిన ఛార్జీల నుంచి 10 శాతం తగ్గింపు




**హైదరాబాద్, మే 21, ( వెలుతురు)**

హైదరాబాద్ మెట్రో రైలు సంస్థ కీలక నిర్ణయం తీసుకుంది. ఇటీవల పెంచిన ఛార్జీలను 10 శాతం మేర తగ్గిస్తున్నట్లు పేర్కొంది. ఈ తగ్గింపు మే 24 నుంచి అమల్లోకి వస్తుందని తెలిపింది.

హైదరాబాద్ మెట్రో ప్రయాణికులకు బిగ్ రిలీఫ్, పెంచిన ఛార్జీల్లో 10 శాతం తగ్గింపుహైదరాబాద్ మెట్రో రైలు యాజమాన్యం...టికెట్ల రేట్ల పెంపుపై మరో కీలక నిర్ణయం తీసుకుంది. ఇటీవల పెంచిన మెట్రో ఛార్జీలను సవరించింది. పెంచిన ఛార్జీలను 10 శాతం తగ్గిస్తున్నట్లు తాజాగా ప్రకటించింది.తగ్గిన మెట్రో ఛార్జీలు మే 24 నుంచి అమల్లోకి వస్తాయని తెలిపింది. ఇటీవల కనీస ఛార్జీలను రూ.10 నుంచి రూ.12లకు, గరిష్ఠ ఛార్జీ రూ.60 నుంచి రూ.75కు పెంచుతున్నట్లు మెట్రో రైల్ సంస్థ ప్రకటించిన విషయం తెలిసిందే.

10 శాతం తగ్గింపు– మెట్రో ప్రయాణికులపై భారాన్ని తగ్గించడమే లక్ష్యంగా ఛార్జీల తగ్గింపు నిర్ణయం తీసుకున్నామని ఎల్ అండ్ టీ మెట్రో ఎండీ ఎన్వీఎస్ రెడ్డి తెలిపారు. మెట్రోలో ప్రయాణిస్తున్న అల్పాదాయ ప్రజలపై భారం పడకూడదని పెంచిన ఛార్జీలపై 10శాతం తగ్గించినట్లు చెప్పారు.హైదరాబాద్ మెట్రో ఇటీవల ఛార్జీలు పెంచింది. పెంచిన ఛార్జీలు మే 17 నుంచి అమల్లోకి వచ్చింది. కనీస టికెట్ ఛార్జీలు రూ.10 నుంచి రూ.12లకు, గరిష్ట ఛార్జీ రూ.60 నుంచి 75కు మెట్రో యాజమాన్యం పెంచింది.కొత్తగా సవరించిన ఛార్జీలపై 10 శాతం డిస్కౌంట్ అందించనున్నట్లు ఎల్ అండ్ టీ మెట్రో రైల్ లిమిటెడ్ తెలియజేసింది. మొత్తం మూడు మెట్రో కారిడార్లలో అన్ని ఛార్జీల్లో మే 24 నుంచి ఈ డిస్కౌంటు అమల్లోకి వస్తుంది. నిలకడగా కార్యకలాపాల నిర్వహణపై దృష్టి పెడుతూ, ప్రయాణికుల అవసరాలను తీర్చడంలో ముందుండటంలో మెట్రో రైలు నిబద్ధతకు ఇది నిదర్శనంగా నిలుస్తుందని మెట్రో రైలు యాజమాన్యం పేర్కొంది. ఫేర్ ఫిక్సేషన్ కమిటీ సిఫార్సుల మేరకు, అలాగే దీర్ఘకాలంలో మెట్రో కార్యకలాపాలను సుస్థిరంగా నిర్వహించేందుకు సమగ్ర వ్యూహంలో భాగంగా ఛార్జీలు సవరించామని మెట్రో అధికారులు పేర్కొన్నారు. దూరదృష్టితో వ్యవహరిస్తూ, ప్రయాణికులకు అందుబాటు స్థాయిలో సేవలు అందించాలన్న నిబద్ధతతో ఈ నిర్ణయం తీసుకున్నట్లు తెలిపారు."బాధ్యతాయుతమైన పట్టణ ప్రాంత ట్రాన్సిట్ ఆపరేటరుగా, హైదరాబాద్ వాసులకు సమర్థవంతమైన, అందుబాటు స్థాయిలో మొబిలిటీ సొల్యూషన్స్‌ను అందించేందుకు మెట్రో రైల్ కట్టుబడి ఉంది. మెట్రో కార్యకలాపాలను నిలకడగా కొనసాగించేందుకు ఛార్జీలను సవరించక తప్పలేదు"– ఎల్ అండ్ టీ మెట్రో రైల్ ఎండీ, సీఈవో కేవీబీ రెడ్డిఅయినప్పటికీ ప్రయాణికులపై ఆర్థిక భారం పడనివ్వకుండా చూసేందుకు అత్యంత ప్రాధాన్యతనిస్తాం. ఇందులో భాగంగానే, ప్రయాణికుల ఫీడ్‌బ్యాక్ తో కొత్తగా సవరించిన ఛార్జీలపై 10 శాతం డిస్కౌంటు ఇవ్వాలనే నిర్ణయం తీసుకున్నాం. అందుబాటు ఛార్జీల్లో రోజువారీ ప్రయాణాలకు వీలు కల్పించాలన్న మా చిత్తశుద్ధికి ఇది నిదర్శనంగా నిలుస్తుంది" – ఎల్ అండ్ టీ మెట్రో రైల్ ఎండీ, సీఈవో కేవీబీ రెడ్డి మూడు కారిడార్లలో "2025 మే 24 నుంచి మొత్తం మూడు మెట్రో కారిడార్లలోని అన్ని ఛార్జీల జోన్ల వ్యాప్తంగా ఈ డిస్కౌంటు అమల్లోకి వస్తుంది. మాకు మద్దతుగా నిలుస్తున్న ప్రయాణికులకు కృతజ్ఞతలు" అని ఎల్ అండ్ టీ మెట్రో రైల్ ఎండీ, సీఈవో కేవీబీ రెడ్డి తెలిపారు.హైదరాబాద్ మెట్రో ఇటీవల ఛార్జీలు పెంచింది. పెంచిన ఛార్జీలు మే 17 నుంచి అమల్లోకి వచ్చింది. కనీస టికెట్ ఛార్జీలు రూ.10 నుంచి రూ.12లకు, గరిష్ట ఛార్జీ రూ.60 నుంచి 75కు మెట్రో యాజమాన్యం పెంచింది.

# ఖమ్మంలో దుర్గం చెరువు తరహా కేబుల్ బ్రిడ్జి



**ఖమ్మం, మే 21, ( వెలుతురు)**

హైదరాబాద్ దుర్గం చెరువు కేబుల్ బ్రిడ్జి నగరంలో ఒక ప్రముఖ పర్యాటక ప్రదేశంగా మారింది. రాత్రి వేళల్లో వెలిగే రంగురంగుల విద్యుద్దీపాలతో ఇది సందర్శకులను విశేషంగా ఆకర్షిస్తోంది. ప్రయాణికులకు సౌకర్యవంతమైన ప్రయాణాన్ని అందిస్తూనే.. ఒక అద్భుతమైన దృశ్యంగా నిలుస్తుంది. అటువంటి కేబుల్ బ్రిడ్జినే ఖమ్మం పట్టణంలోనూ అందుబాటులోకి రానుంది.ఖమ్మం నగరంలో దుర్గం చెరువు తరహాలో మున్నేరు నదిపై నిర్మిస్తున్న సుందరమైన కేబుల్ బ్రిడ్జి పనులు వేగంగా జరుగుతున్నాయి. దాదాపు రూ.180 కోట్ల వ్యయంతో రూపుదిద్దుకుంటున్న ఈ వంతెన ఖమ్మం నగరానికి ఒక ప్రత్యేకమైన గుర్తింపును తీసుకురానుంది. వాహనాల రాకపోకలతో పాటు పర్యాటకులు సేదతీరేందుకు వీలుగా విశాలమైన ఫుట్‌పాత్‌లు, రంగురంగుల విద్యుత్ దీపాలు, ఇతర ఆకర్షణీయమైన హంగులు ఏర్పాటు చేయనున్నారు.వచ్చే వర్షాకాలం నాటికి వంతెన పిల్లర్లు స్లాబ్ స్థాయికి చేరుకునేలా పనులు ముమ్మరంగా సాగుతున్నాయి. గత ఏడాది వరదల కారణంగా పనులు నిలిచిపోయినప్పటికీ.. ఈసారి వరదలను తట్టుకునేలా చర్యలు తీసుకుంటున్నారు. ఇప్పటికే నదికి ఇరువైపులా 15 పిల్లర్ల నిర్మాణం పూర్తయింది. వీటిపై కాంక్రీట్ స్లాబ్‌లను అమర్చే ప్రక్రియ జరుగుతోంది. వంతెనపై నాలుగు వరుసల రోడ్డు నిర్మాణానికి అవసరమైన 128 కాంక్రీట్ సెగ్మెంట్లలో 50 శాతం ఇప్పటికే అమర్చారు.ముఖ్యంగా, నది మధ్యలో నిర్మించాల్సిన రెండు ప్రధాన పిల్లర్లు (%గా–7, ౫%–8), వీటిపైనే వంతెన తీగల నిర్మాణం ఆధారపడి ఉంటుంది, వాటి కాంక్రీట్ పనులు తుది దశకు చేరుకున్నాయి. ఈ ప్రత్యేకమైన కేబుల్ బ్రిడ్జి నమూనా నది మధ్యలో ఎక్కువ పిల్లర్ల అవసరాన్ని తగ్గిస్తుంది. కేవలం ఈ రెండు పిల్లర్ల నుండి అమర్చే బలమైన కేబుల్ బ్రిడ్జి పూర్తి భారాన్ని మోస్తాయి. బ్రిడ్జి 21 మీటర్ల వెడల్పుతో, మధ్యలో డివైడర్‌తో పాటు నాలుగు వరుసల రహదారిని, ఇరువైపులా ఫుట్‌పాత్‌లను కలిగి ఉంటుంది. ప్రస్తుతం పాత వంతెనపై రాకపోకలు నిలిపేశారు. అప్రోచ్ రోడ్డు పనులు వేగంగా జరుగుతుండగా.. త్వరలోనే రాకపోకలను పునరుద్ధరించేందుకు అధికారులు కృషి చేస్తున్నారు. ఈ తీగల వంతెన పూర్తయితే ఖమ్మం నగరం ఒక కొత్త పర్యాటక ప్రాంతంగా మారుతుందని అధికారులు చెబుతున్నారు.

# కబ్జాలపై కుప్పలు, తెప్పలుగా ఫిర్యాదులు

**హైదరాబాద్, మే 21, ( వెలుతురు)**

హైడ్రా ప్రజావాణికి సామాజిక ఫిర్యాదులు వెల్లువెత్తుతున్నాయి. పార్కులు, రహదారులు, ప్రభుత్వ స్థలాలు, ప్రజావసరాల స్థలాల కబ్జాపై ప్రజలు హైడ్రాకు ఫిర్యాదు చేస్తున్నారు. ప్రజావాణిలో కబ్జాలపై 59 ఫిర్యాదులు వచ్చాయి.ఖాళీ జాగా కనిపిస్తే కబ్జా చేసేయడం పరిపాటిగా మారిపోయిందని అనుకుని, గమ్మున ఉండడంలేదు హైదరాబాద్ ప్రజలు. ఒకదాని తర్వాత ఒకటిగా పరిష్కారమౌతున్న తీరును చూసి హైడ్రాను ఆశ్రయిస్తున్నారు. హైడ్రాకు ఫిర్యాదు చేస్తే దశాబ్దాల సమస్యకు పరిష్కారం ఇట్టే దొరుకుతోందని గ్రహించి నగరవాసులు పార్కులు, రహదారులు, ప్రజావసరాలకు ఉద్దేశించిన స్థలాల కబ్జాపై ఫిర్యాదులు చేస్తున్నారు.హైడ్రా ప్రజావాణికి వచ్చిన 59 ఫిర్యాదుల్లో 70 శాతం సామాజిక ఫిర్యాదులే ఉన్నాయి. టోలిచౌకి హకీంపేటలో బాబా హోటల్ వద్ద రోడ్డును ఆక్రమించి షాపు పెట్టేశారంటూ నివాసితులు ఫిర్యాదు చేశారు. మేడ్చల్ – మల్కాజిగిరి జిల్లా కుత్బుల్లాపూర్ మండలం సుభాష్‌నగర్‌లో కొంపల్లికి వెళ్లే 50 అడుగుల రహదారి 100 అడుగుల మేర 10 ఫీట్లకే పరిమితమైందని స్థానికులు ఫిర్యాదు చేశారు.కుత్బుల్లాపూర్ మండలం గాజుల రామారంలో సర్వేనంబరు 155లో ప్రభుత్వ ఆసుపత్రికి కేటాయించిన 3500 గజాల స్థలాన్ని కబ్జా చేస్తున్నారని భగత్‌సింగ్‌నగర్ ప్రభుత్వ ఆసుపత్రి ల్యాండ్ ప్రొటెక్షన్ కమిటీ ప్రజావాణికి ఫిర్యాదు చేసింది. గతంలో మున్సిపాలిటీ అధికారులు కూల్చేసినా దానిని మళ్లీ కబ్జా చేస్తున్నారని పేర్కొంది.

**స్మశానాన్ని అమ్మేశారు**

ఓయూ కాలనీలో తమ ప్లాట్‌ను నలువైపుల మూసివేయడంతో పాటు రహదారి పక్కనే ఉన్న స్మశానాన్ని విక్రయించారని ఓ మహిళ ఫిర్యాదు చేశారు.మేడ్చల్ – మల్కాజిగిరి జిల్లా మేడిపల్లి మండలం చెంగిచెర్ల గ్రామంలో సర్వే నంబరు 3310లో మొత్తం13 ఎకరాల భూమి ఉండగా.. అందులో 6 ఎకరాల్లో మాతా అరవింద్ కాలనీ ఉంది.మిగతా 7 ఎకరాలను సొంతం చేసుకున్న వ్యక్తి తమది దేవాదాయ శాఖ పరిధిలో ఉందంటూ అధికారులకు ఫిర్యాదు చేసి రిజిస్ట్రేషన్లు అవ్వకుండా ఇబ్బంది పెడుతున్నారని కాలనీ వాసులు ఫిర్యాదు చేశారు.నార్సింగి మండలం మణికొండ మున్సిపాలిటీ పుప్పాలగూడ లోని డాలర్ హిల్స్‌లో ఆక్రమణలను హైడ్రా తొలగించింది. సర్వే నంబరు .1041, 106, 113లలో సంతోష్‌రెడ్డితో అతని మిత్ర బృందానికి మొత్తం 60 ఎకరాల భూమి ఉంది. ఇందులోని 30 ఎకరాలలో 1998లో డాలర్‌హిల్స్ పేరిట సంతోష్‌రెడ్డి లే ఔట్ వేశారు. హెచ్‌ఎండీఏ ప్రిలిమనరీ లే ఔట్ తో మొత్తం 80 శాతం ప్లాట్లు అమ్మేశారు.సరైన సమయంలో చెల్లింపులు, అభివృద్ధి చేయకుండా లే ఔట్ రద్దయ్యేలా ప్రయత్నించారు. సాంకేతిక కారణాలతో 2005లో ఈ లే ఔట్‌ను హెచ్‌ఎండీఏ రద్దు చేసింది.స్థల యజమానులు కుమ్మక్కయి ఒక అవగాహనకు వచ్చి వ్యవసాయ భూమిగా తర్వాత మార్చుకున్నారు. ఇది అప్పటికే ప్లాట్లు కొన్నవారికి తెలియదు. తర్వాత ఎల్‌ఆర్‌ఎస్ ద్వారా అనుమతులు తీసుకుని కొంత మంది ఇళ్లు



కట్టుకున్నారు.డాలర్‌హిల్స్ లే ఔట్‌లోని 2 ఎకరాల పార్కు, రహదారులతో పాటు కొన్ని ప్లాట్లను కలిపి పక్కనే ఉన్న 30 ఎకరాల భూమికి జోడించారు. మొత్తం వ్యవసాయ భూమిగా పేర్కొంటూ ఎన్‌సీసీ అనే రియల్ ఎస్టేట్ సంస్థకు సంతోష్‌రెడ్డితో పాటు భూమిపై హక్కు ఉన్నవారు అమ్మేశారు. 2016 నుంచి ఈ వివాదం కోర్టులో ఉంది.కోర్టులో వివాదం ఉండగానే అక్కడ ఎలాంటి నిర్మాణాలు చేపట్టరాదు. అయినా అనుమతులేవీ లేకుండా ఎన్‌సీసీ అక్కడ నిర్మాణాలు చేపడుతోందని డాలర్‌హిల్స్ నివాసితులు హైడ్రాకు ఫిర్యాదు చేశారు. ఈ ఫిర్యాదుపై హైడ్రా కమిషనర్ ఏవీ రంగనాథ్ ఈ నెల 14న క్షేత్రస్థాయిలో అధికారులతో పరిశీలించారు.హైడ్రా కార్యాలయానికి ఇరు పక్షాలను పిలిచి విచారించారు. సంతోష్‌రెడ్డిపై తాము నార్సింగ్ పోలీసు స్టేషన్ లో కేసు కూడా పెట్టామని ప్లాట్ల యజమానులు తెలిపారు. ఎలాంటి అనుమతులు లేకుండా ఎన్‌సీసీ సంస్థ చేపట్టిన నిర్మాణాలను ఆపడమే కాకుండా.. వాటిని హైడ్రా తొలగించింది.

# పెళ్లిళ్ల పేరమ్మలు...మాయల ఫకీర్లు




**హైదరాబాద్, మే 21, ( వెలుతురు)**

ఒళ్లు కదలకుండా.. కూర్చున్న చోట నుంచి అడుగు బయటపెట్టకుండా డబ్బులు సంపాదించాలి అనుకునే వారు మన సమాజంలో పెరిగిపోతున్నారు. డబ్బు సంపాదన కోసం ఎలాంటి అడ్డదారులు తొక్కడానికి అయినా వెనకాడటం లేదు కొందరు. తాజాగా ఈ కోవకు చెందిన సంఘటన ఒకటి వెలుగులోకి వచ్చింది. వృద్ధులను టార్గెట్ చేసుకున్న ఇద్దరు మహిళలు నయా దందాకు తెర తీశారు. ఈ క్రమంలో 80 ఏళ్ల వృద్ధుడిని నమ్మించి.. అతడి వద్ద నుంచి సుమారు రూ.1.77 లక్షలు కాజేశారు. మోసపోయిన బాధితుడు పోలీసులకు ఫిర్యాదు చేయడంతో.. ఈ కిలేడీల వ్యవహారం వెలుగులోకి వచ్చింది. ఇద్దరు కిలేడీలు వృద్ధులకు పెళ్లి సంబంధాలు చూస్తామంటూ ఆశపెడతారు. నమ్మి వీరితో మాట కలిపితే లక్షలు కాజేస్తారు. 80 ఏళ్ల వృద్ధుడి ఫిర్యాదుతో ఈ పెళ్లిళ్ల పేరమ్మలను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. వారు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. ఆంధ్రప్రదేశ్, ఎన్టీఆర్ జిల్లా తిరువూరుకు చెందిన కటారు తాయరమ్మ అలియాస్ సరస్వతి.. కొంత కాలం నుంచి హైదరాబాద్, దిల్‌సుఖ్‌నగర్‌లోని పీఅండ్‌టీ కాలనీలో నివాసం ఉంటుంది. మరో మహిళ ఖమ్మం జిల్లా కొత్తగూడెంకు చెందిన కూనపరెడ్డి స్వాతి. ప్రస్తుతం ఈమె మల్కాజిగిరిలోని సత్యానాగేంద్ర కాలనీలో నివాసం ఉంటుంది. దీనికన్నా ముందు స్వాతి కూడా పీఅండ్‌టీ కాలనీలోనే ఉండేది. ఈ సమయంలోనే స్వాతి, సరస్వతిలకు పరిచయం ఏర్పడిందిఅప్పటికే వీరు ఇద్దరు ఆర్థిక సమస్యలతో బాధపడుతున్నారు. భర్తల సంపాదన కుటుంబ అవసరాలకు సరిపోవడం లేదు. దీంతో వారిద్దరూ ఎలాగైనా సరే డబ్బు సంపాదించాలని భావించారు. ఇందుకోసం ఓ ప్లాన్ వేసుకున్నారు. దీనిలో భాగంగా ఓ మ్యారేజ్ బ్యూరో ప్రారంభించారు. వృద్ధులకు పెళ్లి సంబంధాలు కుదుర్చుతామంటూ ప్రచారం చేసుకున్నారు. దీని గురించి కొన్ని పేపర్లలో యాడ్స్ కూడా ఇచ్చారు.ప్రకటన చూసిన ఖమ్మం జిల్లా మధిర జామాపురానికి చెందిన ఇరుకుమాటి చిన్నకొండయ్య (80) అనే వృద్ధుడు.. గతేడాది అక్టోబర్‌లో రెండో పెళ్లి కోసం వీరిని సంప్రదించాడు. పదేళ్ల క్రితం చిన్నకొండయ్య భార్య మరణించింది. అప్పటి నుంచి అతడు ఓ వృద్ధాశ్రమంలో ఉంటున్నాడు. గతంలో అతడు ధర్మహోమియో మెడికల్ ప్రాక్టిషనర్‌గా పనిచేసేవాడు. వృద్ధాశ్రమంలో ఉండటం కష్టంగా ఉండటంతో.. తోడు మళ్లీ పెళ్లి చేసుకోవాలని అనుకున్నాడు.

అదే సమయంలో కిలేడీలు ఇచ్చిన ప్రకటన ఇతడి కంట పడింది.పెళ్లి ప్రకటన చూసిన చిన్నకొండయ్య.. స్వాతి, సరస్వతిని ఫోన్‌లో సంప్రదించాడు. వారు ఓ సంబంధం ఉందని.. వివరాలు కావాలంటే హైదరాబాద్‌కు రావాలని తెలిపారు. దీంతో నిజంగానే పెళ్లి సంబంధం చూపిస్తారనే ఆశతో.. కొండయ్య హైదరాబాద్ వచ్చాడు. రెండు రోజుల పాటు పెళ్లి గురించి మాట్లాడుకున్నారు. ఆ తర్వాత ఈ ఇద్దరు కిలేడీలు ఆయన్ని సికింద్రాబాద్‌లోని ఓ షోరూంకు తీసుకెళ్లి చీరలు, సారెలు అంటూ పలు రకాల వస్తువులు, బట్టలు భారీగా కొనిపించారు.మళ్లీ కలుస్తామని చెప్పి.. వాటిని తీసుకుని అక్కడి నుంచి వెళ్లిపోయారు. ఆతర్వాత చిన్నకొండయ్య.. ఆ మహిళలకు ఫోన్‌చేయగా వారు స్పందించలేదు. దీంతో మోసపోయానని గ్రహించిన ఆయన పోలీసులకు ఫిర్యాదు చేశాడు. పెళ్లి సంబంధం పేరుతో.. సదరు మహిళలు తన వద్ద నుంచి రూ.1.77 లక్షలు కాజేశారని తెలిపాడు. చిన్నకొండయ్య ఫిర్యాదు మేరకు హైదరాబాద్ మహంకాళి పోలీసులు తాజాగా ఈ ఇద్దరు మహిళలను అరెస్ట్ చేశారు.

# రేవంత్ కాళ్లకు మొక్కిన ఐఏఎస్

## సీఎస్ సీరియస్ వార్నింగ్

**హైదరాబాద్, మే 21, ( వెలుతురు)**

తెలంగాణ ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి అచ్చంపేటలో పర్యటించారు. అక్కడ ఓ సభలో ప్రసంగించారు. ఆ సమయంలో ఐఏఎస్ అధికారి డా. ఎ. శరత్ ఆయన కాళ్లు మొక్కారు. ఈ ఫోటోలు వీడియోలు సోషల్ మీడియాలో వైరల్ అయ్యాయి. అచ్చంపేటలోని అమ్రాబాద్ మండలం మాచారంలో ఇందిర సౌర గిరి జల వికాసం పథకానికి సీఎం రేవంత్ రెడ్డి శ్రీకారం చుట్టారు. ఈ సందర్భంగా గ్రామంలో నిర్మించిన సీతారామాంజనేయ స్వామి ఆలయాన్ని దర్శించుకున్న ఆయన స్వామివారికి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం ఓ ప్రభుత్వ ఆయన ప్రభుత్వ కార్యక్రమంలో పాల్గొన్ననగా ట్రైబల్ వెల్ఫేర్ డిపార్ట్‌మెంట్ సెక్రటరీగా పని చేస్తున్న ఐఏఎస్ ఏ.శరత్ ఆయన కాళ్లు మొక్కారు. ఇందుకు సంబంధించిన ఫొటోలు, వీడియోలు సోషల్ మీడియాలో వైరల్ అయ్యాయి. అయితే ఇక్కడ ఐఏఎస్ కాళ్లు మొక్కిన విషయాన్ని సీఎం రేవంత్ రెడ్డి గమనించనట్టు తెలుస్తోంది. కానీ సోషల్ మీడియాలో ఇందుకు సంబంధించిన వీడియోలు వైరల్ కావడంతో సదరు ఐఏఎస్ అధికారిపై ప్రభుత్వం ఆగ్రహం వ్యక్తం చేసింది.ఐఏఎస్ అధికారి శరత్ వ్యవహారం వివాదాస్పదం అయింది. దీంతో తెలంగాణ చీఫ్ సెక్రటరీ రామకృష్ణారావు సీరియస్ అయ్యారు. ప్రభుత్వ అధికారులందరికీ కీలక సూచనలు చేస్తూ సర్క్యులర్ పంపించారు. ప్రభుత్వ సమావేశాల్లో కానీ.. ప్రజా సమావేశాల్లో కానీ అధికారులు ఎవరూ అనుచితంగా ప్రవర్తించవద్దని స్పష్టం చేశారు. ఎవరైనా నిబంధనలకు విరుద్ధంగా ప్రవర్తిస్తే చర్యలు తీసుకుంటామని హెచ్చరారు. 1968 ఏఐఎస్ రూల్స్ కు అనుగుమంగా మసలుకోవాలన్నారు. అధికారుల ప్రవర్తన ప్రజల్లో నమ్మకం పెరిగేలా ఉండాలి కానీ.. తగ్గేలా ..నవ్వుల పాలయ్యేలా ఉండకూడదన్నారు. ఏఎస్ అధికారులు రాజకీయ నాయకులతో ఉన్నపుడు బాధ్యతగా వ్యవరించాలి అంటూ తెలంగాణ సీఎస్ రామకృష్ణ మండిపడ్డారు. ఐఏఎస్ అధికారులు ఆల్ ఇండియా సర్వీసెస్ ప్రతిష్టకు భంగం కలిగించే విధంగా ప్రవర్తించకూడదని.. ప్రజా సమావేశాల్లో పాల్గొన్నప్పుడు అనుచిత ప్రవర్తన మానుకోవాలని అన్నారు. ఐఏఎస్ అధికారులే ఇలా ప్రవర్తిస్తే ప్రజల్లో అధికారుల పట్ల ఉన్న నమ్మకం తగ్గుతుందని ప్రభుత్వం హెచ్చరించింది. అధికారి ఎల్లప్పుడు పరిపూర్ణ నిజాయితీతో ఉండాలని సూచించింది. ఇకపై ఇలాంటి చర్యలు జరిగే ఉపేక్షించేది లేదని తేల్చి చెప్పింది. ఐఏఎస్ అధికారుల అనుచిత ప్రవర్తనపై క్రమశిక్షణ చర్యలు తప్పవని..ప్రజల్లో గౌరవాన్ని నిలబెట్టుకోవాలంటే అధికారుల తీరు మారాలని సీఎస్ చాలా గట్టిగా చెప్పింది. రాష్ట్ర ప్రభుత్వ అధికారులు కూడా 1964 తెలంగాణ సివిల్ సర్వీసెస్ రూల్స్ అతిక్రమించొద్దు అని ఆదేశాలు జారీ చేసింది. గతంలో తెలంగాణ సీఎం కేసీఆర్ .. కలెక్టర్ల కార్యాలయాలను ప్రారంభించడానికి వెళ్లినప్పుడల్లా అక్కడి అధికారులు కేసీఆర్ కాళ్లకు మొక్కేవారు. ఐఏఎస్ అధికారులు పూర్తి స్థాయిలో గౌరవాన్ని కోల్పోతున్నారన్న విమర్శలు అప్పట్లో వచ్చేవి. అయితే ఇలా చేయవద్దని అప్పట్లో ప్రభుత్వం కానీ.. ఇంకెవరూ కానీ ఆదేశించలేదు. కానీ ఇప్పుడు మాత్రం తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డి.. ఐఏఎస్ శరత్ తీరుపై అసంతృప్తి వ్యక్తం చేసి.. అధికారులంతా రూల్స్ పాటించేలా చూడాలని.. సీఎస్ కు సూచించినట్లుగా తెలుస్తోంది. అందుకే సీఎస్ ప్రత్యేకంగా అధికారులకు సందేశం పంపారని అంటున్నారు.



# బలూచీలో పెట్రేగిన ఉగ్రవాదులు

- స్కూలు బస్సు లక్ష్యంగా పేలుళ్లు
- నలుగురు చిన్నారుల మృత్యువాత



**న్యూఢిల్లీ, మే21( వెలుతురు):**
ఉగ్రవాదులు మరోసారి అమాయక ప్రజలపై దాడులకు పాల్పడ్డారు. పాకిస్థాన్ లోని బలూచిస్తాన్ ప్రావిన్స్‌లో ఒక స్కూల్ బస్సును లక్ష్యంగా చేసుకుని బాంబు దాడి చేశారు. ఈ ఘటనలో నలుగురు పిల్లలు అక్కడికక్కడే మరణించగా, మరో 38 మంది గాయపడ్డారు. సమాచారం అందుకున్న స్థానిక అధికారులు వెంటనే ఘటనా స్థలానికి చేరుకుని గాయపడిన వారిని ఆస్పత్రికి తరలించారు. ఈ పేలుడును అక్కడి హోంమంత్రి మొహ్సిన్ నఖ్వీ తీవ్రంగా ఖండించారు. మరోవైపు అధికారులు ఈ దాడి ఘటనపై దర్యాప్తు ప్రారంభించారు. సమాచారం ప్రకారం, స్కూల్ బస్సు పిల్లలను తీసుకెళ్తున్నప్పుడు ఈ దాడి జరిగింది. పేలుడు జరిగిన వెంటనే సహాయ, రక్షణ చర్యలు ప్రారంభ మయ్యాయి. గాయపడిన వారిని సమీపంలోని ఆసుపత్రులకు తరలించారు. తీవ్రంగా గాయపడిన పిల్లలను క్వెట్టా, కరాచీలోని పెద్ద ఆసుపత్రులకు తరలించారు. పాకిస్థాన్ హోం మంత్రి మొహ్సిన్ నఖ్వీ ఈ దాడిని తీవ్రంగా ఖండిస్తూ పిల్లలను లక్ష్యంగా చేసుకునే ఉగ్రవాదులను ఎట్టి పరిస్థితుల్లోనూ వదిలిపెట్ట బోమన్నారు. దేశంలో భయాన్ని, అస్థిరతను వ్యాప్తి చేయడమే వారి దాడి ఉద్దేశమని, అయితే ప్రభుత్వం, భద్రతా దళాలు వీటిని విజయవంతం చేయనివ్వవని వెల్లడించారు. బలూచిస్తాన్ చాలా కాలంగా పాకిస్థాన్?కు అత్యంత సున్నితమైన, సమస్యాత్మక ప్రాంతంగా ఉంది. ఇక్కడి వేర్పాటువాద శక్తులు పాకిస్థాన్ నుంచి విడిపోయి స్వతంత్ర దేశాన్ని కోరుతున్నాయి. ఈ క్రమంలో అనేకసార్లు పాకిస్థాన్ సైన్యాన్ని, పలువురని లక్ష్యంగా చేసుకుని దాడులు చేస్తున్నాయి. ఇటీవలి సంవత్సరాలలో ఈ ప్రాంతంలో ఉగ్రవాద ఘటనల సంఖ్య భారీగా పెరగడం విశేషం. ఈ క్రమంలోనే బలూచిస్తాన్‌లో జరిగిన ఈ ఆత్మాహుతి దాడి పాకిస్థాన్ అంతర్గత భద్రతపై మరోసారి ప్రశ్నలను లేవనెత్తింది. గత కొద్ది సంవత్సరాలుగా ఈ ప్రాంతం బలోచ్ వేర్పాటువాదులకదలికలతో దద్దరిల్లిపోతోంది. ముఖ్యంగా బలోచిస్తాన్ లిబరేషన్ ఆర్మీ పేరుతో విప్లవకారులు పదే పదే పేలుళ్లు, కాల్పుల ద్వారా ప్రభుత్వాన్ని గడగడలాడిస్తున్నారు. కొన్ని రోజుల క్రితం కిల్లా అబ్దుల్లా నగరంలోని మార్కెట్ వద్ద కార్ బాంబ్ పేలుడులో నలుగురు ప్రాణాలు కోల్పోయారు. ఇది ఒక్కటే కాదు, మార్చిలో జరిగిన ఘోర ఘటనలో, ఓ రైలు పై దాడి చేసి 33 మందిని, ప్రధానంగా సైనికులను హతమార్చింది.

# ప్రతికూల వాతావరణ పరిస్థితులు

- ఉత్తమ్ హెలికాప్టర్ అత్యవసర ల్యాండింగ్



**నల్లగొండ, మే21( వెలుతురు):**
తెలంగాణ రాష్ట్ర మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డికి పెను ప్రమాదం తప్పింది. ఆయన ప్రయాణిస్తున్న హెలికాప్టర్‌ను అత్యవసర ల్యాండింగ్ చేశారు. సూర్యాపేట జిల్లా హుజూర్ నగర్ మండలం మేళ్లచెరువులో హెలికాప్టర్ ల్యాండ్ కావాల్సి ఉంది. అయితే, కమ్ముకున్న మబ్బులు, గాలివాన నేపథ్యంలో అప్రమత్తమైన పైలట్ వాతావరణ శాఖ సూచన మేరకు కోదాడలో అత్యవసర ల్యాండింగ్ చేశారు. కోదాడ నుంచి హుజూర్ నగర్ కు రోడ్డు మార్గంలో మంత్రి ఉత్తమ్ కుమార్ బయలుదేరుతారని అధికారులు వెల్లడించారు.

# స్కీరమ్‌ల పేరుతో స్కామ్‌లు చేశారు

- జగన్ ప్రభుత్వం నిర్వాకంపై అనగాని విమర్శలు

**బాపట్ల, మే21( వెలుతురు):**



గత జగన్ ప్రభుత్వంలో అప్పులు తెచ్చి వివిధ స్కీమ్‌ల పేరుతో స్కామ్‌లు చేసి వారి జేబులు నింపుకున్నారని ఏపీ రెవెన్యూశాఖ మంత్రి అనగాని సత్యప్రసాద్ ఆరోపించారు. రెవెన్యూ శాఖలో భారీగా అవినీతికి పాల్పడ్డారని విమర్శించారు. అటవీ, పేదల భూములను దోచుకున్నారని.. వీరందరీపై చట్టపరంగా చర్యలు తీసుకుంటున్నామని స్పష్టం చేశారు. గత ప్రభుత్వంలో అన్నిరకాల దోపిడీ జరిగిందని అన్నారు. మరోసారి అక్రమాలకు పాల్పడేందుకు అవకాశం లేకుండా వ్యవస్థలన్నీ ప్రక్షాళన చేస్తున్నామని ఉద్ఘాటించారు. కూటమి ప్రభుత్వానికి ఆర్థికంగా కష్టాలు ఉన్నప్పటికీ ఇచ్చిన మాట మేరకు మహిళలకు ఉచిత బస్సు, తల్లికి వందనం, అన్నదాత సుఖీభవ పథకాలను అమలు చేస్తున్నామని మంత్రి అనగాని సత్యప్రసాద్ స్పష్టం చేశారు. పర్టీ కార్యకర్తలు కూడా సంతోషంగా ఉండేలా కచ్చితంగా చూసుకుంటామని మంత్రి అనగాని సత్యప్రసాద్ చెప్పారు. పార్టీ కార్యకర్తలంతా కష్టకాలంలో పార్టీకి రక్షణకవచంలా నిలిచారని అన్నారు. పార్టీ కార్యకర్తల మనస్సుల్లో ఎప్పుడూ తనకు స్థానం ఉండాలనేది తన లక్ష్యమని చెప్పుకొచ్చారు. కార్యకర్తలే తన కుటుంబ సభ్యులని.. వారి తర్వాతే తనకు ఎవరైనా అని ఉద్ఘాటించారు. కార్యకర్తలను మించి తనకెవ్వరూ ఆత్మీయులు లేరని చెప్పారు. కూటమిలో ఉన్న పార్టీల్లోని కార్యకర్తలకూ ఏదోక సమయంలో తప్పకుండా అవకాశం వస్తుందని, ప్రతి ఒక్కరినీ బాగా చూసుకునే బాధ్యత తమదని మంత్రి అనగాని సత్యప్రసాద్ హామీ ఇచ్చారు. ముందు రేపల్లే ప్రాంత అభివృద్ధి ముఖ్యమని.. ఆ తర్వాత పార్టీ కార్యకర్తల అభివృద్ధికి తోడ్పాటు అందిస్తామని మంత్రి అనగాని సత్యప్రసాద్ తెలిపారు. రేప్లలె నియోజకవర్గాన్ని ఆదర్శ నియోజకవర్గంగా మార్చాలని కోరారు. కుప్పం, మంగళగరి, పిఠాపురం నియోజకవర్గాల మాదిరిగా తన నియోజకవర్గం గురించి కూడా అందరూ మాట్లాడుకోవాలని ఆకాక్షించారు. కార్యకర్తల కోసం టీడీపీ పని చేస్తుందని అన్నారు. పల్నాడులో వైసీపీ గూండాల చేతిలో హత్యకు గురైన తోట చంద్రయ్య కుమారుడికి ప్రభుత్వం ఉద్యోగం ఇచ్చామని గుర్తుచేశారు. మన గ్రామాన్ని, మన నియోజకవర్గాన్ని అద్భుతమైన అభివృద్ధి పథంలో నడిపించేందుకు అందరూ కలసి పనిచేద్దామని మంత్రి అనగాని సత్యప్రసాద్ పిలుపునిచ్చారు.

# నేడు వైశాఖ బహుళ దశమి
# హనుమాన్ పెద్ద జయంతి

## హిందువులందరికీ హనుమాన్ జయంతి శుభాకాంక్షలు

పుంజికస్థల అనే అప్సరస అంజన అనే వానర కాంతగా జన్మించెను. అతని తల్లి అంజన కథతో సంబంధం కలిగి ఉన్నది. అంజన అనే ఆడ వానరం మరియు కేసరి అనే పురుష వానరం యొక్క కుమారునిగా జన్మించాడు ఆంజనేయుడు. గతంలో అంజన బ్రహ్మ న్యాయస్థానంలో ఒక అప్సరసలా ఉండేది. ఆమె బాల్యంలో ఒక ముని తపోభంగం కలిగించినందుకు శపించబడింది. ఆమె బాల్యంలో , కాళ్ళు ముడుచుకుని ధ్యానంచేసుకుంటున్న వానరాన్ని చూసి , ఆశ్చర్యంతో ఉత్సాహభరితంగా , చిన్నపిల్ల అయిన అంజన వానరం పైన పండ్లు విసిరింది. హఠాత్తుగా ధ్యానానికి భంగం కలిగిన వానరం రూపంలో ఉన్న ముని నిజరూపం ధరించి , కోపంతో అంజనను , ఆమె ఎవరితోనైన ప్రేమలో పడినప్పుడు వానరంగా మారమని శాపం ఇచ్చాడు. అంజన తను చేసిన తప్పు తెలుసుకుని ఆ మునిని క్షమాభిక్ష పెట్టమని యాచించింది. ఆ ముని శాంతించి ఆమె వానర రూపంలో ఉన్నా , ఆమెను ఎవరైతే ఇష్టపడతారో వారినే వివాహం చేసుకొని శివుని అవతారమైన శిశువుకు జన్మ ఇచ్చినప్పుడు ఆమెకు శాప విమోచనం అవుతుందని వరమిచ్చాడు. అందువలన శాపవిమోచనానికి అంజన భూమిపైన జన్మించింది. అడవిలో నివాసం ఏర్పరచుకున్న అంజన ఒక రోజు ఒక పురుషుడిని చూసింది. ఆమె అతనితో ప్రేమలో పడింది. ఆమె ప్రేమలో పడిన మరుక్షణం ఆమె వానర రూపంలోకి మారింది. ఆ మనిషి అంజన వద్దకు వచ్చి తన నామధేయం 'కేసరి' అని , వానరములకు రాజును అని తనను తాను పరిచయం చేసుకున్నాడు. అంజన వానర ముఖం కలిగి ఉన్నా అతనిని చూసి ఆశ్చర్యపోయింది మరియు ఇచ్ఛానుసారం వానరం మరియు మానవరూపాలను మార్చుకోగలిగిన శక్తి గల అతనిని చూసి అబ్బురపడింది. అతను తనను వివాహమాడమని అంజనను కోరాడు. అంజన మరియు కేసరి ఆ అడవిలోనే వివాహం చేసుకున్నారు. అంజన శివుడికి పూజలు జరిపి తపస్సు చేసింది. సంతోషించిన శివుడు ఆమెను కోరిక కోరుకోమన్నాడు. అంజన , ముని శాపవిమోచనం కోసం శివుడిని తన కుమారుడిగా జన్మించమని కోరుకున్నది. శివుడు ఆమె అభ్యర్థనను ఆమోదించాడు. ఆమె వానర ముఖంగల శివుని అవతారమైన శిశువుకి జన్మ ఇచ్చింది మరియు ఈ బాలుడు అంజనాదేవికి జన్మించటం వలన ఆంజనేయుడని , కేసరినందనుడని , వాయుపుత్ర లేదా పవనపుత్ర అంటే వాయువు యొక్క కుమారుడని వివిధ పేర్లతో ప్రసిద్ధి చెందాడు. తన బాల్యదశలో కూడా హనుమ చాలా శక్తివంతమ్కెనవాడు. అతను , తన తండ్రిఅయిన కేసరి , తల్లి , అప్సర అంజన యొక్క శక్తి , వాయువేగం గలవాడు. హనుమ జననం వలన అంజన శాపవిమోచనం పొందింది. భక్తులెందరో హనుమంతుణ్ణి ఆదర్శనీయ దైవంగా ఆరాధిస్తారు. అతణ్ణి మహాహలుడు , బుద్ధిశాలి , కపిశ్రేష్టుడు , సర్వశాస్త్ర పారంగతుడు , స్వామిభక్తి పరాయణుడు , రామదూత అంటూ ఎన్నోవిధాలుగా ప్రస్తుతిస్తారు. తల్లి అంజనాదేవి కనుక అతణ్ణి ఆంజనేయుడంటారు. అతని తండ్రి ఎవరనే విషయంలో శివమహాపురాణం , రామాయణం , పరాశరసంహిత మొదలైన గ్రంథాల్లోని వైవిధ్యగాథలతో అతడి దివ్యజననం ముడిపడి ఉంది. హనుమ , ఏడుగురు చిరంజీవు లలో ఒకడు. శ్రీరాముడికి ప్రచండమైన భక్తుడు. అతను లంక రాజు రావణుడి బారి నుండి సీతను కాపాడి తిరిగి శ్రీ రాముడికి అప్పగించాడు. హనుమ కథ , మన జన్మ యొక్క రహస్యం , శక్తి గురించి తెలుసుకోవటంలో మనకు సహాయపడుతుంది. జన్మతః బలసంపన్నుడు అయిన ఆంజనేయుడు ఒకమారు ఉదయించుచున్న



సూర్యబింబమును చూచి పండు అనుకొని తినుటకు ఆకాశమునకెగిరెను. అప్పుడు జరిగిన ఘటనలలో ఇంద్రుడు తన వజ్రాయుధంతో ఆ బాలుని దవడ (హనుమ) పై కొట్టెను. అలా కొట్టడం వల్ల ఆ బాలుని దవడకు చొట్ట పడినది. చొట్ట పడిన దవడ కలిగిన వాడవడం చేత హనుమంతుడనే పేరు వచ్చింది. తన కొడుకు దెబ్బ తిన్నందుకు ఆగ్రహించి , వాయుదేవుడు వీచటం మానివేశాడు. అపుడు బ్రహ్మాది దేవతలు హనుమంతున కనేక వరాలిచ్చి వాయుదేవుని శాంతింప జేశారు. ఆంజనేయస్వామి అవతారాలు తొమ్మిది: హనుమంతుడు కూడా దుష్టశిక్షణ , శిష్టరక్షణ కోసం అవతారాలు ఎత్తాడు. అవి తొమ్మిది. హనుమన్నవావతారాలంటారు. పరాశర సంహితలో పరాశర మహర్షి వాటిని వివరించడం జరిగింది. 1. ప్రసన్నాంజనేయస్వామి. 2. వీరాంజనేయస్వామి. 3. వింశతిభుజాంజనేయ స్వామి. 4. పంచముఖాంజనేయ స్వామి. 5. అష్టాదశ భుజాంజనేయస్వామి. 6. సువర్చలాంజనేయ స్వామి. 7. చతుర్భుజాంజనేయ స్వామి. 8. ద్వాత్రింశాద్భుజాంజనేయస్వామి. 9. వానరాకార ఆంజనేయస్వామి. దశమహావిద్యలతో సమానమైన శక్తి కలవాడు ఆంజనేయుడు. హనుమంతుడు తంత్రదేవతలందరిలోకి అధికుడు. ఆంజనేయునికి అష్టసిద్ధులు ఉన్న కారణంగా ఆయనను ఉపాసించిన వారికి మానవాతీత శక్తులు లభిస్తాయి. ఆయన అష్టసిద్ధులు:1. అణిమాసిద్ధి : శరీర పరిమాణం ఆవగింజంత చిన్నదిగా చేసుకోగల శక్తి. 2. మహిమాసిద్ధి : శరీర పరిమాణం పర్వతమంత పెంచుకోగల శక్తి. 3. లఘిమాసిద్ధి : శరీరం బరువును నువ్వుగింజ కన్నా తక్కువ బరువుగా చేసే శక్తి. 4. గరిమ : శరీరం బరువును పర్వతమంత బరువు పెరిగేలా చేసే శక్తి. 5. ప్రాప్తిసిద్ధి : ఎక్కడికైనా ప్రయాణించగల శక్తి.. దేనినైనా పొందగలిగే శక్తి. 6. పరకామ్యసిద్ధి : ఎవరూ తగ్గించలేని ఆత్మబలాన్ని కలిగిఉండే శక్తి . 7. వశిత్వసిద్ధి : అన్ని జీవులపైనా ఆధిపత్యాన్ని కలిగిఉండే శక్తి. 8. ఈశిత్వసిద్ధి : దేనినైనా సృష్టించగల మరియు దేనినైనా నాశనం చేయగల శక్తి. శ్రీ హనుమంతునికి ప్రదక్షిణాలు ఎలా చేయాలి ?హనుమంతునకు ప్రదక్షిణములు ఇష్టం. ఏ దేవాలయానికి వెళ్ళినా మూడు ప్రదక్షిణాలు చెస్తాం. కాని హనుమంతుని ఆలయానికి వెళ్లినప్పుడు ఐదు ప్రదక్షిణాలు చేయాలి. 'ప్రదక్షిణ నమస్కారాన్ సాష్టాంగాన్ పంచ సంఖ్యాయా' అని ఆర్ష వాక్యం. మామూలుగా ప్రదక్షిణాలు చేసేటప్పుడు కూడా ప్రదక్షిణ శ్లోకాలు చదువు కోవాలి. సకల రోగ , భూతప్రేత పిశాచాది భాధలు తొలగుటకు , అభీష్టసిద్ధికి ప్రదక్షిణాలు సుప్రసిద్దాలు. ప్రదక్షిణాలు చేసి సంతానం పొందిన వారెందరో ఉన్నారు. కాబట్టి భక్తులను ఏ బాధలో ఉన్నా ప్రదక్షిణాలకు ప్రోత్సహించండి. నియమాలు పాటించటం ముఖ్యం. రోజు ఒకే మారు 108 లేదా 54 అదీ చేయలేనివారు 27 పర్యాయాలు చేయాలి. పుష్పములు. వక్కలు , పసుపుకొమ్ములు వంటి వాటిని లెక్కించడానికి వాడటం మంచిది. ప్రదక్షిణాలు చేస్తూ చదవాల్సిన ధ్యానం. 'శ్రీహనుమన్ జయ హనుమాన్ జయ జయ హనుమాన్' హరిమర్కటమర్కటాయనమః శ్లో॥ ఆంజనేయం మహావీరం – బ్రహ్మవిష్ణు శివాత్మకం తరుణార్క ప్రభంశాంతం – రామదూతం నమామ్యహం శ్లో॥ మర్కటే శ మహొ త్సాహ – సర్వశోక వినాశన శత్రూన్సంహర మాం రక్ష – శ్రియం దాపయ మే ప్రభో॥ అని చదువు కొంటూ ప్రదక్షిణాలు చేయాలి. కోరిక మేరకు మండలం , అర్ధ మండలం కాని ప్రదక్షిణాలు చేసి చివరిలో స్వామికి విశేషార్చన జరిపించి "యాకృత్తె రేభి: ప్రదక్షిణై॥ శ్రీ సువర్చలా సమేత హనుమాన్ సుప్రిత స్సుప్రసన్నో వరదో భూత్వా మమ అభిష్ట సిద్ధం దదాతు" అని జలాన్ని అక్షతలతో వదలి పెట్టాలి. ప్రదక్షిణ కాలంలో బ్రహ్మచర్యం , శిరస్సు మీదనుండి స్నానము , నేలమీద పడక , సాత్వికాహారం వంటి నియమాలు పాటించాలి.

ఆచరణ: భక్తులకు ఏ బాధలు కలిగినా నియమాలు చెప్పివారు ప్రదక్షిణాలు చేయునట్లు ప్రోత్సహించి వారి బాధలు స్వామిద్వారా తోలగునట్లు చేయాలి. హనుమత్ ప్రదక్షిణ ధ్యానం శీలాఫలకంపై చెక్కించి ఆలయాన అతికించాలి. మామూలుగా ఐదు ప్రదక్షిణాలు చేయమని భక్తులకు తెలపాలి. అభిషేకం: పరమ వైష్ణవ శిఖామణి అయిన హనుమంతుడు రుద్రాంశ సంభూతుడు కాబట్టి ఆయనకు అభిషేకం ఇష్టం. అందులోనూ మన్యు సూక్త అభిషేకిస్తే పరమానంద భరితుడు అవుతాడు , కోరికల్ని తీరుస్తాడు. స్వామి పుట్టిన నక్షత్రం పూర్వభాద్ర రోజు తప్పకుండా చేయాలి. వారం వారం , నిత్యమూ చేయగలగటం మరీ మంచిది. ఆచరణ : మన్యుసూక్తం నేర్చుకొని భక్తులకు దాని విలువ తెలిపి ప్రతి పర్వదినానా దాతల ద్వారా అభిషేకం జరిపింపజేయాలి.

మంగళ వార సేవ


మంగళవారంనాడు హనుమంతునకు శరీరంపై సింధూరం పూయటం మంచిది. శరీరమంతా సింధూరం కుదరనివారు మూతికయినా తప్పక పూయాలి. సింధూరార్చన చేయటం , అరటి పండ్లు నివెదించటం చేయాలి. అందుకు కారణమైన విశేషగాథ ఉంది. శనివార సేవ :

హనుమంతుడు శనివారం జన్మించాడు. కాబట్టి ఆయనకు శనివారం ఇష్టమైనది. నాడు యథాశక్తి విశేషార్చన , సహస్రనామాదికం చేయాలి. భక్తులచే అప్పాలు , వడ మాల వంటివి ప్రోత్సహించి చేయించి స్వామికి సంతృప్తి కలిగించాలి.

పంచ సంఖ్య: హనుమంతుడు పంచ (ఐదు) సంఖ్య ఇష్టం కాబట్టి చేసే ప్రదక్షిణాలు , నమస్కారాలు ఐదు చేయాలి. అరటి పండ్లు వంటివి ఏవయినా ఐదు సంఖ్యలలో సమర్పించుట స్వామికి ప్రీతికరం.

# కరీంనగర్‌లో తాగునీటి కష్టాలు

**కరీంనగర్, మే21( వెలుతురు):**
ఎండతీవ్రతతోపాటు కరీంనగర్ లో ప్రజల గొంతెండిపోతున్నది. నాలుగైదేండ్లుగా లేని నీటి సమస్య మళ్లీ ఇబ్బంది పెడుతున్నది. రాంనగర్ ప్రాంతంలో వారం రోజులుగా ప్రజలు తాగునీటి కోసం తండ్లాడుతున్నారు. నాలుగురోజులపాటు నీటి సరఫరా నిలిచిపోగా ప్రస్తుతంగా రెండురోజులకోసారి 20 నిమిషాలపాటే నీటి సరఫరా జరుగుతుండడంతో ప్రజలు తాగునీటి కోసం క్యాన్లు చేత బూని రిజర్వాయర్ల వద్దకు పరుగులు తీస్తున్నారు.హౌజింగ్ బోర్డు కాలనీ లో కేంద్ర పట్టణాభివృద్ధి శాఖ మంత్రి మనోహర్లాల్ ఖట్టర్ నాలుగు నెలల క్రితం 24 గంటల నీటి సరఫరా పథకాన్ని ప్రారంభించగా నేడు రో జువారి నీటి సరఫరా కూడా కష్టతరంగా మారింది. 24 గంటల నీటి సరఫరా కోసం హౌజింగ్ బోర్డు కాలనీ, గాయత్రీనగర్ ఎం పిక చేసి ఇక్కడ ఫిల్టర్ బెడ్ ఏర్పాటు చేసి తాగునీటి కుళాయిలకు మీటర్లను కూడా బిగించారు. అయితే అవి పనికిరాకుండా పో తున్నాయి. ఒక్క రాంనగర్, హౌజింగ్ బోర్డు కాలనీలే కాకుండా నగరంలోని హైలెవల్, లోలెవల్ జోన్లలో నీటి సరఫరాకు తీవ్ర అంతరాయం ఏర్పడుతున్నది.ఎల్ఎండీ రిజర్వాయర్లో రోజు రోజుకు నీటి నిల్వలు తగ్గుముఖం పడుతుండడంతో నగరంలో నీటి సరఫరా విషయంలో ఇబ్బందులు వస్తున్నాయి. ఫిబ్రవరి వరకు ప్రతిరోజు మంచినీటి సరఫరా చేసిన అదికారులు ఈ నెల మొదటి వారం నుంచే హైలెవల్ జోన్ పరిధిలోని ఆరు డివిజన్లలో రెండు రోజులకొ కసారి నీటిని అందిస్తున్నారు. ఇక వారం రోజులుగా నగరవ్యాప్తంగా రెండు రోజులకొకసారి సరఫరా చేస్తుండగా, ప్రజలు నీటి సంపులు, ట్యాంకులను వినియోగించే పరిస్థితి వచ్చింది. ప్రస్తుతం ఎన్ఎండీలో 6.74 టీఎంసీల నీరు ఉండడంతో వర్షాలు పడకుంటే ఈ మాసాంతంతోపాటు జూన్ మొ దటి వారంలో మరిన్ని కష్టాలు పడే అవకా శం ఉన్నది. ఈ పరిస్థితుల్లో తాగునీటి సరఫరాకు మరిన్ని ఇబ్బందులు వచ్చే ముప్పు కనిపిస్తున్నది. ఫిల్టర్ బెడ్ లో



63 ఎంఎల్ డి శుద్ధి చేసే సామర్థ్యం ఉంది. ప్రస్తుతం ఎల్ఎండీలో 6.74 టీఎంసీల నీరు మాత్రమే ఉండడంతో రా వాటర్ తీసుకోవడానికి బూస్టర్ పంపుల ను వినియోగిస్తుండగా, 50 నుంచి 52 ఎంఎల్డీలు మాత్రమే వస్తున్నది. ఆ నీటినే ఫి ల్టర్ చేసి నగరానికి సరఫరా చేస్తున్నారు. నగరానికి మంచినీటిని అందించే ఫిల్టర్ బెడ్ లో కి సరిపడా నీరు అందడం లేదని బల్దియా ఇంజనీరింగ్ అధికారులు చెబుతున్నారు. అ యితే ఫిల్టర్ బెడ్ కు సరిపడా నీరందకపోవడంతో హైలెవల్ జోన్లో ఒక రోజు, లో లెవల్ జోన్లో మరొక రోజు సరఫరా చేస్తున్నారు. ఎ ఫ్ఎండీలో మరింత నీటి మట్టం తగ్గితే వచ్చే రా వాటర్లో మలినాలు ఎక్కువగా ఉండే ము ప్పు ఉందని, దీనిని ఫిల్టర్, పంపింగ్ చేసేందుకుఇబ్బందులు వస్తాయని చెబుతున్నారు.నగరపాలక సంస్థ పదవీకాలం ముగియవస్తున్నందన్న హడావుడిలో కేంద్ర మంత్రిచేత 24 గంటల నీటి సరఫరా పథకాన్ని ప్రారంభింపజేశారు కానీ సరఫరాలో నగరపాలక సంస్థ వైఫల్యం చెందింది. పనులు సంపూర్ణంగా పూర్తికాకున్నా గత పాలకులు తమ హయాంలో జరిగిందని చెప్పుకునేందుకు ఈ పథకాన్ని ప్రారంభించారు కానీ అమలుపై శ్రద్ధ వహించలేదు. ఇప్పటికైనా అధికారులు దృష్టి సారించాలి.రాంనగర్ లో తాగునీటి సమస్యపై డీఈ శ్రీనివాస్ కు ఫిర్యాదు చేసినా స్పందించడం లేదు. ఈ ప్రాంతానికి 20 నిమిషాలపాటే రెండు రోజులకోసారి నీటి సరఫరా సాగుతుంది. డ్రైనేజీలో ప్రవహిస్తున్న కలుషిత నీటి కారణంగా రాంనగర్ వాసులు మున్సిపల్ మంచినీటిపైనే ఆధారపడ్డారు. అయితే సరిపడా నీటి సరఫరా లేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. నీటి సరఫరా అంతరాయాన్ని తొలగించకుంటే ప్రజాందోళన తప్పదు.

https://epaper.velthuru.com

వెలుతురు

cinema

# హరిహర వీరమల్లు నుంచి మరో పాట

## అసుర హననం అంటూ.. పవర్‌ఫుల్ సాంగ్


పవర్ స్టార్ పవన్ కళ్యాణ్ నటించిన లాంగ్ అవైటెడ్ చిత్రం 'హరిహర వీరమల్లు'. నిజ జీవిత యోధుడు వీరమల్లు జీవిత కథ ఆధారంగా దర్శకుడు క్రిష్ జాగర్లమూడి, సహా జ్యోతి కృష్ణ తెరకెక్కించిన ఈ చిత్రం కోసం, రెండు తెలుగు రాష్ట్రాల ప్రేక్షకులు.. ఎంతో ఆత్రుతగా ఎదురు చూస్తున్నారు. ఇప్పుడు విడుదలకు సిద్ధం అవుతుండగా మేకర్స్ సాలిడ్ ప్రమోషన్స్ ఆల్రెడీ స్టార్ట్ చేశారు. ఇప్పటికే రెండు పాటలు విశేషంగా ఆకట్టుకోగా తాజాగా మూడో పాట విడుదల చేశారు.అసుర హననం అంటూ సాగిన ఈ సాంగ్ అనుకున్నట్టుగానే మంచి పవర్ ఫుల్ గా ఉందని చెప్పాలి. కీరవాణి ఇచ్చిన ట్యూన్ సహా రాంబాబు గోసల సాహిత్యం స్టన్నింగ్‌గా ఉన్నాయని చెప్పవచ్చు. మొత్తం ప్లే బ్యాక్ సింగర్స్ తోనే పాడించిన, ఈ పాట వింటుంటే ఒళ్ళు నిక్కబొడుచుకుంటుంది. అంతే కాదు ఈ లిరికల్ వీడియోలో విజువల్స్ కూడా బాగున్నాయి. పవన్ పై పలు పోరాట సన్నివేశాల దృశ్యాలు ఒక్కోక్కటి గూస్ బంప్స్ తెప్పిస్తున్నాయి. మొత్తానికి రెండు సింపుల్ సాంగ్స్ తర్వాత మంచి పవర్ సాంగ్‌ని మేకర్స్ ఇపుడు విడుదల చేసారు. ఇక ఈ చిత్రం ఈ జూన్ 13న పాన్ ఇండియా భాషల్లో సినిమా విడుదల కాబోతుంది.




# మోహన్‌లాల్‌కు బర్త్‌డే కానుక

## కన్నప్ప నుంచి పోస్టర్ విడుదల

మలయాళంలో వరుసగా బ్లాక్ బస్టర్ హిట్లను అందుకుంటున్నారు సూపర్ స్టార్ మోహన్ లాల్. ఆయన నటిస్తున్న చిత్రాలన్నీ కూడా వరుసగా 200 కోట్ల వసూళ్లతో అదరగొడుతున్నాయి. ఇక త్వరలోనే మంచు విష్ణు డ్రీమ్ ప్రాజెక్ట్ 'కన్నప్ప' తో ఆడియన్స్ ముందుకు రానున్నారు మోహన్ లాల్. 'కన్నప్ప' నుంచి వస్తున్న ప్రతి అప్డేట్ సోషల్ మీడియాలో ట్రెండింగ్ అవుతున్న సంగతి తెలిసిందే. క్యారెక్టర్ పోస్టర్‌లు, టీజర్, పాటలు ఇలా అన్నీ కూడా ఆడియెన్స్‌ను ఆకట్టుకున్నాయి. అయితే జూన్ 27న ప్రపంచవ్యాప్తంగా గ్రాండ్ రిలీజ్‌కు సిద్ధమవుతున్న ఈ చిత్రం నుంచి తజాగా అందరినీ ఆకట్టుకునే అప్డేట్‌ను వదిలారు. ఈ రోజు మోహన్ లాల్ పుట్టిన రోజు (మే 21) సందర్భంగా కన్నప్ప నుంచి గ్లింప్స్‌ను రిలీజ్ చేశారు.ఈ వీడియోలో మోహన్ లాల్ స్క్రీన్ ప్రెజెన్స్, కనిపించిన తీరు అన్నీ అద్భుతంగా ఉన్నాయి. గూస్ బంప్స్ తెప్పించేలా ఈ గ్లింప్స్‌ను కట్ చేశారు. దీని బట్టి చూస్తే, కిరాత పాత్రలో మోహన్‌లాల్ ప్రెజెన్స్, యాక్టింగ్ అందరినీ ఆకట్టుకోవడం కాయం. ఈ చిత్రంతో మళ్లీ ఆడియెన్స్‌పై తన ముద్రను వేసేలా కనిపిస్తున్నారు. దైవిక శక్తితో ముడిపడి ఉన్న కిరాత అనే పాత్రను మోహన్‌లాల్ పోషించారు. ప్రస్తుతం విష్ణు మంచు, కన్నప్ప టీం ప్రమోషన్స్‌లో ఫుల్ బిజీగా ఉండగా, ఇప్పటికే యూఎస్ టూర్‌ను పూర్తి చేశారు.




# సత్యాగ్రహి ఆగిపోవడానికి పలు కారణాలు

## నిర్మాత ఎఎం రత్నం వెల్లడి



ప్రస్తుతం పవన్ కల్యాణ్ లైనప్ లో 'ఓజీ', 'ఉస్తాద్ భగత్ సింగ్' లతో పాటు, 'హరిహర వీరమల్లు' సినిమాలున్నాయి. ఇందులో జ్యోతి కృష్ణ దర్శకత్వం వహిస్తున్న 'హరిహర వీరమల్లు' చిత్రం రెండు పార్టులుగా తెరకెక్కుతుంది. కాగా పార్ట్-1 జూన్ 12న ప్రపంచవ్యాప్తంగా గ్రాండ్‌గా విడుదల కానుంది. ఈ నేపథ్యంలో మేకర్స్ థర్డ్ సింగిల్ అసుర హననం లిరికల్ వీడియో సాంగ్‌ను విడుదల చేశారు. ఒక యోధుడు పైకి వస్తాడు. ఒక వారసత్వం ప్రారంభమవుతుంది. ధర్మం కోసం యుద్ధం ప్రారంభం కానుంది.. అంటూ విడుదల చేసిన ఈ పాట గూస్‌బంప్స్ తెప్పిస్తుంది. ఇందులో భాగంగా ఈ మూవీ నిర్మాత ఏఎమ్ రత్నం మాట్లాడుతూ.. గతంలో పవన్ తో అనుకున్న'సత్యాగ్రహి' సినిమా ఆగిపోవడానికి గల కారణం తెలిపారు. పవన్ కళ్యాన్ కెరీర్ లో చాలా సినిమాలు సెట్స్ మీదకు వెళ్లి ఆగిపోయాయి. అందులో 'సత్యాగ్రహి' కూడా ఒకటి. ఏఎమ్ రత్నం నిర్మాణ సారథ్యంలో ఘనంగా ఈ సినిమా ప్రారంభమైనప్పటి ఏమైందో తెలియదు కానీ అనూహ్యంగా సినిమా ఆగిపోయింది. ఆ తర్వాత మళ్లీ అదే ఏఎమ్ రత్నం తో పవన్ 'బంగారం' సినిమా తీశాడు. అయితే తాజాగా 'హరిహర వీరమల్లు' పాట రిలీజ్ ఈవెంట్ లో ఏఎమ్ రత్నం మాట్లాడుతూ 'నిజానికి సత్యాగ్రహి సినిమాను పవన్ చాలా ఇష్టంగా ప్రారంభించారు. కానీ పలు కారణాల వల్ల క్యాన్సిల్ అయిపోయింది' అని క్లారిటీ ఇచ్చారు రత్నం.

# అనుష్క ఘాటీకి వరుస అవాంతరాలు

## విడుదల ప్లాన్ జూలైకి వాయిదా


టాలీవుడ్ స్టార్ హీరోయిన్ అనుష్క ప్రధాన పాత్రలో నటిస్తున్న తాజా చిత్రం 'ఘాటీ'. క్రిష్ జాగర్లమూడి దర్శకత్వం వహించిన ఈ మూవీలో తమిళ హీరో విక్రమ్ ప్రభు కీలక పాత్ర పోషిస్తుండగా. ఈ చిత్రాన్ని యువి క్రియేషన్స్, ఫస్ట్ ఫ్రేమ్ ఎంట్టంల్గ÷న్మెంట్స్ సంయుక్తంగా ప్రొడ్యూస్ చేస్తున్నాయి. ఇక ఇప్పటి వరకు అనుష్కను జేజమ్మ, దేవసేన వంటి పవర్ ఫుల్ రోల్స్ చూసినప్పటికి.. మొట్టమెదటి సారిగా ఆమెను వయలెంట్ రోల్‌లో చూపించే క్రెడిట్ క్రిష్ జాగర్లమూడికి దక్కింది. దీంతో అనుష్కని తెరపై ఎప్పుడు చూస్తామా.. అని అభిమానులు వేయికళ్లతో ఎదురుచూస్తున్నారు. అయితే తాజాగా ఈ మూవీ రిలీజ్ డేట్ పై..వార్తలు వినపడుతున్నాయి. మొదట ఏప్రిల్ 18న ఈ మూవీ రిలీజ్ చేయాలని దర్శక నిర్మాతలు ప్లాన్ చేసినప్పటికి, కొన్ని అనివార్య కారణాల వల్ల సినిమా విడుదల వాయిదా పడింది. ఇప్పుడు ఈ సినిమాను జూలై రెండో వారంలో తీసుకు రావాలని ప్లాన్ చేస్తున్నారట. కానీ జూన్‌లో రిలీజ్ డేట్స్ ఖాళీ లేవు. మొదటి వారం కమల్ హాసన్ 'థగ్ లైఫ్', రెండో వారం పవన్ కళ్యాణ్ 'హరిహర వీరమల్లు', మూడో వారం ధనుష్ 'కుబేర', నాలుగో వారం విష్ణు మంచు 'కన్నప్ప' వంటి వరుస పాన్ ఇండియా సినిమాలు లైన్ లో ఉన్నాయి. జూలై మొదటి వారంలో విజయ్ దేవరకొండ 'కింగ్‌డమ్' రిలీజ్ కు రెడీ అయింది. అంటే జూలై రెండవ వరం స్లాట్ ఖాళీగా ఉందన్నమాట. అందుకే అప్పుడు విడుదల చేయాలని ప్లాన్ చేశారట. మరి జూలై రెండో వారంలో అయిన 'ఘాటీ' కి సోలో రిలీజ్ దక్కే అవకాశం ఉందంటారా..?



# జూన్ 5న కమలహాసన్ థగ్‌లైఫ్ విడుదల

*ఆగస్ట్‌లో ఓటిటిలోకి అంటూ అప్పుడే ప్రచారం*

కమల్ హాసన్ నటించిన తాజా చిత్రం 'థగ్ లైఫ్'. లెజెండరీ డైరెక్టర్ మణిరత్నం కాంపౌండ్ నుంచి వస్తోన్న ఈ మూవీలో కోలీవుడ్ స్టార్ హీరో శింబు కీలక పాత్రలో నటిస్తుండగా.. ఐశ్వర్యలక్ష్మి, త్రిష, గౌతమ్ కార్తీక్, జోజు జార్జ్, దుల్కర్ సల్మాన్, జయం రవి ప్రధాన పాత్రలు పోషిస్తున్నారు. కమల్ హీరో మాత్రమే కాదు నిర్మాత కూడా. ప్రొడక్షన్ హౌస్ రాజ్ కమల్ ఇంటర్నేషనల్ ఫిల్మ్, దర్శకుడు మణిరత్నానికి చెందిన మద్రాస్ టాకీస్, ఉదయనిధి స్టాలిన్‌కు రెడ్ఫ జెయింట్ ఫిలింస్ మీద సినిమా రూపొందింది. ఇక..ఇటీవల విడుదలైన ట్రైలర్‌కు మంచి స్పందన రాగా. ఈ చిత్రం జూన్ 5న పాన్ ఇండియా స్థాయిలో గ్రాండ్‌గా విడుదల కానుంది. అయితే ఈ సినిమా డిజిటల్ స్ట్రీమింగ్ డేట్ గురించి కమల్ హాసన్ క్లారిటీ ఇచ్చారు. రీసెంట్ గా ఓ మీడియాతో ముచ్చటించగా.. ఓటీటీలోకి ఎప్పుడు వస్తుంది? అంటే.. 'ఆగస్టు వరకు వెయిట్ చేయాలి. థియేటర్లలో విడుదలైన ఎనిమిది వారాల తర్వాత మాత్రమే మా సినిమా ఓటీటీ లోకి వస్తుంది' అని కమల్ హాసన్ స్పష్టం చేశారు. కాగా ఈ 'థగ్ లైఫ్' ఓటీటీ హక్కులను ఇంటర్నేషనల్ ఎ÷-లాట్‌ఫార్మ్ నెట్‌ప్లిక్స్ సొంతం చేసుకోగా. తమిళం తో పాటు తెలుగు, హిందీ, మలయాళ, కన్నడ భాషల్లో స్టీమ్రింగ్ చేయనున్నారట.






# అవకాశాలు రాకుండా తొక్కేశారు

## దర్శకుడు త్రివిక్రమ్‌పై పూనమ్ విమర్శలు

ఒకప్పటి పాపులర్ నటి పూనమ్ కౌర్ ఇటీవల వివాదాలతో వార్తలలో నిలుస్తుండడం మనం చూస్తూ ఉన్నాం. ముఖ్యంగా పవన్ కళ్యాణ్, త్రివిక్రమ్‌లని టార్గెట్ చేస్తూ సోషల్ మీడియాలో ఆసక్తికర కామెంట్స్ చేస్తూ ఉంటుంది. గతంలో త్రివిక్రమ్‌పై పూనమ్ కౌర్ సంచలన కామెంట్స్ చేయగా, ఇప్పుడు దానిపై మరోసారి స్పందించి వార్తలలో నిలిచింది .నేను గతంలో చెప్పాను, ఇప్పుడు కూడా చెబుతున్నాను. మెయిల్ ద్వారా కంప్లైంట్ చేశాను. ఝూన్సీ గారితో మాట్లాడాను, కాని తర్వాత ఆమెని కలవలేకపోయిను. ఆమె బిజీగా ఉన్నారని, డిస్టబ్ర్ చేయొద్దని చెప్పారు. అందుకే కలవలేకపోయాను. నేను త్రివిక్రమ్ శ్రీనివాస్ మీద కంప్లైంట్ చేశాను. రాజకీయ అండదండలతో ఎవరైతే తప్పించుకుంటున్నారో అతడి మీద ఫిర్యాదు చేశాను.. మెయిల్ చేసినట్టుగానే ఉమెన్ టీంతో నేను మాట్లాడతాను.. థాంక్యూ అని పూనమ్ పోస్ట్ వేసింది. తన వద్ద ఆధారాలు ఉన్నాయంటూ ఝూన్సీతో చాట్ చేసిన స్క్రీన్ షాట్లను కూడా ఆమె బయటపెట్టారు. ఈ క్రమంలో మరోసారి వీరి వ్యవహారం హాట్ టాపిక్‌గా మారింది. ఇటీవల ఏపీ సీఎం చంద్రబాబుని పూనమ్ కలవగా, అందుకు సంబంధించిన ఫొటో నెట్టింట వైరల్ అయింది. ఆ ఫొటో చూసి త్రివిక్రమ్‌తో సమస్య సమసిపోయిందని , అందుకే కూటమి ప్రభుత్వంలో పవన్ ఉన్నా కూడా చంద్రబాబుని కలిసింది అని అంతా అనుకున్నారు. కాని ఇప్పుడు ఆమె పోస్ట్‌లు చర్చనీయాంశంగా మారాయి. మలయాళ ఇండస్ట్రీ, మీటూ ఆరోపణలు వెల్లువెత్తుతున్న టైంలోనే పూనమ్ కౌర్ మాటల మాంత్రికుడు త్రివిక్రమ్‌పై సంచలన ఆరోపణలు చేశారు. సినిమా అవకాశాల పేరుతో తనను ఛీట్ చేశారని.. ఇండస్ట్రీలో ఎదగకుండా తొక్కేశారని పూనమ్ పెద్ద ఎత్తునే విమర్శలు చేసింది. మాలో కూడా ఈ విషయంపై ఫిర్యాదు చేసినట్టు పేర్కొన్నారు. అయితే దానిపై ఎలాంటి చర్యలు తీసుకోలేదు. రాజకీయంగా తనని ఇబ్బందికి గురి చేశారని, అందుకే అప్పట్లో వదిలేశానని చెప్పింది.

## చంద్రబాబు డైవర్షన్ పాలిటిక్స్

- వైఎస్ జగనం సంక్షేమ పథకాలపై కుట్ర
- రేషన్ డోర్ డెలివరీ రద్దు చేయడంపై మండిపడ్డ కారుమూరి



**అమరావతి,మే21( వెలుతురు):**
కూటమి ప్రభుత్వంలో రాష్ట్రంలో అరాచక పాలన జరుగుతోందని వైఎస్సార్‌సీపీ నేతలు ఆగ్రహం వ్యక్తం చేశారు. చంద్రబాబు డైవర్షన్ పాలిటిక్స్ చేస్తున్నారు. వైఎస్ జగన్ చేసిన సంస్కరణలను చంద్రబాబు సర్వనాశనం చేస్తున్నారని అన్నారు. ఇంటింటికీ రేషన్ సరఫరా వాహనాలు రద్దు చేయడం సరికాదని హితవు పలికారు. ఇంటింటికీ రేషన్ సరఫరా వాహనాలు రద్దు చేయడం సరికాదు. వైఎస్ జగన్ చేసిన సంక్షేమ పథకాలు ఆపడం దారుణం. చంద్రబాబు డైవర్షన్ పాలిటిక్స్ చేస్తున్నారు. తాడేపల్లిలో మాజీ మంత్రి కారుమూరి నాగేశ్వరరావు మీడియాతో మాట్లాడుతూ..'వైఎస్ జగన్ తెచ్చిన సంస్కరణలు ఇతర రాష్ట్రాలకు ఆదర్శంగా నిలుస్తున్నాయి. కానీ, ఆ సంస్కరణలను చంద్రబాబు సర్వనాశనం చేస్తున్నారు. రేషన్ డెలివరీ వాహనాల వ్యవస్థను చంద్రబాబు తొలగించారు. ఈ వాహనాల ద్వారా పేదలకు ఎంతో ఉపయోగం జరిగింది. అలాంటి వ్యవస్థను చంద్రబాబు ఎలా నాశనం చేయగలుగుతున్నారు?. ఎండీయూల తొలగింపు ద్వారా 20వేల కుటుంబాలు రోడ్డున పడ్డాయి. 2.60 లక్షల మంది వాలంటీర్లను కూడా రోడ్డున పడేశారు.ఇంటింటికీ మద్యం సరఫరా చేస్తూ రేషన్ బియ్యాన్ని ఆపేయటం ఏంటి?. పేద, మధ్య తరగతి ప్రజలకు రేషన్ నిలిపేసేందుకు ప్రభుత్వం ఎ÷-లాన్ చేస్తోంది. ఫస్ట్ ఎండీయూ వాహనాలు ఆ తర్వాత డిపోలు తొలగిస్తారు. చంద్రబాబుది శాడిస్టు బుద్ధి. అందుకే ప్రజలను పట్టి పీడిస్తున్నారు. గోదావరి వరదలు, విజయవాడ వరదల సమయంలో ఎండీయూ వాహనాలే ఆదుకున్నాయి. ఎండీయూ వాహనదారులకు మేము అండగా నిలుస్తాం. ఆ వాహనాలను కొనసాగించాల్సిందే. లేకపోతే వైఎస్సార్‌సీపీ పెద్ద ఎత్తున ఆందోళన చేస్తాం. ఎండీయూ వాహనాల ద్వారా ఏం అక్రమాలు జరిగాయో ప్రభుత్వం చెప్పాలి?. సీజ్ ద షిప్ ఎపిసోడ్ ఏమైంది?. ఆ కేసులో ఎంత బియ్యం సీజ్ చేశారో ప్రభుత్వం ఎందుకు చెప్పటం లేదు?. జగన్ సంస్కరణలను నాశనం చేయాలన్నదే చంద్రబాబు లక్ష్యం అని మండిపడ్డారు.

## అమెరికాలో దారుణం

- భారత సంతతి వ్యాపారి హత్య
- తోటి భారతీయుడే హంతకుడు





**టెక్సాస్,మే21( వెలుతురు):**
ఆమెరికాలో మరో భారత సంతతికి చెందిన వ్యక్తిని హత్య గురయ్యారు. టెక్సాస్‌లోని ఆస్టిన్ ప్రాంతంలో మరో భారతీయుడు అతన్ని బస్సులో హత్య చేశాడు. హెల్త్-టెక్ స్టార్టప్ కంపెనీ సహ వ్యవస్థాపకుడిగా ఉన్న భారత సంతతికి ( చెందిన అక్షయ్ గుప్తా.. మే 14వ తేదీన ఓ బస్సులో ప్రయాణిస్తుండా.. వెనక కూర్చున్న మరో భారతీయుడు దీపక్ కండేల్ దాడి చేసి అతన్ని హతమార్చాడు. అధికారులు వెంటనే స్పందించి గుప్తాను ఆస్పత్రికి తరలించారు. కానీ, అప్పటికే అతను ప్రాణాలు కోల్పోయాడు.ఎలాంటి గొడవ జరగకపోయినా.. జరగకపోయినా.. కండేల్ దాడి చేసినట్లు సిసిటివి దృశ్యాల ద్వారా బయటపడింది. వాటి ఆధారంగా నిందితుడిని గుర్తించి అరెస్ట్ చేసిన పోలీసులు అతనికపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. అయితే, అక్షయ్ గుప్తా తన మామలా కనిపించడం వల్లే అతనిని కత్తితో పొడిచానని కండేల్ చెప్పడం గమనార్హం. పెన్ స్టేట్ యూనివర్సిటీ నుంచి మాస్టర్స్ పూర్తి చేసిన అక్షయ్ ఇటీవల తన కొత్త ప్రాజెక్టు కోసం మైక్రోసాఫ్ సిఇవొ సత్యనాదెళ్లను కలిశారు. అక్షరు గుప్తా తన మామలా కనిపించడం వల్లే తాను అతనిని కత్తితో పొడిచానని నిందితుడు పోలీసులకు పేర్కొనడం గమనార్హం. అక్షరు పెన్ స్టేట్ యూనివర్శిటీ నుంచి మాస్టర్స్ పూర్తి చేశారు.

## ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్న మెప్మాలు

**మహబూబ్ నగర్, మే 21, ( వెలుతురు)**
మెప్మా పరిధిలోని సహాయక సంఘాల్లో అక్రమాలు ఒక్కొక్కటిగా బయటపడుతున్నాయి. మున్సిపాలిటీల పరిధిలో ఉం డే పొదుపు సహాయక సంఘాల సభ్యుల లె క్కలు పద్దులు చూసేందుకు ప్రభుత్వం ఆర్పీలు ( రిసోర్స్ పర్సన్లు) ఏర్పాటు చేసిం ది. ఆర్పీలు మహిళా సంఘాల సభ్యులకు లోన్లు అందజేయాల్సి ఉన్నది.అయితే ఆర్పీ లు తమ ఇష్టానుసారంగా వ్యవహరిస్తూ అవినీతికి పాల్పడుతున్నారు. 50వేల రు ణాలు ఇవ్వాల్సిన చోట లక్ష రూపాయల వరకు కూడా ఇ చ్చి తాము ఆ డిందే ఆట పా డింది పాటగా వ్యవహరిస్తున్నారు. ఇప్పటికే మహబూబ్నగర్లో పలువురు ఆర్పి లపై ప్రజావాణిలో ఫిర్యాదులు సైతం చేయడం జరిగింది. మహబూబ్నగర్ జిల్లాలోని మూడు మున్సిపాలిటీలలో 135 మంది ఆర్పీలు ఉన్నారు. ఇలా ఉ మ్మడి పాలమూరు జిల్లాలో 451 మంది పైగా ఆర్పీలు ఉన్నారు.పేదరిక నిర్మూలన కార్యక్రమం లో భా గంగా మహిళా సంఘాల కు వడ్డీలేని రుణా లు ఇవ్వడం కోసం ఏర్పాటు చేసిన మెప్మ జడ్చర్ల మున్సిపాలిటీ పరిధిలోని ప్రభుత్వం భాదేపల్లి లో 23 మంది ఆర్.పి లను నియమించినది. మహిళా సంఘాల కు బ్యాంక్ ల ద్వారా రుణాలు ఇప్పించేపనికి ఈ సదరు ఆ ర్.పి లు లోన్లు ఇప్పించి లంచవతారం ఎత్తుతున్నారని ఆరోపణలు వినిపిస్తున్నా యి.నిరుపేదలైన మహిళలు స్వయం సహాయక సంఘాలు ఏర్పాటు చేసుకుని ఆర్.పి ల ద్వా రా రుణాలు మంజూరు చేయాలని వాళ్ల ఇండ్ల చుట్టూ తిరుగుతూ ఉంటే లక్షకు రూ.2 నుంచి 5000 వరకు వసూలు చేస్తున్నట్లు తెలుస్తుంది. అలా కాకుండా మొత్తం గా కో టి రూపాయల లోన్ కు ఒక రేట్ ఫిక్స్ చేసి డబ్బు వసూలు చేస్తున్నట్లు మహి ళా సభ్యులు ఆరోపిస్తున్నారు. మహిళా సాధికారత కో సం ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన మెప్మా ఉద్దే శం నీరుగారిపోయింది.ఆర్. పి లకు నెల కు6000 జీతం తోపాటు 1500 గౌరవ వేతనంగా మహిళా సంఘాల నుండి తీసుంటూనే ఇలా చేయడంపై మహి ళా సంఘాల సభ్యులు దుమ్మెత్తి పోస్తున్నారు. కోట్ల రూపాయల మహిళా సంఘా లకు ఇప్పించే రుణాల కోసం లంచాలు లాగుతున్నారు.ఇదే విషయమై ఆర్పీలపై టౌన్ కోఆర్డినేటర్లు జిల్లా కో ఆర్డినేటర్లకు ఫిర్యాదు చేసిన ఫలితం అందలేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రభుత్వం మారినా ఈ ఆర్పిలపని తీరు మారడం లేద ని మహిళా పొదుపు సంఘాలు మండి పడుతున్నాయి. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి అడ్డదారులు తొక్కుతున్న ఆర్పీలపై చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

## 21 నుంచి జూన్ 21 వరకు యోగాంధ్ర

- యోగాంధ్ర మాసోత్సవాల ప్రారంభ కార్యక్రమం
- నున్నమిఘాట్‌లో ప్రత్యేకంగా యోగాసనాలు
- ప్రారంభించిన ప్రత్యేక కార్యదర్శి టి. కృష్ణబాబు



**విజయవాడ, మే 21, ( వెలుతురు)**
సుసంపన్న, ఆరోగ్య, ఆనందమయ ఆంధ్రప్రదేశ్ లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వం ఆవిష్కరించిన స్వర్ణాంధ్ర విజన్-2047 సాకారం దిశగా ఈ నెల 21 నుంచి జూన్ 21 వరకు యోగాంధ్ర పేరుతో ప్రత్యేక ప్రచార, జనజాగృతి కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు రాష్ట్ర ప్రభుత్వ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి ఎం.టి.కృష్ణబాబు తెలిపారు. బుధవారం కృష్ణానదీ తీరాన హరిత బెరం పార్కు-పున్నమిఘాట్‌లో ఎన్‌టీఆర్ జిల్లా అధికార యంత్రాంగం, విజయవాడ నగరపాలక సంస్థ ఆధ్వర్యంలో యోగాంధ్ర మాసోత్సవాల ప్రారంభ కార్యక్రమం జరిగింది. ఇందులో వివిధ శాఖల అధికారులు, యోగా ఔత్సాహికులు, ప్రజాప్రతినిధులతో పాటు ప్రభుత్వ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి ఎం.టి.కృష్ణబాబు, ఎన్‌టీఆర్ జిల్లా కలెక్టర్ డా. జి.లక్ష్మీశ, ఆయుష్ డైరెక్టర్ కె.దినేష్ కుమార్, విజయవాడ మునిసిపల్ కమిషనర్ ధ్యానచంద్ర పాల్గొనగా యోగా ట్రైనర్ రామాంజనేయులు యోగా ప్రయోజనాలతో పాటు పతంజలి యోగ సూత్రాలను వివరించి, యోగాభ్యస నాలు చేయించారు. అనంతరం కృష్ణబాబు మాట్లాడుతూ భారతీయ వారసత్వ, ప్రాచీన సంపదను అందరికీ అందించాలనే ఉద్దేశంతో గౌరవ ప్రధానమంత్రి చొరవ కారణంగా ఐరాస తీర్మానంతో తొలిసారిగా 2015, జూన్ 21న అంతర్జాతీయ యోగా దినోత్సవ వేడుకలు జరిగాయి.. ఈ ఏడాది విశాఖలో జరిగే 11వ అంతర్జాతీయ యోగా దినోత్సవ వేడుకలకు గౌరవ ప్రధాని రానున్నట్లు తెలిపారు. యోగా ప్రయోజనాలపై అవగాహన పెంపొందించుకొని, జీవితాంతం ప్రజలు తమ జీవన మార్గంలో యోగాను భాగం చేసుకునేలా ప్రోత్సహించేందుకు గౌరవ ముఖ్యమంత్రి మార్గనిర్దేశనంతో నెలరోజుల పాటు ఊరూవాడా ప్రత్యేక ప్రచార కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు తెలిపారు. దాదాపు రెండు కోట్ల మంది ఈ కార్యక్రమాల్లో భాగస్వాములను చేసేందుకు కృషిచేస్తున్నామన్నారు. నిపుణులు రూపొందించిన 45 నిమిషాల నిడివితో ఉన్న కామన్ యోగా ప్రోటోకాల్ ఆధారంగా ఔత్సాహికులకు శిక్షణ ఇవ్వనున్నామని.. వారికి సర్టిఫికెట్లు అందజేయనున్నామని కృష్ణబాబు తెలిపారు. శిక్షణ పొందిన వారిద్వారా ప్రతి గ్రామంలో, వార్డులో ప్రజలకు యోగాభ్యసనతో శారీరక, మానసిక ఆరోగ్యానికి కలిగే ప్రయోజనాలపై అవగాహన కల్పించడంతో పాటు అభ్యసన చేయించడం జరుగుతుందన్నారు. రిజిస్ట్రేషన్‌కు వీలుగా ప్రత్యేక యాప్‌ను రూపొందించడం జరిగిందని, పోర్టల్ కూడా అందుబాటులో ఉంటుందన్నారు. ప్రతి జిల్లాలో కనీసం నాలుగు పర్యాటక ప్రాంతాల్లో రాష్ట్రం మొత్తంమీద దాదాపు 100 పర్యాటక ప్రాంతాల్లోనూ యోగాంధ్ర కార్యక్రమాలను నిర్వహించనున్నట్లు తెలిపారు. థీమ్ ఆధారిత కార్యక్రమాలతో ప్రతి వర్గానికి యోగాను చేరువచేయడంలో సమష్టి భాగస్వామ్యం అవసరమని.. అందరం కలిసి యోగాంధ్రను విజయవంతం చేద్దామని కృష్ణబాబు పిలుపునిచ్చారు. స్వర్ణాంధ్ర సాకారం దిశగా యోగాంధ్ర ఓ గొప్ప ముందడుగు అని జిల్లా కలెక్టర్ లక్ష్మీశ అన్నారు. నెల రోజుల యోగాంధ్ర కార్యాచరణలో భాగంగా గ్రామ, వార్డు సచివాలయాలతో పాటు అన్ని ప్రభుత్వ కార్యాలయాల్లో యోగా కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు కలెక్టర్ లక్ష్మీశ తెలిపారు. బాపూ మ్యూజియం, కొండపల్లి ఖిల్లా, గాంధీ హిల్ వంటి చారిత్రక, పర్యాటక ప్రాంతాల్లోనూ యోగాంధ్ర కార్యక్రమాలు నిర్వహించనున్నామన్నారు. ప్రతిఒక్కరికీ అంతర్జాతీయ యోగా దినోత్సవ శుభాకాంక్షలు తెలియజేస్తున్నట్లు తెలిపారు. ప్రతిఒక్కరూ తమ రోజువారీ జీవితంలో కొంత సమయాన్ని యోగాకు కేటాయించడం వల్ల మంచి ఫలితాలు ఉంటాయని కలెక్టర్ వివరించారు. ముఖ్యమంత్రి ఆదేశాలకు అనుగుణంగా యోగా విశిష్టతను రాష్ట్రం నలుమూలలా వ్యాప్తి చెందేలా యోగాంధ్ర ప్రచార కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు ఆయుష్ డైరెక్టర్ కె.దినేష్ కుమార్ తెలిపారు. యోగాను నిత్య జీవితంలో భాగం చేసుకుంటే మనం చేసే ప్రతి పని ద్వారా మెరుగైన ఫలితాలు వస్తాయని పేర్కొన్నారు. యోగాతో జీవనశైలిని మార్చుకొని ఒత్తిడిని దూరం చేసుకొని ఆనందమయ జీవితాన్ని పొందుదామని పేర్కొన్నారు. నేటి ఆధునిక జీవనశైలిలో ఫిట్‌నెస్‌ను పెంపొందించుకోవడం సవాలుగా మారిందని, ఈ నేపథ్యంలో ఒత్తిడిని అధిగమించి, రోజువారీ జీవితంలో వెలుగులు నింపుకునేందుకు ప్రతిఒక్కరూ రోజూ కనీసం అరగంట యోగాభ్యసనాలు, ధ్యానం చేయాలని విజయవాడ మునిసిపల్ కమిషనర్ ధ్యానచంద్ర హెచ్ఎం సూచించారు. యోగాంధ్రలో భాగంగా విజయవాడ నగరపాలక సంస్థ పరిధిలో ప్రత్యేక అవగాహన, యోగాభ్యసన కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈుర్యక్రమంలో విజయవాడ ఆర్‌డీవో కావూరి చైతన్య, విజయవాడ నగరపాలక సంస్థ అదనపు కమిషనర్ డి.చంద్రశేఖర్, జిల్లా ఆయుష్ శాఖ అధికారి డా. రామత్లేహి, జిల్లా అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## సీబీఐకు చుక్కలు చూపిస్తున్న జీవన్ లాల్

**హైదరాబాద్, మే 21, ( వెలుతురు)**
చరిత్రలో తొలిసారిగా సిబిఐ అధికారులు తలలు పట్టుకుంటున్నారు. అసలు తీయ లాగినా కూడా డొంక కదలకపోవడంతో విస్తు పోతున్నారు. ఈడీ అధికారులతో ఎన్నో ఆర్థిక అక్రమాలకు సంబంధించిన కేసులను చేదించిన చరిత్ర సీబీఐ కి ఉంది. కానీ ఇండియన్ రెవెన్యూ సర్వీస్ కు సంబంధించిన అధికారి జీవన్ లాల్ విషయంలో మాత్రం సిబిఐ అధికారులు తలలు పట్టుకుంటున్నారు. ఆర్థిక అక్రమాలకు.. అవకతవకలకు.. లంచాలకు అలవాటు పడిన ఆయన.. ఇష్టానుసారంగా వ్యవహరించాడు. అడ్డగోలుగా సంపాదించి.. కోట్లకు పడగలెత్తాడు. అయితే ఇటీవల 70 లక్షల లంచానికి సంబంధించిన కేసులో సిబిఐ అధికారులకు అడ్డంగా దొరికిపోయిన ఆయన.. ఇప్పుడు జైల్లో ఉన్నప్పటికీ కూడా.. సిబిఐ అధికారులకు చుక్కలు చూపిస్తున్నాడు.వైరా మాజీ ఎమ్మెల్యే రాములు నాయక్ తనయుడిగా జీవన్ లాల్ అప్పటి అధికార పార్టీలో తెర వెనుక చక్రం తిప్పాడు. ఆయన ఏకంగా తెలంగాణ ఆదాయపు పన్ను శాఖలో కీలక పోస్టింగ్ సంపాదించాడు. ఆ తర్వాత ఇక్కడ పెద్ద పెద్ద కంపెనీలకు మేళ్ళు చేకూర్చాడు. దానికి ప్రతిగా భారీగా లంచాలు వసూలు చేశాడు. సాధారణంగా లంచాలను పరోక్షంగా అధికారులు వసూలు చేస్తుంటారు. కానీ జీవన్ లాల్ స్టైల్ మాత్రం దానికి పూర్తి విభిన్నం. లంచాల కోసం అతడు ఏకంగా ఒక విభాగాన్ని ఏర్పాటు చేసుకున్నాడు. అంతేకాదు లంచాలను వసూలు చేస్తూ.. వాటిని తన బినామీ ల పేరు మీద నమోదు చేసేవాడు. షాపూర్జీ పల్లోంజీ గ్రూపునకు సంబంధించిన ఫైల్ క్లియరెన్స్ విషయంలో 70 లక్షల లంచాన్ని జీవన్ లాల్ డిమాండ్ చేశాడు. చివరికి ఆ వ్యవహారం కాస్త సిబిఐ దాకా వెళ్ళింది. దీంతో సిబిఐ దర్యాప్తు మొదలుపెట్టి జీవన్ లాల్ ను అదుపులోకి తీసుకుంది. ఆ తర్వాత అతని వ్యవహారాలు



ఒక్కొక్కటిగా వెలుగులోకి వస్తుంటే సిబిఐ అధికారులకు మైండ్ పోయినంత పని అయింది. చివరికి అతడు వసూలు చేసిన లంచాలు.. రిజిస్ట్రేషన్ చేసిన ఆస్తులు.. ఇతర వ్యవహారాలు చూసి అధికారులకు దిమ్మ తిరిగిపోయింది. అయితే ఇదంతా ట్రైలర్ మాత్రమేనని.. అసలు సినిమా అంతకుమించి అనే రేంజ్ లో ఉందని సిబిఐ అధికారులు చెబుతున్నారు.. సాధారణంగా అధికారులు లంచాలు వసూలు చేస్తే.. వాటిని పరోక్షంగా వసూలు చేస్తుంటారు. జీవన్ లాల్ మాత్రం వసూలు చేసిన లంచాలను స్థిరాస్తులను కొనుగోలు చేయడానికి ఉపయోగించాడు. పైగా వాటిని తన బినామీ ల పేరు మీద రిజిస్ట్రేషన్ చేయించాడు. ఇంకా కొన్ని ఆస్తులునైతే తన భార్య తరఫున బంధువుల పేరు మీద రిజిస్ట్రేషన్ చేయించుకుని.. ఒరిజినల్ డాక్యుమెంట్స్ తన వద్ద పెట్టుకున్నాడు. అనధికారికంగా తెలిసిన సమాచారం ప్రకారం జీవన్ లాల్ ఆస్తులు వందల కోట్లల్లో ఉంటాయని తెలుస్తోంది. హైదరాబాద్ మాత్రమే కాకుండా.. ఏపీలోని విజయవాడ, విశాఖపట్నం.. ఇతర ప్రాంతాలలో అతడికి భారీగా ఆస్తులు ఉన్నట్టు తెలుస్తోంది. లంచాలకు సంబంధించిన కేసులో ఒక అధికారిని అదుపులోకి తీసుకోవడం సిబిఐ చరిత్రలో తొలిసారి. అయితే లంచాల వ్యవహారంలో జీవన్ లాల్ మాత్రమే ఉన్నాడా.. ఇంకా ఎవరైనా ఉన్నారా.. అనే కోణంలో సిబిఐ అధికారులు దర్యాప్తు చేస్తున్నారు.

## మన మధ్యనే దేశద్రోహులు...

*సిరాజ్, సమీర్, జ్యోతి...*

**హైదరాబాద్, మే 21, ( వెలుతురు)**
ఒకడేమో దేశంపై కుట్ర చేశాడు. మానవ బాంబులను ఉపయోగించి వీలైనంత మందిని హతమార్చేందుకు ప్లాన్ చేశాడు. మరొకడు యాంటీ ఇండియా గ్రూపులో చేరి దేశంపై సైబర్ వార్‌కు దిగాడు. మరో కిలాడీ లేడీ.. యూట్యూబర్ ముసుగులో దేశ రహస్యాలను శత్రు దేశానికి అమ్మేసింది. ఇలాంటి 17 మంది దేశద్రోహులను గుర్తించిన పోలీసులు.. మిగిలిన వారి జాడ వెలికితీసే పనిలో పడ్డారు. అయితే కరుడు గట్టిన ఈ ద్రేశద్రోహులను.. శుద్ధపూసలని చెబుతున్నారు వారి కుటుంబ సభ్యులు.హైదరాబాద్‌లో పేలుళ్లకు కుట్ర చేసిన కేసులో సిరాజ్, సమీర్ అనే యువకులను అరెస్ట్ చేసిన ఎన్ఐఏ అధికారులు వారినుంచి ఉగ్ర సమాచారం రాబట్టే ప్రయత్నం చేస్తున్నారు. పేలుళ్ల కుట్రపై దర్యాప్తు కొనసాగుతున్న కొద్దీ సంచలన విషయాలు వెలుగులోకి వస్తున్నాయి. ఐసిస్ భావజాలానికి ఆకర్షితులై పేలుళ్లకు సిద్ధపడ్డారు సిరాజ్, సమీర్. తన ఉనికిని చాటుకునేలా జనసాంద్రత ఎక్కువగా ఉన్నచోట భారీ పేలుళ్లకు కుట్ర చేశారు. దీనికి సంబంధించిన ఆధారాలను కూడా సేకరిస్తున్నారు ఎన్ఐఏ అధికారులు. అయితే ఇంత జరుగుతున్నా కూడా తన తమ్ముడు అమాయకుడని చెబుతోంది సమీర్ సోదరి ఆలియా. అతడికి లిఫ్ట్‌ను రిఫేర్ చేయడంతో తప్ప మరో విషయం తెలియదని వాపోతోంది.మరోవైపు వీడియోల మాటున విదేశీ గూఢచర్యం



చేస్తూ పట్టుబడింది జ్యోతి మల్హోత్రా అనే యూట్యూబర్. పాక్ ఏజెంట్లతో డీల్స్ కుదుర్చుకుని దేశ రహస్యాలను అమ్మేసింది. ఈమె కేసును విచారించే కొద్దీ సంచలన విషయాలు వెలుగులోకి వస్తున్నాయి. పెహల్గామ్ ఘటన వెనుక కూడా ఈమె హస్తం ఉందన్న అనుమానాలు బయటపడుతున్నాయి. మిలియన్ల కొద్దీ వ్యూస్‌తో సబ్ స్క్రైబర్స్‌నే కాదు పుట్టిన నేలనూ, కన్నవారినీ అడ్డంగా, నిలువునా మోసం చేసింది ఈ దేశద్రోహి. అయితే ఇంత చేసినా తన కుమార్తెపై ఇసుమంతైనా అనుమానం రాలేదంటున్నాడు ఆమె తండ్రి హరీష్. ఆమె ఢిల్లీ వెళ్లి వస్తున్నట్టు తనకు తెలుసు తప్ప.. పాకిస్తాన్‌కు వెళ్లిన విషయమే తనకు తెలియదంటున్నాడు. జ్యోతి, సమీర్, సిరాజ్‌లే కాదు నిత్యం మనతోనూ ఉండి మనపైనే కుట్రలు చేస్తున్నారు అనేక మంది దేశద్రోహులు. మన మధ్యనే మన చుట్టూ ఉంటూ.. నిశ్శబ్దంగా ఎవరి పనుల్లో వాళ్ళు ఉంటున్నారు. అయితే అదను చూసి దేశంపై దాడికి దిగుతున్నారు. ఇదే క్రమంలో సైబర్ టెర్రరిస్ట్‌గా మారిన జాసిమ్ అన్సారీ అనే వ్యక్తిని గుజరాజ్ ఏటీఎస్ పోలీసులు అరెస్ట్ చేశారు. ఆపరేషన్ సింధూర్ సమయంలో యాంటీ ఇండియా గ్రూపులో చేరి ప్రభుత్వ వెబ్‌సైట్లపై సైబర్ దాడులు చేశాడు ఈ దేశద్రోహి. ప్రస్తుతం ఇలాంటి ద్రోహుల జాడ కనిపెట్టే పనిలో పడ్డాయి భద్రతా దళాలు. శత్రుదేశంతో చేతులు కలిపి దేశంలో కుట్రలు చేస్తున్న ఇలాంటివారిని వలవేసి పట్టుకుంటున్నారు.


Edited, Printed, Published and Owner by BAKKA YADAIAH, Published & Printed at SRI SHANTHI PUBLICCATIONS H.No. 7-2-31/221/2, S.V. Colony, Bairamalaguda, Saroornagar, Mdl.R.R. DIST, Telangana-79. EDITORG BAKKA YADAIAH, R.N.I. TEL TEL /2019 / 78609. Cell:91773 87328, Email: velthurunewspaper@gmail.com